thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 304 | కరీంనగర్ శుక్రవారం, 10 జనవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత సరిహద్దుల్లో బంగ్లాదేశ్ డ్రోన్స్...

భారత్, బంగ్లాదేశ్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు క్రమంగా పెరుగుతున్నాయి. అందుకు బంగ్లాదేశ్ ఆర్మీ పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో బైరక్టార్ TB-2 కిల్లర్ డ్రోన్‌ను మోహరించడమేనని చెప్పవచ్చు. బంగ్లాదేశ్ ఆర్మీ మోహరింపుతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెరిగింది. ఈ ప్రాంతం భారతదేశంలో చాలా సున్నితమైనదిగా పరిగణించబడుతుంది. టర్కియే TB-2 డ్రోన్ చాలా శక్తివంతమైనది. ఇది దాడి చేయడమే కాకుండా, గూఢచర్యం చేయడంలో కూడా సహాయపడుతుంది. దీంతో ఇరు దేశాల మధ్య పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఈ డ్రోన్‌లను బంగ్లాదేశ్‌లో 67వ సైన్యం నిఘా కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారని చెబుతున్నారు. బంగ్లాదేశ్ రక్షణ అవసరాల కోసం మోహరింపు అని చెప్పినప్పటికీ, ఆధునాతన డ్రోన్‌లను సున్నితమైన ప్రాంతంలో ఉంచడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

# భవిష్యత్తు యుద్ధంలో కాదు....
# బుద్ధుడిలో ఉంది!
## రష్యా, ఇజ్రాయెల్‌కు మోదీ సందేశం

భువనేశ్వర్ : మానవుడి భవిష్యత్తు యుద్ధంలో లేదని.. బుద్ధుడిలో ఉందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. నేడు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒడిశాలో అడుగడుగునా వారసత్వం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడినుంచి వ్యాపారులు సుమత్రా, బాలి, జావా వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. “భారత్ ప్రజాస్వామ్యానికి కేవలం తల్లి లాంటిది మాత్రమే కాదు.. అది మన జీవితాల్లో భాగం. విదేశాల్లో జీవించేవారు భారత్‌కు రాయబారులుగా నేను చూస్తాను. భారత్ నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జీ20 సందర్భంగా దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేశాం. మన వారసత్వ, విభిన్న సంస్కృతులను ప్రపంచం గమనిస్తోంది. భారత్ స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసులు కూడా తోడ్పడ్డారు.

ప్రవాస భారతీయులు వచ్చే ఏడాది ఈ ఉత్సవానికి వచ్చే సమయంలో కనీసం ఐదుగురు విదేశీ మిత్రులను తమతోపాటు తీసుకురండి. భారత్ కేవలం యువ దేశమే కాదు.. నిపుణులైన యువకుల దేశం. భారత్‌కు ‘విశ్వబంధు’గా గుర్తింపు ఉంది. దానిని మరింత బలోపేతం చేయాలి” అని ప్రధాని మోదీ ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. మహాకుంభ్, సంక్రాంతి, లోహిర్, మాగ్ బిహు వంటి పండుగల సీజన్‌లో ప్రవాస భారతీయ వేడుకలు జరగడం విశేషమన్నారు. ఈసందర్భంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షుడు క్రిస్టీనే కార్ల వీడియో సందేశం పంపించారు. ఆమె భారత్ పురోగతిని కొనియాడారు. రష్యా, ఇజ్రాయెల్ పేర్లను నేరుగా ప్రస్తావించకుండా భవిష్యత్తు యుద్ధంలో కాదని.. బుద్ధుడిలో ఉందని పేర్కొన్నారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు అవకాశం ఉన్నా.. బౌద్ధం స్వీకరించారని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మోదీ ‘ప్రవాసి భారతీయ ఎక్స్‌ప్రెస్’ రైలును భువనేశ్వర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఒడిశా సీఎం మోహన్‌చరణ్ మాఝీ తదితరులు పాల్గొన్నారు.




## 18వ ప్రవాస భారతీయ దినోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ




హైదరాబాద్: నిన్న (బుధవారం) అర్వింద్ కుమార్‌ను విచారించిన ఏసీబీ అధికారులు ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. స్పాన్సర్ కంపెనీ ఎందుకు తప్పుకుంది.. వారి నుంచి మీకు ఎలాంటి సమాచారం అందింది.. పురపాలక శాఖను ఎందుకు రెండో ఒప్పందంలోకి లాగారు.. హెచ్‌ఎండీఏ జనరల్ ఖాతా నిధులను విదేశీ కరెన్సీ రూపంలో ఎందుకు చెల్లించాలని ఆదేశించారు.. ఆర్థికశాఖ అనుమతి లేకుండా ఇవన్నీ చేయకూడదనే విషయం తెలియదా.. అనే కోణంలో కేటీఆర్‌ను ప్రశ్నించనున్నట్లు సమాచారం.

ఒక మంత్రిగా ప్రభుత్వ ధనాన్ని కాపాడాల్సింది పోయి విదేశీ కంపెనీలో ఒప్పందం ఎలా చేసుకున్నారు.. నిబంధనల ఉల్లంఘన కనిపిస్తున్నా.. ఎందుకు నివారించలేకపోయారు... అన్న విషయాలపై అర్వింద్ కుమార్ వాంగ్మూలం ఆధారంగా ఏసీబీ కేటీఆర్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

**కేటీఆర్‌పై ముగిసిన ఏసీబీ విచారణ.. ఆరున్నర గంటలపాటు...** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో ఏసీబీ విచారణ ముగించింది. ఈరోజు దాదాపు ఆరున్నర గంటలపాటు విచారించారు. ఈ కేసులో నిధుల మళ్లింపుపై కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీ అధికారులు ఆయనను నడిపించి విచారణ కోసం తీసుకొచ్చారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో పెద్ద మొత్తంలో నిధుల చెలామణీ, అన్యాయంగా ఆర్థిక లావాదేవీలు జరగడం వివాదంగా మారింది. ఈ వివాదంలో కేటీఆర్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు.

**ఎప్పుడు పిలిచినా సిద్ధం..** ఈ నేపథ్యంలో విచారణకు ఎప్పుడు పిలిచినా కూడా రావాలని ఏసీబీ తెలుపగా, కేటీఆర్ వస్తానని చెప్పారు. అయితే పలు రకాల ప్రశ్నలనే 40 విధాలుగా అడిగారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను చెప్పాల్సినది చెప్పినట్లు తెలిపారు కేటీఆర్. అంతేకాదు ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అధికారులు అడిగారని కేటీఆర్ అన్నారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో అరెస్ట్ అవుతారా అని బీఆర్‌ఎస్ వర్గాలు భయాందోళన చెందాయి.

**ఈ కేసులో రూ. 55 కోట్లు...** కేటీఆర్‌కు ఈ కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి, అవి నిరూపించడానికి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ కేసు చుట్టూ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పూర్తి విచారణ కోసం కేటీఆర్ ఈరోజు ఉదయం ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట న్యాయవాది రామచంద్రరావు కూడా హాజరయ్యారు. కేటీఆర్‌ను ముగ్గురు ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. అరవింద్ కుమార్, దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా ఈ విచారణ జరగింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రాజెక్టులో నియమాలను ఉల్లంఘించి రూ.55 కోట్లు ఎఫ్‌ఈవోకు బదిలీ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.


**రాజకీయ వర్గాల్లో..** ఈ అంశంపై ఏసీబీ కేటీఆర్‌ను విచారించింది. అయితే కేటీఆర్ విచారణ సందర్భంగా న్యాయవాదికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది.

ఈ ఆదేశం ప్రకారం కేటీఆర్ విచారణను అనుసరించి, న్యాయవాది లైబ్రరీలో కూర్చోవడం ద్వారా ఏసీబీ చర్యలు తీసుకుంది. కేటీఆర్-న్యాయవాది సంభాషణలకు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విచారణ తర్వాత కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆఫీస్‌లో విచారించారు. ఆయనను ప్రధాన నిందితుడిగా పేర్కొనడం, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం తదితర చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ కేసు విషయంలో తర్వాత ఎలాంటి పరిణామాలు ఉంటాయేనని రాజకీయ వర్గాలతోపాటు అనేక మంది ఆసక్తితో ఉన్నారు.



## నేడు జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం

సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సచివాలయంలో సీఎం అన్ని జిల్లాల కలెక్టర్లతో మీటింగ్ లో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నారు. కాగా త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో.. ప్రజల్లోకి ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పలు కార్యక్రమాలు చేపట్టాలని ఇదివరకే సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల్లో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, ఇంకా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి అనే అంశాల మీద రేపు సీఎం కలెక్టర్లతో చర్చించనున్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించేందుకు కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించిందని తెలుస్తోంది. ఇటు పార్టీ నాయకులకు, అటు అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి సహా ముఖ్య నేతలంతా బిజీ బిజీగా సమీక్షల్లో, పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.




# ఇక ప్రజలకు మెరుగైన
# రెవెన్యూ సేవలు
## నూతన చట్టాన్ని వేగంగా అమలులోకి తీసురానున్న కాంగ్రెస్ సర్కార్

హైదరాబాద్ : భూ భారతి చట్టానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తెచ్చామన్నారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామన్నారు. సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టం అమలు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం వ్యక్తిగత స్వార్థం కోసం రెవనెన్యూ చట్టాన్ని ఛిన్నాభిన్నం చేసిందని ధ్వజమెత్తారు పొంగులేటి. తెలంగాణలో భూ సమస్య లేని గ్రామం లేదన్నారు. రెవెన్యూ పాలన చూసేందకు ప్రతీ గ్రామానికో అధికారిని నియమిస్తామని తెలిపారు పొంగులేటి. తెలంగాణ భూ భారతి (భూ హక్కుల చట్టం)-2024 బిల్లుకు 2024 డిసెంబర్ 20న అసెంబ్లీ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే..

**భూ భారతి బిల్లులోని ప్రధానాంశాలు..** అనుభవదారుడి వివరాలు కూడా రెవెన్యూ రికార్డులో నమోదు కానున్నాయి. అనుభవదారుడికి ఈ చట్టం రక్షణగా నిలుస్తుంది. ప్రస్తుత ధరణి చట్టంలో ఈ అవకాశం లేదు. ధరణిలో ఉన్న తప్పులను సవరించడానికి, భూమి ఉండి కూడా కొత్త పాస్ పుస్తకాలు రాని వాళ్లకు (పార్టుబీ కేసులకు 18 లక్షల ఎకరాలు) రికార్డులకు ఎక్కించి పాస్ పుస్తకాలను ఇచ్చే విధంగా కొత్త చట్టం రూపొందించారు. ఈ తరహా భూ సమస్యలను పరిష్కరించడానికి లేదా ఈ పని చేయడానికి లేదా సరి చేయడానికి తహశీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం కల్పిస్తారు. ప్రస్తుతం ఉన్న ధరణి రికార్డును పూర్తిగా ప్రక్షాళన చేసిన తర్వాతనే కొత్త చట్టం కింద రికార్డును నమోదు చేస్తారు. అప్పటివరకు ఇప్పుడున్న ధరణి రికార్డు తాత్కాలికంగానే కొనసాగుతుంది. ప్రక్షాళన చేసి కొత్త రికార్డును రూపొందిస్తారు. భవిష్యత్తులో భూ సర్వేను కూడా చేసి రికార్డును రూపొందించుకునే అవకాశం కల్పించనున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత వెనువెంటనే మ్యుటేషన్ జరిగి పాస్ పుస్తకం వస్తుంది. ఒకవేళ ఏదైనా తప్పు జరిగితే అప్పీల్ చేసుకునే అవకాశం కూడా కొత్త చట్టం కల్పిస్తుంది. భవిష్యత్తులో భూవివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే చేయించి శాశ్వతంగా పరిష్కరించే విధానం అందుబాటులోకి వస్తుంది. మ్యుటేషన్‌కు మ్యాప్ తప్పనిసరిగా ఉంటుంది. పాస్ పుస్తకంలో కూడా మ్యాప్ ఉంటుంది. దీంతో సరిహద్దు వివాదాలు, డబుల్ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండదు. వారసత్వ భూములకు నిర్ణీత కాలంలో విచారణ చేసిన తర్వాతనే పాస్ పుస్తకాలు జారీ అవుతాయి. ఇంతకు ముందు ఎలాంటి విచారణ లేకుండానే జారీ చేయడం అన్నదమ్ముల మధ్య, కుటుంబాలలో వివాదాలకు దారితీసింది. ఇక నుంచి ఈ పరిస్థితి ఉండదు. 13బీ, 38ఈ, ఓఆర్‌సీ, లావుని పట్టా వంటి మార్గాల్లో భూమి వచ్చినప్పుడు పాస్ పుస్తకాలు పొందే అవకాశం పాత చట్టంలో లేదు. వీరందరికీ కూడా పాస్ పుస్తకాలను ఆర్డీవో ద్వారా ఇచ్చే అవకాశాన్ని కొత్త చట్టం కల్పిస్తుంది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్న సుమారు 9 లక్షల పైగా ఉన్న సన్న, చిన్న కారు రైతులకు ఈ చట్టం పరిష్కారం చూపుతుంది. పాత చట్టంలో ఈ అవకాశం లేదు. 2020 నవంబర్ 10 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం లభించనుంది. గ్రామ కంఠం, ఆబాదీలకు కూడా హక్కుల రికార్డును ఈ చట్టం కల్పిస్తుంది. భూ సమస్యలను జిల్లా స్థాయిలోనే పరిష్కారం కానున్నాయి. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ, ప్రత్యేకంగా భూమి ట్రిబ్యునల్ ఏర్పాటు జరుగనుంది. అవసరాన్ని, ప్రాంతాన్ని బట్టి వీటి సంఖ్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఏ విధమైన భూ సమస్యలున్నా కోర్టులకు వెళ్లకుండా జిల్లా స్థాయిలోనే పరిష్కారం దొరుకుతుంది. ఏ రైతైనా ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో అప్పీల్ చేసుకోలేని పరిస్థితి ఉంటే, అలాంటి వారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుంది. గత ప్రభుత్వం కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా ప్రైవేట్?లో బంధించింది. ఇప్పుడు భూ-భారతితో ఎవరైనా ఎక్కడి నుంచైనా చూసుకునేలా డిస్‌ప్లే చేస్తారు. ప్రభుత్వ ఆస్తుల్ని ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుని శిక్షించేలా కొత్త చట్టంలో నిబంధనలున్నాయి. ధరణిలో 33 మాడ్యూళ్లు (ఆప్షన్స్) ఉండగా.. ఇప్పుడు దాన్ని ఆరు మాడ్యూళ్లకు కుదించారు. రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ ఆఫీసుల్లో భద్రపరుస్తారు. ధరణిలో రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా మ్యుటేషన్ జరిగేటప్పుడు ఏవైనా తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునే వ్యవస్థ లేదు. ఎవరికి ఫిర్యాదు చేసుకోవాలో తెలియని పరిస్థితి. ఇప్పుడు కొత్త చట్టం అప్పీలేట్ అథారిటీని ఏర్పాటు చేస్తుంది.




## సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. మీ ఇళ్లు జాగ్రత్త: పోలీసుల ప్రత్యేక సూచనలు

**సంక్రాంతి పండుగకు ఊరెళ్తున్న వారికి తెలంగాణ పోలీసులు ప్రత్యేక సూచనలు చేస్తున్నారు. వరుస సెలవులు, పండుగ సీజన్ కావడంతో ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టకుండా బయటకు వెళ్తే మాత్రం దొంగలు తమ చేతులకు పనిచెప్పే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో చోరీలను నియంత్రించేందుకు పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.**

## మెరుగైన రెవెన్యూ సేవలందిస్తాం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్: 'భూ భారతి–2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర పడటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. గ్రామాలలో రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇప్పటికే కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని.. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. కొందరికి సేవ చేయడానికి మాత్రమే పరిమితమైన రెవెన్యూ సేవలను అందరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేసి భూభారతి పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఆర్వోఆర్–2020ను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ.. ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ 18న భూభారతి చట్టం బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. అదే నెల 20, 21 తేదీల్లో శాసనసభ, మండలి ఆమోదం తెలిపింది. ఆపై గర్నవర్‌కు ఈ బిల్లును పంపగా.. ఈరోజు భూభారతికి ఆమోదం తెలిపారు గవర్నర్. భూభారతితో రైతులకు ప్రయోజనం చూకూరుతుందని ఇది వరకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్ సైట్..** ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదులకు ఏర్పాటు చేసిన indirammaindlu.telangana.gov.in ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించార. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్‌ఎంసీలో 88శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి వివరించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు తెలంగాణ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 13 నుంచి 23 వరకు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు అనుమతించింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తన పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. బ్రిస్బేన్, దావోస్, ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇందుకోసం ఆరు నెలల పాటు తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం.. జులై 6లోగా పాస్‌పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది.




ఫార్ములా–ఈ రేసు కేసు వ్యవహారంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది.

దీనిపై తక్షణ విచారణ అవసరం లేదని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. జనవరి 15న క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుపుతామని వెల్లడించింది. మరోవైపు, ఫార్ములా–ఈ రేసు కేసులో కేటీఆర్ నేడు ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. రేసు నిర్వహణకు ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఇచ్చిన ఆదేశాలపై భారాస నేతను ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

అర్వింద్ కుమార్ ఇచ్చిన స్టేట్‌మెంట్, రికార్డ్ చేసిన అంశాల ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

ఒప్పందంలో కేటీఆర్ పాత్ర, విదేశీ సంస్థకు నగదు చెల్లింపుల్లో ఇచ్చిన ఆదేశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

## మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట




దిల్లీ: సినీనటుడు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం సినీనటుడు మోహన్‌బాబు ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మోహన్‌బాబు దాఖలుచేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను గత నెల 23న తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. దాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.




హైదరాబాద్: ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో తనపై నమోదైన కేసులో భారాస కార్యానిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ గురువారం ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఉదయం 10.10 గంటలకు ఆయన ఏసీబీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన వెంట న్యాయవాది రామచంద్రరావు ఉన్నారు.

ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. మాజీ మంత్రిని విచారిస్తున్నారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షిస్తున్నారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాదికి ఏర్పాట్లు చేశారు.

ఫార్ములా–ఈ రేసు నిర్వహణకు అర్వింద్ కుమార్ ఇచ్చిన ఆదేశాలపై భారాస నేతను ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. అర్వింద్ కుమార్ ఇచ్చిన స్టేట్‌మెంట్, రికార్డ్ చేసిన అంశాల ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఒప్పందంలో కేటీఆర్ పాత్ర, విదేశీ సంస్థకు నగదు చెల్లింపుల్లో ఇచ్చిన ఆదేశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

**ఇంకో వెయ్యి కేసులు పెట్టినా ఎదుర్కొంటాం: కేటీఆర్..** కేటీఆర్ విచారణ దృష్ట్యా అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయం వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో తన వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టు బుధవారం అనుమతినిచ్చిన సంగతి తెలిసిందే. ప్రశ్నిస్తున్న గదిలోకి మాత్రం ఆయనకు అనుమతి ఉండదని స్పష్టంచేసింది. విచారణను కనిపించేంత దూరం నుంచి గమనించవచ్చని న్యాయస్థానం తెలిపింది.




హైదరాబాద్: ఫార్ములా ఈ–రేస్ వ్యవహారంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ నేడు ఏసీబీ విచారణకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి ఆయన వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఆయన్ను గృహ నిర్బంధం చేశారు. మరోవైపు కేటీఆర్ నివాసానికి ఎమ్మెల్సీ కవిత సహా భారాస ఎమ్మెల్యేలు చేరుకున్నారు. భర్త అనిల్‌తో కలిసి కవిత అక్కడికి వచ్చారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, కోరుకంటి చందర్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. న్యాయవాది రామచంద్రరావు, లీగల్ టీమ్ కేటీఆర్ ఇంటికి వచ్చారు.

## ఫార్ములా-ఈ రేసు కేసు.. ఈడీ విచారణకు హాజరైన అర్వింద్‌కుమార్



హైదరాబాద్: ఫార్ములా ఈ–రేసు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ హాజరయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఆయన వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు రూ.45.71 కోట్ల బదిలీపై అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఆ కోణంలో అర్వింద్‌కుమార్‌ను విచారిస్తున్నట్లు సమాచారం.



## విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన భట్టి విక్రమార్క

**వనపర్తి: రేవల్లి మండలం తల్పనూరు గ్రామంలో 33/11 కే వీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తన సోదరుడు మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి, డీసీసీబీ చైర్మన్, కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.**




బ్రిటన్‌లో ప్రస్తుతం 'గ్రూమింగ్ గ్యాంగ్' అంశం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. ఈసందర్భంగా 'ఆసియన్ గ్రూమింగ్ గ్యాంగ్స్' అంటూ జరుగుతోన్న ప్రచారంపై శివసేన యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆ ప్రచారాన్ని ఖండించిన ఆమె.. పాకిస్థాన్ గ్రూమింగ్ గ్యాంగ్స్ అని పిలవాలని కోరారు. అలాగే ఒక దేశం చేసిన పనిని ఆసియన్లందరికీ ఆపాదించడం ఎందుకని ప్రశ్నించారు. ఇది ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ దృష్టికి చేరగా, అది నిజమేనంటూ ఆయన బదులిచ్చారు. ఇదిలాఉంటే.. మస్క్ "గ్రూమింగ్ గ్యాంగ్"ల విషయంలో బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్‌పై సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. 2008–2013 సమయంలో పాకిస్థాన్ మూలాలు ఉన్న వ్యక్తి ఓల్డ్ హెూమ్‌లో లైంగిక వేధింపుల గ్యాంగ్‌లను నడిపినా అప్పట్లో క్రౌన్ ప్రాసిక్యూషన్ హెడ్‌గా ఉన్న ప్రస్తుత ప్రధాని కీర్‌స్టార్మర్ పట్టించుకోలేదని ఆరోపించారు. బ్రిటన్‌లో జరిగిన అత్యంత ఘోరమైన నేరాల్లో ఆయనకు కూడా భాగస్వామ్యం ఉందని అన్నారు. ఈవిషయంపై లేబర్ పార్టీ విచారణను తిరస్కరించిన నేపథ్యంలో బ్రిటన్ కింగ్ ఛార్లెస్ పార్లమెంటును రద్దు చేసి.. ఎన్నికల నిర్వహణకు ఆదేశించాలని మస్క్ పిలుపునిచ్చారు. టెస్లా సీఈఓ వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని బ్రిటన్ ప్రభుత్వం ఖండించింది.



# ఇక తగ్గేదేలే... హైడ్రా దూకుడుకు మరిన్ని అస్త్రాలు..

తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయాన్ని తీసుకుంది. హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ప్రత్యేకంగా హైడ్రాను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ హైడ్రాకు మరిన్ని అస్త్రాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. హైడ్రా కోసమే ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ నగర పరిధిలోని అనేక చోట్ల ఉన్న అక్రమ కట్టడాలను హైడ్రా ఇప్పటికే కూల్చివేసింది. వీటిలో ప్రముఖులకు సంబంధించిన అనేక నిర్మాణాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే ఈ వ్యవహారాలపై అనేక వివాదాలు చెలరేగుతున్నాయి. ప్రముఖ హీరో అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ తోపాటు ప్రముఖ రాజకీయ నాయకుల నివాసాలు, అపార్ట్మెంట్లు, గెస్ట్ హౌస్లను కూడా హైడ్రా తొలగించింది. ముందుగా నోటీసులు ఇచ్చి వారిని ఈ అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతుండగా, అందుకు ముందుకు రాకపోతే వాటిని బలవంతంగా తొలగిస్తున్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ మరిన్ని అక్రమ నిర్మాణాలను తొలగించే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైడ్రా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకంగా ఒక పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కార్యాలయాన్ని ఇప్పటికే సికింద్రాబాద్‌లోని బుద్ధ భవన్‌లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు, సరస్సులు, డ్రైనేజీ లైన్లు, పార్కులు, మైదానాలను రక్షించడం హైడ్రా బాధ్యత కింద ప్రభుత్వం అప్పగించింది. హైడ్రా అధికార పరిధి హైదరాబాద్, ఓఆర్ఆర్‌తోపాటు మధ్యలో మూడు కమిషనరేట్లను కలిగి ఉన్న ప్రాంతం అంతటా విస్తరించి ఉంది. ఈ క్రమంలోనే భూ వివాదాలకు సంబంధించి కేసులు నమోదు, విచారణను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. హైడ్రా భూ కబ్జాదారులు, అక్రమార్కుల ఆస్తులను పాడు చేయడం, ఆస్తుల రక్షణకు సంబంధించి ఇతర అంశాలపై ఇక్కడ కేసులు నమోదు చేయనున్నారు. ఇప్పటివరకు ఈ కేసులన్నీ సాధారణ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరుగుతున్నాయి.

దీనివల్ల ఆలస్యం కావడంతో పాటు సకాలంలో నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని హైడ్రా కోసం ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైడ్రా కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా కేసులో నమోదు చేసి విచారణ జరపనున్నారు.

అనంతరం ఆయా కేసులకు సంబంధించి చర్యలను హైడ్రా తీసుకుంటుంది. ఈ పోలీస్ స్టేషన్లో ఎక్కడ ఏర్పాటు చేస్తారు అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. కొద్ది రోజుల్లోనే దీనికి సంబంధించిన విధివిధానాలు వెలుపడతాయని చెబుతున్నారు.




# ఎమర్జెన్సీ చూడమని ప్రియాంకను కోరా..

ముంబయి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని తెరకెక్కిన చిత్రం 'ఎమర్జెన్సీ' బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ స్వీయదర్శకత్వంలో ఇది రూపుదిద్దుకుంది. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని త్వరలో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కంగనా.. ఈ సినిమా గురించి పలు విశేషాలు పంచుకున్నారు. దీనిని వీక్షించమని ఇందిరాగాంధీ మనవరాలు, ఎంపీ ప్రియాంక గాంధీని కోరినట్లు తెలిపారు. "పార్లమెంట్‌లో ప్రియాంకని కలిసినప్పుడు మా ఎమర్జెన్సీ చిత్రాన్ని తప్పకుండా వీక్షించాలని కోరగా, ప్రయత్నిస్తానని ఆమె బదులిచ్చారు. ఈ సినిమా ఆమెకు తప్పకుండా నచ్చుతుందని తెలియజేశా. ఎమర్జెన్సీ అనేది ఎంతో సున్నితమైన అంశం. ఇందిరాగాంధీ పాత్రను ఎంతో మర్యాదపూర్వకంగా చూపించా. రీసెర్చ్ సమయంలో ఎన్నో విషయాలు గ్రహించా. ఇందిరాగాంధీకి తన భర్త, పిల్లలు, స్నేహితులతో ఉన్న అనుబంధం గురించి తెలుసుకున్నా. శత్రువులతో ఎలా వ్యవహరించేవారో అర్థం చేసుకున్నా. ఆ విషయాలన్ని ఎక్కడా టచ్ చేయకుండా ఉండేందుకు కావాల్సిన జాగ్రత్తలు అన్నీ తీసుకున్నా" అని కంగన తెలిపారు. సెన్సార్ నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నట్లు కంగన చెప్పారు. "ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ప్రజల కళ్లకు కట్టినట్లు చూపించాలనే ఉద్దేశంతోనే నేను ఈ చిత్రాన్ని రూపొందించాను. సినిమా ఫుల్‌వెర్షన్ సెన్సార్ టీమ్‌కు నచ్చింది. ఫుల్ వెర్షన్‌ను ప్రేక్షకులకు చూపించాలనుకున్నా. కాకపోతే తాజా పరిణామాల వల్ల సెన్సార్ కట్స్ పడ్డాయి. దానివల్ల ఎలాంటి సమస్య లేదు. ఎందుకంటే, మేము ఎవరినో విమర్శించడానికి ఈ సినిమా చేయలేదు. ఇది అలాంటి సినిమా కాదు. చరిత్రకు సంబంధించిన కొన్ని ఎపిసోడ్స్‌ను వాళ్లు పూర్తిగా తొలగించేశారు. నిజం చెప్పాలంటే అది నా సినిమాపై ఎలాంటి ప్రభావాన్ని చూపించదు. కథ, ఇందులోని సందేశం ఎక్కడా చెక్కుచెదరలేదు" అని తెలిపారు. ఇందులో జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో నటించారు అనుపమ్ ఖేర్. తన పాత్ర గురించి ఆయన మాట్లాడుతూ.. కంగన ఎంతో రీసెర్చ్ చేసినట్లు చెప్పారు. "నా పాత్ర గురించి నేను పెద్దగా రీసెర్చ్ చేయలేదు. కంగననే అన్ని విషయాల గురించి పూర్తిస్థాయిలో పరిశోధన చేశారు. రాజకీయ అంశంపై తీసిన అత్యుత్తమ చిత్రాల్లో ఇది ఒకటని నమ్ముతున్నా. వివాదాలన్నీ పక్కనపెట్టి ప్రేక్షకులు దీనిని వీక్షించాలని కోరుకుంటున్నా" అని అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ' (%జుఎవతీస్త్రవఅషవ%). కంగనా రనౌత్ (%ఖుఅఅస్త్రుఅ ఝుఅబ%) కథానాయిక. అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి కీలకపాత్రలు పోషించారు. వాస్తవానికి ఈ చిత్రం సెప్టెంబర్ 6న విడుదల కావాల్సిఉంది. చిత్రంలో తమని తక్కువగా చూపించారని.. విడుదలను అడ్డుకోవాలని ఒక వర్గం మధ్యప్రదేశ్ న్యాయస్థానాన్ని సంప్రదించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. వారి వాదనలను పరిగణలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది. ఈ క్రమంలోనే చిత్ర బృందానికి సెన్సార్ బోర్డు కొన్ని సూచనలు సూచించింది. వివాదాలకు దారితీసేలా ఉన్న పలు సన్నివేశాలను తొలగించింది.




# దరఖాస్తులకు ఇంకా 5 రోజులే గడువు

చిన్ననాటి నుంచే దేశ రక్షణ రంగంలో పనిచేయాలని కలలుగనే విద్యార్థులకు ఇదో సువర్ణావకాశం. త్రివిధ దళాలకు అవసరమైన అధికారులను పాఠశాల విద్య నుంచే సిద్ధం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైనిక పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వచ్చేసింది.

వచ్చే విద్యా సంవత్సరం(2025-26)లో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఆలిండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్ కోసం ఎన్‌టీఏ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

**నోటిఫికేషన్‌లో ముఖ్యాంశాలివే..** ఆసక్తి కలిగిన విద్యార్థులు 2025 జనవరి 13న సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో https://exams.nta.ac.in/AISSEE/ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కూళ్లన్నీ సీబీఎస్‌ఈ అనుబంధ ఇంగ్లిష్ మీడియం రెసిడెన్షియల్ పాఠశాలలే. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవీ అకాడమీ, ఇతర శిక్షణ అకాడమీలకు ఇక్కడ క్యాడెట్లను సిద్ధం చేస్తారు. పెన్ను, పేపర్ (OMR షీట్) విధానంలోనే ఈ పరీక్ష ఉంటుంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఉంటాయి. దేశ వ్యాప్తంగా 190 పట్టణాలు /నగరాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్, ప్రవేశ పరీక్ష నిర్వహించే తేదీలను తర్వాత ప్రకటిస్తారు. ఆరోతరగతికి దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు మార్చి 31, 2025 నాటికి 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. బాలికలకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయి.

# సైదన్న..చూడన్న..జాన్ పహాడ్ దర్గా వద్ద వసతులు కరువు..!



ఆరుబయటే స్నానాలు చేస్తున్న భక్తులు

నేరేడుచర్ల (పాలకవీడు): జాన్ పహాడ్ దర్గా దగ్గర వసతులు కరువైతున్నాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్ దర్గా కు 400 ఏళ్ళ పైగానే చరిత్ర కలిగి ఉంది. ఈ దర్గాకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా వివిధ జిల్లాల నుంచి భక్తులు ఇక్కడికి ప్రతి శుక్ర,ఆదివారం తో పాటు ప్రతిరోజు భక్తులు వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు.

**కోట్లలో ఆదాయం... అభివృద్ధి మాత్రం శూన్యం..** జాన్ పహాడ్ దర్గాకు వచ్చే భక్తుల నుండి, టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లు గాని వక్ఫ్ బోర్డు అధికారులు కానీ ప్రతి సంవత్సరం సుమారు రెండు కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చి వక్ఫ్ బోర్డు అధికారులకు డబ్బులను చెల్లించేవారు. కానీ వక్ఫ్ బోర్డు నుంచి మామూలుగా సదుపాయాల కోసం ఒక్క రూపాయి కూడా నిధులు సమకూర్చకపోవడంతో దర్గా ప్రాంతమంతా సమస్యలతో నిండి ఉంది.

**దర్గా ప్రాంతమంతా మురుగునీరు.. దుమ్ము ధూళి...** దర్గా ప్రాంతమంతా మురుగునీరు దుమ్ము ధూళితో మురుగునీరు అంతా మురికి కాలువలు రోడ్లపై ప్రవహిస్తూ కనిపిస్తుంది. ఆ ప్రాంతమంతా అటవీ ప్రాంతం కావడంతో మట్టితో దుమ్ము కప్పేసినట్టు కనిపిస్తుంది.. ఇక్కడ భక్తులకు వసతి గదులను కల్పించకపోవడంతో వచ్చిన భక్తులు చెట్ల కింద వంటలు వండుకుని వసతి గృహాలుగా మార్చుకుంటున్నారు. ఈ ప్రాంతమంతా పిచ్చి మొక్కలు కంప చెట్లతో నిండి ఉంది. అలాగే తాగునీరును కూడా భక్తులకు అందించిన పరిస్థితి కనిపిస్తుంది..

**ఆరు బయటనే భక్తుల స్నానాలు..** ఇక్కడికి వచ్చే భక్తులకు స్నానాలు చేసేందుకు బట్టలు మార్చుకునేందుకు సరైన వసతులు లేకపోవడంతో వాటర్ ట్యాంక్ వద్ద బయటనే స్నానాలు చేసి బట్టలు మార్చుకునే దుస్థితి ఏర్పడింది. అక్కడ ఉన్న వాటర్ ట్యాంక్ కూడా నాసుతో పేరుక పోయి ఉంది. ఈ వాటర్ తో స్నానం చేస్తే భక్తులకు చిదరపెట్టి దద్దుర్లు వస్తున్నాయని చెబుతున్నారు. ఈ సమస్య ఎన్నో ఏళ్ళను ఉన్నప్పటికీ వీటిని శాశ్వత పరిష్కారం చూపించేందుకు వక్ఫ్ బోర్డు నేటికీ ఆసక్తి చూపడం లేదు.

**దర్గా ప్రాంతం అభివృద్ధి కోసం రూ.65 లక్షలు మంజూరు..** దర్గా ప్రాంతంలో కొంత సిసి రోడ్లు డ్రైనేజీ స్థానాల గదుల మరమ్మతులు చేసేందుకు హుజూర్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎస్డిఎఫ్ నిధుల నుండి రూ.65 లక్షలు మంజూరు చేశారు. ఇది నిధుల ద్వారా ఆ ప్రాంతంలో కొంత డెవలప్మెంట్ దరువుద్ధరి స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు. ఈ పనులు అప్పటివరకు పూర్తి చేసే విధంగా చూడాలని మంత్రి ఆదేశించినట్లు తెలుస్తోంది.

**ఈనెల 23 నుంచి దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం..** ప్రతి సంవత్సరం జనవరి నెల చివర శుక్రవారం జరిగే ఉరుసు ఉత్సవాలు ఈనెల 23 నుంచి ప్రారంభమై 25 కు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ ఉర్సు ఉత్సవాలకు రెండు రాష్ట్రాల నుంచి ప్రజలు మూడు రోజుల పాటు రెండు లక్షల పైగానే భక్తులు హాజరవుతారు. వీటి సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే జిల్లా కలెక్టర్ తేజస్ నందన్ లాల్ పవార్ అన్ని శాఖల అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి ఉర్సుకు సంబంధించిన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**దర్గా ప్రాంతమంతా ఆక్రమణ..** దర్గా చుట్టుపక్కల ప్రాంతమంతా వక్ఫ్ బోర్డ్ భూమి 9-20 ఎకరాలతో పాటు ప్రభుత్వ భూమి కూడా ఉంది. ఈ భూమిని స్థానికులతో పాటు అక్కడ వ్యాపారం చేస్తే వారంతా ఆక్రమించి చిన్నపాటి షెడ్లను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే మరికొందరు కాటేజీలుగా ఏర్పాటు చేసుకొని అక్కడికి వచ్చే భక్తులకు అద్దెకు ఇచ్చుకుంటూ ఉన్నారు. ఈ భూములను అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురై ఈ ఆక్రమణ రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అధికారులు ఇప్పుడైనా గుర్తించి ఆక్రమణకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కుంకుమ పువ్వు నేలలో 'ఉరి'మిన శిక్ష.. ఏడాదిలోనే 901 మందికి..

ఒకే ఒక ఘటన 2022లో ఇరాన్ ను కుదిపేసింది.. మోరల్ పోలీస్ కస్టడీలో ఉన్న యువతి మృతిచెందడం తీవ్ర ఆందోళనలకు కారణమైంది.. హిజాబ్ ధరించే నిబంధనను పాటించలేదన్న కారణంతో మాసా అమిని అనే యువతిని ఇరాన్ మోరల్ పోలీస్ తీవ్రంగా హింసించడంతో ఆమె అస్వస్థతకు గురైంది. ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ ఉదంతం ఇరాన్ ను అట్టుడికేలా చేసింది. యువతులు, మహిళలు రోడ్లపైకి వచ్చారు. ప్రభుత్వం అణచివేయడంతో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారనే కథనాలు వచ్చాయి. అత్యంత ఖరీదైన పంట కుంకుమ పువ్వు 90 శాతం ఇరాన్ లోనే పండుతుంది. అలాంటి నేల రక్తంతో తడిసింది. ఆధునికం నుంచి సంప్రదాయంలోకి యూరప్ దేశాల ప్రభావంతో ఇరాన్ 1970ల వరకు ఆధునికంగానే ఉండేది. అయితే, ఇస్లామిక విప్లవం




అనంతరం సంప్రదాయ దేశంగా మారింది. దీనినే వారు ఇస్లామిక్ రెవల్యూషన్ గా పేర్కొంటున్నారు. ఆయతుల్లా ఖొమైనీ సారథ్యంలో జరిగిన ఈ ఉద్యమం ఇరాన్ స్థితిగతులను మార్చివేసింది. ఖొమైనీయే సుప్రీం లీడర్ గా ఆవిర్భవించారు. ఇక ఇరాన్ లో అధ్యక్షుడు, ప్రధాని ఉన్నప్పటికీ సుప్రీం లీడర్ ఆదేశాలే అంతిమం. ఇప్పుడు బయటకు వచ్చిన గణాంకాల ప్రకారం 31 మంది మహిళలు సహా గత ఏడాది ఇరాన్ లో 901 మందికి మరణశిక్ష విధించారు.

**డిసెంబరులో..** మరీ ముఖ్యంగా డిసెంబరులో వారంలోనే 40 మందిని ఉరి తీశారట. ఈ సంగతిని ఐక్య రాజ్య సమితి (ఐరాస) తెలిపింది. ఏటా ఉరితీతలు పెరుగుతుండడం ఆందోళనకరం అని పేర్కొంది. హత్య, డ్రగ్స్ రవాణా, అత్యాచారం, లైంగిక దాడి నేరాల్లో ఇరాన్ లో మరణ శిక్ష విధిస్తుంటారు. చైనా తర్వాత ఈ శిక్ష ఇరాన్ లోనే ఉరితీతలు ఎక్కువ. భయం పుట్టించేందుకు తప్పు చేసినవారిని శిక్షించడంలో తప్పు లేదు. అయితే, ఇది వారిలో పరివర్తనకు కారణం కావాలనేది హక్కుల కార్యకర్తల అభిప్రాయం. కానీ, ఉరి శిక్షే అంతిమ న్యాయం కాకూడదనేది వారి వాదన. ఇక ఇరాన్ ప్రభుత్వం కూడా ఉరి శిక్షలను ప్రజల్లో భయం పుట్టేందుకు ఆయుధంగా వాడుతోందని హక్కుల కార్యకర్తలు విమర్శిస్తున్నారు. మాసా అమిని ఉదంతం అనంతరం భారీ ఆందోళనలు జరిగాయి. దీంతో ఉరిశిక్షను చూపించి భయపెట్టడం ఎక్కువైందట. అయితే, 2024లో డ్రగ్స్ కేసుల్లోనే ఉరి ఎక్కువగా అమలైంది. అమిని ఘటన తర్వాత నిరసనలతో సంబంధం ఉన్నవారిని కూడా ఉరితీశారని ఐరాస చెబుతోంది. సమితి.. ఎప్పటినుంచో మరణ (ఉరి సహా ఏదైనా) శిక్షను రద్దుచేయాలని ఇరాన్ ను కోరుతోంది.

# బిగ్ అలర్ట్... కొరియర్ సర్వీస్ పేరు చెప్పి కోటిన్నర కొట్టేశారు!

ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు సరికొత్త పంథాలు అవలంభిస్తున్న సంగతి తెలిసిందే. కాదేదీ సైబర్ నేరానికి అనర్హం అన్నట్లుగా కొత్త కొత్త మార్గాల్లో జనాలను మాయ చేస్తున్నారు. ఈ విషయంలో ఎన్ని ఘటనలు జరుగుతున్నా.. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా.. మోసపోయేవారు మోసపోతూనే ఉన్నారు.. చేతులు కాలిన తర్వాత పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అవును... సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాల్లో, సరికొత్త వేషాల్లో మోసాలకు పాల్పడుతూనే ఉంటున్నారు. ఈ విషయంలో తెలివైనవాళ్లం అనుకునేవాళ్లు, అమాయకులం అని నమ్మేవాళ్లు అనే తేడాలేమీ లేకుండా వారి బారిన పడుతున్నారని అంటున్నారు. ఈ క్రమంలో తాజాగా కొరియర్ చేసిన వస్తువులను పట్టుకుని ఓ మహిళ నుంచి దాదాపు కోటిన్నర రూపాయలు కొల్లగొట్టారు సైబర్ నేరగాళ్లు. వివరాల్లోకి వెళ్తే... దక్షిణ ముంబైలో నివసించే ఓ మహిళ (78) అమెరికాలో ఉంటున్న తన కుమార్తెకు వివిధ ఆహార పదార్థాలను కొరియర్ చేసింది. ఈ సమయంలో మరుసటి రోజు ఆమెకు ఓ ఫోన్



కాల్ వచ్చింది. తనను తాను పోలీస్ అధికారిగా పరిచయం చేసుకున్న వ్యక్తి.. ఆమె పంపిన కొరియర్ పార్సిల్ లో చట్టవిరుద్ధమైన పదార్థాలు ఉన్నాయని బెదిరింపులకు దిగాడు. ఈ వ్యవహారానికి సంబంధించి ఆమెకు వరుసగా వివిధ డిపార్ట్ మెంట్స్ నుంచి అంటూ అనేక ఫోన్ కాల్స్ వచ్చాయని చెబుతున్నారు. ఇందులో భాగంగా... ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ అని, సైబర్ క్రైమ్ డిపార్ట్ మెంట్ అని చెబుతూ వరుస ఫోన్ కాల్స్ తో ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ క్రమంలో పలు మార్లు వీడియో కాల్స్ కూడా చేశారు. ఆ వీడియో కాల్స్ లో కనిపించిన వ్యక్తులు ఆయా డిపార్ట్ మెంట్స్ కు సంబంధించిన యూనిఫామ్స్ ధరించి మాట్లాడినట్లు చెబుతున్నారు. దీంతో... వారు ధరించిన యూనిఫామ్ తో పాటు వారు మాట్లాడిన విధానం, చెబుతున్న సెక్షన్లు, మాట్లాడుతున్న విధానాలు అన్నీ గమనించిన ఆమె వాళ్లు నిజమైన అధికారులే అని నమ్మిందని అంటున్నారు. అలా ఆమెను పూర్తిగా నమ్మించిన తర్వాత అసలు విషయం మొదలుపెట్టిన సైబర్ నేరగాళ్లు... ఆమెకు పలు సూచనలు చేస్తూ వివిధ బ్యాంక్ ఖాతాలకు రూ.1.50 కోట్ల వరకూ ఆమెతో పంపించుకున్నట్లు చెబుతున్నారు. విచారణలో భాగంగా ఇలా డబ్బులు పంపించాలని ఆమెను ఈ సైబర్ నేరగాళ్లు బెదిరించారని చెబుతున్నారు. ఇంత వ్యవహారం నడుస్తున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా ఉన్న మహిళ.. డబ్బులు పంపించిన తర్వాత మాత్రం తన కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పిందట. దీంతో.. ఇదంతా సైబర్ క్రైమ్ అని వారు చెప్పడంతో.. అప్పుడు కానీ తాను మోసపోయినట్లు గుర్తించలేదని.. అనంతరం సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కు విషయం చెప్పిందని అంటున్నారు.

దీంతో... రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు ఆమె డబ్బులు పంపించిన ఖాతాలను పరిశీలించారు.. వాటిని గుర్తించడం కష్టమని చెప్పారని అంటున్నారు. దీంతో.. సదరు మహిళ లబోదిబో మంటున్నారని తెలుస్తోంది. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# చురకలు

## సంపాదకీయం

### హిమాలయాలు ప్రకోపిస్తే కల్లోలమేనా ?

హిమగిరి సొగసులు మురిపించునూ మనసులు అని కవులు పాడుకుంటారు. నిజమే ఎత్తైన హిమాలయాలు ఎంతో మానసిక ఆనందాన్ని ప్రకృతి ప్రేమికులకు ఇస్తాయి. ఆధ్యాత్మిక పరులకు అక్కడ ఎంతో ప్రశాంతత కనిపిస్తుంది. యోగులు అంతా అక్కడే ఉంటారు. మంచుతో మంచిగా ఉండే ఈ కొండలు ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని ప్రభోదిస్తూంటాయి. అయితే ప్రకృతిలో అన్నీ కూడా భాగమే. ఎపుడు ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఇక అందమైన హిమాలయాలు ప్రకోపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజాగా మంగళవారం టిబెట్ నేపాల్ పరిసరాలలో సంభవించిన తీవ్ర భూకంపానికి 130 మంది దాకా మరణించారు. వందలాది మంది క్షతగాత్రులు అయ్యారు. ఈ పెను ప్రకృతి విపత్తుతో భారీ నష్టం సంభవించింది. ఏకంగా గంటల వ్యవధిలో ఆరేడు సార్లు భూమి కంపించింది అని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే హిమాలయాల్లో భూకంపం వచ్చిందని దాని ప్రభావమే నేపాల్ టిబెట్ సరిహద్దులలో కనిపించిందని అంటున్నారు.' 7.1 మాగ్నిట్యూడ్ తో భారీ భూకంపం రావడం వల్ల నేపాల్ టిబెట్ నే కాదు ఉత్తర భారత దేశం అంతా వణికిపోయింది. ఇక టిబెట్ రాజధాని లాసాకు నైరుతి దిశలో 400 కిలోమీటర్ల దూరంలో టింగ్రీ కౌంటీలో భూకంప కేంద్రం ఉన్నట్లుగా గుర్తించారు. ఇక హిమాలయాలల్లో రానున్న కాలంలో భూకంపాలు వచ్చే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికి నాలుగు సార్లు హిమాలయాలల ప్రాంతంలో భూకంపాలు వచ్చినట్లుగా చెబుతున్నారు. రానున్న కాలంలో 8 నుంచి ఎక్కువ స్థాయిలోనే మాగ్నిట్యూడ్ తీవ్రతతో భారీ భూకంపాలు హిమాలయాల్లో సంభవించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. హిమాలయాల ప్రాంతంలో ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ ఆసియా టెక్టోనిక్ ప్లేట్ ని ముందుకు నెడుతోంది అని అంటున్నారు. ఇలా భూ అంతర భాగంలో జరిగే భారీ సంఘర్షణల వల్లనే భూకంపాలు వస్తున్నాయని అంటున్నారు. ఇక హిమాలయాల చరిత్ర చూస్తే అవి వేల కోట్ల ఏళ్ళ క్రితం ఇలాంటి భూకంపాల వల్లనే ఉద్భవించాయని చెబుతున్నారు. ఇక ప్రతీ ఏటా ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ కొన్ని మిల్లీమీటర్ల మేర ఉత్తర దిశగా ముందుకు నెడుతోందని దాని ఫలితంగా హిమాలయాల ఎత్తు కూడా నెమ్మదిగా పెరుగుతోంది అని అంటున్నారు. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు హిమాలయాలలో ఏదో ఒక రోజు భారీ భూకంపాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అది రేపు అయినా కావచ్చు లేదా పదేళ్ళు వందేళ్ళ కాలమైనా పట్టవచ్చు కానీ భూకంపాలు మాత్రం హిమాలయాల నుంచి వచ్చే అవకాశాలు కచ్చితంగా ఉన్నాయని అంటున్నారు. అదే జరిగితే ఉత్తరాదిన ఉన్న ప్రాంతాలకు చాలా ఇబ్బంది అవుతుందని కూడా అంటున్నారు. దీనికి గతంలో జరిగిన సంఘటనలు ఉదహరిస్తున్నారు. 1897లో షిల్లాంగులో అలాగే 1905లో కాంగ్రాలో, 1934లో నేపాల్ బీహార్ లలో, 1950లో అసోంలో భారీ భూకంపాలు సంభవించాయని గుర్తు చేస్తున్నారు. ఇక 1991లో ఉత్తర కాశీలో భూకంపం సంభవించిందని అలాగే 1999లో చమోలీలో 2015లో నేపాల్ లో భూకంపాలు వచ్చాయని గుర్తు చేస్తున్నారు. వీటి వల్ల వేలాది మంది మరణించారని చెబుతున్నారు. మంచుతో నిండిన ఈ అత్యున్నత శిఖరం పైకి గంభీరంగా ఉన్నా లోపల జరిగే సంఘర్షణల ఫలితంగా భూకంపాలు విరుచుకుపడతాయని ప్రకృతి విపత్తు నిపుణులు చెబుతున్నారు.

# నవ్వు దైవ దత్త దివ్యౌషధం - జనవరి 10... నవ్వుల దినోత్సవం




నవరసాల సారమే జీవనం. అందులో ఏ రసం పాలు తక్కువైనా సమస్య లేదు కానీ, హాస్యరసం పాలు మాత్రం అసలు తక్కువ కాకూడదు. అది లోపిస్తే జీవితమంతా వేదనే మిగులుతుంది. అయితే, నేటి యాంత్రిక జీవనంలో, పోటీ ప్రపంచంలో మన జీవితాల్లో హాస్యరస పాలు క్రమంగా తగ్గిపోతోంది. ఆవేశం, ఆగ్రహం, అసంతృప్తి, అహం, మానసిక ఒత్తిడి వంటివి నవ్వును, నవ్వే గుణాన్ని మింగేస్తున్నాయి. ప్రపంచ నవ్వుల దినోత్సవం మొదటి సారిగా 1998, జనవరి 10న భారత దేశంలోని ముంబైలో జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించిన డాక్టర్ మదన్ కటారియా ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశాడు. మొదట జనవరి రెండవ ఆదివారం జరుపుకునే వారు. జనవరిలో చలి ఎక్కువగా ఉంటుందన్న హాస్య ప్రియులు కోరిక మేరకు లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ దీన్ని మే మొదటి ఆదివారం జరుపుతూ వచ్చింది. అయితే భారత దేశంలో జనవరి 10న మొదటి సారి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది భారత దేశమే, భారతీయుడే కావడం విశేషం. ముంబైకి చెందిన ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ మదన్ కటారియా ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని సృష్టించారు. 'నవ్వు ఒక యోగం' అనే కాన్సెప్ట్ను ప్రపంచానికి చాటిన అయన భారతీయుడే కావడం విశేషం. వ్యక్తులు తమను తాము మార్చుకోవటానికీ, ప్రపంచాన్ని శాంతియుతంగా, సానుకూలంగా మార్చడానికి అవసరమైన శక్తివంతమైన భావోద్వేగం నవ్వు ఒక్కటే. నవ్వు అనేది ఒక వ్యక్తి ముఖ కవళికలపై, భావోద్వేగాలపై ప్రభావం చూపుతుందన్న ఉద్దేశ్యంతో మదన్ కటారియా నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించాడు. మొదట్లో నవ్వుల క్లబ్ (లాఫర్ క్లబ్)గా ప్రారంభమైన ఈ వేడుక తరువాత కాలంలో 65 దేశాలలో ఆరు వేల క్లబ్బుల వరకు విస్తరించింది. నవ్వడం వలన శరీరంలో ఉన్న రోగాలన్నీ మటుమాయమై పోతాయని ఆరోగ్య నిపుణులు చెపుతున్నారు. నవ్వడం మూలాన జీవితంలోని ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చని వారంటున్నారు. రోజులో కనీసం నాలుగైదు సార్లయినా మనసారా నవ్వడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. ఒక మనిషి సంతోషంగా ఉంటే అతని కుటుంబం సంతోషంగా ఉంటుంది. అలా కుటుంబాలన్నీ సంతోషంగా ఉంటే సమాజమంతా సంతోషంగా ఉంటుంది.. అప్పుడు ప్రపంచమంతా సంతోషంగా ఉంటుందనేది ఈ నవ్వుల దినోత్సవ నిర్వహణ వెనుక ఉన్న భావన.

**హాస్యానికి పుట్టినిల్లు భారత్...** భారతదేశంలో హాస్యానిది తొలి నుంచీ పెద్దపీటే. రాజుల ఆస్థానాలలో విదూషకులు కేవలం మహారాజులను నవ్వించడానికే ఉండేవారు. తెనాలి రామకృష్ణుడు, బీర్బల్? పండించిన హాస్యం అజరామరం. ఈ రెండు తరహాలు కథలు నవ్వుతో పాటు ఆలోచననూ కలిగిస్తాయి. నిజానికి నవ్వుతో లేదా జోక్?తో ఆలోచనను రేకెత్తించే హాస్యమే మరుపు రాకుండా మిగిలి పోతుంది. అక్బర్? – బీర్బల్? కథలు ఎన్నో ఆలో చనలను రేకెత్తిస్తాయి. తెనాలి రామకృష్ణుడి కథలు తెలివిని పెంచుతాయి. పరమానందయ్య శిష్యుల కథలు కూడా మంచి హాస్యాన్ని పుట్టిస్తాయి. మన జానపద గీతాల్లోనూ హాస్యరసం పొంగి పొర్లుతుంది. ఇంకా పల్లెసుద్దుల్లో, పల్లెల్లో పనిపాటు చేసుకుంటూ పాడుకునే పాటల్లో ఎంతో సునిశిత హాస్యం దొర్లుతుంది. పువ్వులు, పక్షులు, జంతువులు.. తమ తమ స్వభావాలతో తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, పరిసరాలను ఆనందమయంగా చేసుకుంటాయి. వాటితో పోలిస్తే విచక్షణ, వివేకం కలిగిన మానవులం ఈ జీవితాన్ని, ఎందుకు సంతోషకరం చేసుకోలేం. ఈ సృష్టిలో పైసా ఖర్చు లేనిది చిరునవ్వు మాత్రమే. కానీ, దాన్ని 'కొనితెచ్చు' కోవాల్సినంత దుస్థితిలో మానవ జీవితాలు ఉన్నాయి. రోజుల్లో వస్తున్న సగం జబ్బులకు ఒత్తిడే కారణం. 70 శాతం రోగాలు ఒత్తిడితోనే కలుగుతున్నాయనేది వైద్య అధ్యయనాల సారాంశం. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, డిప్రెషన్? (కుంగుబాటు), అలర్జీ, ఇన్సోమియా, మైగ్రేయిన్?, ఆతృత, పెప్టిక్? అల్సర్?.. ఇవన్నీ ఒత్తిడి వల్ల వచ్చేవే. నవ్వుల టానిక్? మాత్రమే వీటికి ఔషధం. ఉదయం లేస్తూనే ఒక చిరునవ్వును ముఖంపైకి తెచ్చుకుంటే ఇవన్నీ మటుమాయమైనట్టే. నవ్వుతో రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన లింపొజైట్స్ ఉత్పత్తి పెరుగుతుంది. ముక్కు, శ్వాసకోశాల్లోని పొరల్లో మెరుగుదల ఉంటుంది. శరీరంలో సహజరోగ నిరోధక హార్మోన్ల ఉత్పత్తి పెరిగి ఆర్థరైటిస్, స్పాండలైటిస్, మైగ్రేన్ లాంటి వ్యాధులకు ఉపశమనం లభిస్తుంది. ఊపిరి తిత్తుల సామర్థ్యం, రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతాయి. దీని వల్ల ఆస్తమా రోగులకూ మేలు జరుగుతుంది. మనుషులు వేర్వేరు భాషలు, దేశాలకు చెందిన వారైనా అందరికీ అర్థమయ్యే, అందరికీ వచ్చే యూనివర్షల్ లాంగ్వేజ్ మాత్రం నవ్వే. ఇది ఎవరూ నేర్చుకొనే అవసరం లేని భాష. అందరిలోనూ సహజ, స్వభావ సిద్ధంగా ఉంటుంది. అయితే, ప్రతి మనిషీ తనలో సహజంగా ఉండే నవ్వును నవ్వడం లేదా దానిని ఉపయోగించడం నానాటికీ మరిచి పోతున్నాడు. పుట్టుకతోనే అబ్బే విద్య నవ్వు మాత్రమే. సకల జీవరాశిలో మనిషికి మాత్రమే నవ్వుకునే, నవ్వే గుణమూ, లక్షణమూ ఉన్నాయను కోవడం అజ్ఞానం. చాలా గుణాలలాగే నవ్వు కూడా మన చుట్టూ ఉన్న జీవరాశి అంతటిలో ఉన్నాయి. పువ్వులు వికసించడమే హాసం. పక్షుల కిలకిలరావాలే కిలకిలల నవ్వులు. జంతువులు చేసే కొన్ని శబ్దాలు నవ్వులకు సంకేతాలే. నవ్వు అనేది మనిషి అభ్యాసంతో నేర్చుకునే విద్య కాదు. జన్మతః లభించిన లక్షణం. సెల్ ఫోన్లు మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతున్నాయి. సెల్?ఫోన్లు వచ్చాక మనుషుల మధ్య మాటలే కరువయ్యాయి. ఇద్దరు మనసు విప్పి మాట్లాడు కుంటేనే కదా.. ఆ సంభాషణలో నుంచి హాస్యం పుట్టేది. ఇప్పుడు ఎవరికి వారు సెల్?ఫోన్ల తోనే మాట్లాడు తున్నారు. అరచేతిలోని సెల్ ఫోన్ మనసుకు నవ్వును తాకనివ్వడం లేదని ఎవరూ గుర్తించడం లేదు. వాట్సాప్?లో పోస్టుల జోకులకే నవ్వు తున్నాం. స్వతహాగా నవ్వడం ఏనాడో మరిచి పోయాం. చింతలు, చికాకులు, అర్థం లేని లక్ష్యాల వైపు పరుగులతో మనిషిలో హాస్య ప్రియత్వ సహజ లక్షణం తగ్గిపో తున్నది. నవ్వు ఇలా మహా భాగ్యమై పోయినందుకే లాఫింగ్? క్లబ్బులు వచ్చాయి. మనిషి కొత్తగా నవ్వడం నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నవ్వు యోగమే కాదు.. నవ్వు వ్యాయామం కూడా. ముఖంలో నవ్వు కనబడాలి అంటే ముఖం లోని ముప్పై రెండు కండరాలు కదలాలట. నవ్వడం కూడా ఒక వ్యాయామం. ఒక్క నవ్వుతో 32 కండరాలను కదిలించడం అంటే అది ఎంత గొప్ప వ్యాయామం కాక మరేమిటి. చక్కని నవ్వు వల్ల ముఖ కవళికలు మెరుగవుతాయి. ముఖ కండరాల్లో రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. వృద్ధాప్య ఛాయలు, ముడతలను దరి చేరనివ్వదు. మనసు స్వచ్ఛంగా ఉన్న వాళ్లకే స్వచ్ఛమైన నవ్వు వస్తుంది. యోగాతో పోలిస్తే నవ్వడం చాలా సులువు. యోగా అంటే కొన్ని భంగిమలు ప్రదర్శించాలి. దీనికి అవేమీ అవసరం లేదు. పెదాలను కాస్త కదిలిస్తే చాలు.. మానసిక ఒత్తిడిని నవ్వు తగ్గిస్తుంది. హాయిగా నవ్వడం వల్ల ఒత్తిడి దిగిపోయి రిలాక్స్ కలుగుతుంది. కుంగుబాటు (డిప్రెషన్?) నుంచి నవ్వు బయట పడవేస్తుంది. ఉద్విగ్నత, భావోద్వేగాలను నవ్వు సమస్థితిలో ఉంచుతుంది. ఇవి అదుపులో ఉంటేనే ఇతరులతో సంబంధ బాంధవ్యాలు సవ్యంగా గలుగుతారు. అంటే మనసులో ఎటువంటి కల్మషం లేని వారు మనసారా స్వచ్ఛంగా నవ్వగలరు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలుగు సాహిత్యానికి పింగళి ఎనలేని సేవ - జనవరి 10...పింగళి లక్ష్మీకాంతం జయంతి



అగ్రశ్రేణి కవిగా, విమర్శకులుగా, పరిశోధకులుగా, వక్తగా, సాహిత్యాచార్యులుగా ప్రసిద్ధి గాంచిన సాహితీ వేత్త ఆచార్య పింగళి లక్ష్మీకాంతం. ఆంధ్ర భోజుడు శ్రీ కృష్ణ దేవ రాయలు ఆస్థానంలోని అష్ట దిగ్గజ కవులలో ఒకరైన పింగళి సూరన వంశీయులు, తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారి శిష్యులు, కుర్తాళం సిద్ధేశ్వరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి వారికి గురువులు పింగళి. పింగళి లక్ష్మీకాంతం (జనవరి 10, 1894 – జనవరి 10, 1972) ప్రసిద్ధ తెలుగు కవి. లక్ష్మీకాంతం అధ్యాప కులుగా, నటులుగా, కవిగా బహు ముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు. పింగళి కాటూరి జంటకవులలో పింగళి ఆయనే. పింగళి లక్ష్మీకాంతం 1894, జనవరి 10 న కృష్ణా జిల్లా ఆర్తమూరులో వెంకట రత్నం, కుటుంబమ్మలకు జన్మిం చారు. రేపల్లెలో ప్రాథమిక విద్యా భ్యాసం, మచిలీ పట్నం లోని హిందూ ఉన్నత పాఠశాల, నోబుల్ కళాశాలలో చదివారు. మద్రాసు విశ్వ విద్యా లయంలో ఎం.ఏ. పట్టా పొందారు. తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రికి శుశ్రూష చేసి, సంస్కృతాం ధ్రాలలో బాగా పఠించి ఆ మహాను భావుల శిష్యులలో అగ్ర గణ్యులు యయ్యారు. కాటూరి వెంకటేశ్వర రావుతో కలసి ఆయన ఆంజనేయ స్వామిపై శతకం చెప్పారు. వీరిరువురు జంట కవులుగా పలు చోట్ల శతావధా నాలు చేశారు. పాండవో ద్యోగ విజయములు, ముద్రా రాక్షసము నాటకాలలో ధర్మరాజు, రాక్షస మంత్రిగా పాత్రలు పోషించి పేరు పొందారు. నోబుల్ కళాశాలకు చెందిన పాఠశాలలో ఆంధ్ర పండితుడిగా పని చేశారు. మద్రాసు విశ్వ విద్యాలయం లోని ప్రాచ్య పరిశోధన విభాగంలో కొంతకాలం పరిశోధన చేశారు. ఆంధ్ర విశ్వ కళా పరిషత్తులో, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఆంధ్రాచార్యులుగా, అధ్యక్షులుగా పని చేశారు. 1906లో ప్రారంభమైన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు కోర్సు 1931లో ప్రారంభమైనప్పుడు దానికి లెక్చరర్ గా, శాఖాధ్యక్షులుగా, పింగళి లక్ష్మీ కాంతంను నాటి ఉప కులపతి డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ పిలిపించి నియమించారు. 1949 వరకు అక్కడ పని చేసి, తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ స్థాపించాక తెలుగు భాషా ప్రతి నిధిగా చేరారు. విజయవాడ ఆకాశ వాణి కేంద్రంలో ప్రసంగాల విభాగా నికి ప్రయోక్తగా ఉన్నారు. 1954 – 1961 విజయవాడ ఆకాశవాణి కేంద్రం సలహాదారుగా పని చేశారు. హైదరాబాద్ కు బదిలీ చేస్తే ఉద్యోగమే వదులు కుంటామని భీష్మించు కుని కూర్చున్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుండి ఆహ్వానం అందుకుని అందులో చేరారు. అలా ఆంధ్రలోని ఉత్తమ విశ్వ విద్యాలయాల తెలుగు విభాగాలకు ఆయన పునాది వేశారు. తిరుపతిలో ప్రొఫెసర్ గా పదవీ విరమణ చేస్తూనే తెలుగు మాధ్యమంలో డిగ్రీ స్థాయివరకు విద్యాబోధన అంశం, తెలుగు అకా డమీ రూపకల్పన తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. విశ్రాంత జీవితంలో మిత్రులు, శిష్యుల ప్రోద్బలంతో కొద్ది కాలమే పుస్తకరచన, ప్రచురణ చేపట్టారు. 75ఏళ్ళ వయసులో, ఆరు దశా బ్దాలు సహ జీవనం చేసిన నేపథ్యంలో, 1969లో సతీ వియోగం ఆయనను కుంగ దీసింది. సాహిత్య వ్యవహారాలు, అధికార సంఘాల, బాధ్యతలను చేపట్టినా, మనసు లోని బాధను మరచి పోలేక పొయ్యారు. ఆంధ్ర సాహిత్య అకాడమీలో విశిష్ట సభ్యత్వం, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయ గౌరవ డాక్టరేట్ బిరుదు అందుకున్నారు. 1970 నాటికి అనారోగ్యాలు ఆయనను వెంటాడాయి. అయితే చికిత్స కోసం1971 ఆగస్టులో తిరుపతి నుండి హైదరాబాద్ వెళ్ళారు. 1972 జనవరిలో సంక్రాంతికి ముందు తెలుగు సాహిత్య రంగంలో అవిరళ కృషి సల్పిన పింగళి లక్ష్మీ కాంతం1972 సంవత్సరం జనవరి 10 తేదీన ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. సాధారణంగా జయంతి, వర్ధం తులు ఒకేరోజు రావటం బహు అరుదు. అయితే పింగళి పుట్టిన రోజు, మరణించిన రోజు ఒక్కటే జనవరి 10 కావడం విశేషం. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలుగు సినీ రంగ ఆణిముత్యం ముక్కామల - జనవరి 10...ముక్కామల కృష్ణమూర్తి వర్ధంతి



ముక్కామల కృష్ణమూర్తి తెలుగు సినిమా రంగంలో సుస్థిరమైన ముద్ర వేశారు. ఆయన కథనాలు, పాత్రలు, దర్శకత్వం, రచనతో తెలుగు సినిమా రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. నటుడిగా మాత్రమే కాకుండా రచయితగా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా ఆయన తన ప్రతిభను చాటారు. 1950, 1960 దశకాల్లో తెలుగు చిత్ర పరిశ్రమలో ఆయన పేరు వెలుగొందింది.

**ప్రారంభ జీవితం...** ముక్కామల కృష్ణమూర్తి ఆంధ్ర ప్రదేశ్‌లో1920 ఫిబ్రవరి 28న గుంటూరు జిల్లా గురజాలలో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ, చిన్నతనం లోనే కళలపై ఆసక్తి కలిగి రంగస్థల నటుడిగా మంచి పేరు సంపాదించారు. ఆయన నటనలో సహజత్వం, భావోద్వేగాల ప్రదర్శన ప్రేక్షకులను మెప్పించేవి. రంగస్థల అనుభవం ఆయనకు సినిమా రంగంలో ఉపయోగ పడింది.

**సినీ జీవితం:** ముక్కామల కృష్ణమూర్తి 1950లలో తెలుగు సినిమా రంగంలో ప్రవేశించారు. అప్పటి తెలుగు సినిమాలు భక్తి, చారిత్రక, జానపద కథల ఆధారంగా సాగేవి. ఈ తరహా సినిమాల్లో ఆయన పాత్రలు అత్యంత గుర్తింపు పొందాయి.

**ముఖ్య చిత్రాలు...** జగదేక వీరుని కథ, శ్రీకృష్ణ పాండవీయం, ఉమాచండి గౌరి శంకరుల కథ, లైలా మజ్ను (ఈ సినిమాలో భానుమతి తండ్రిగా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు), మాయాబజార్ వంటి చిత్రాల్లో ఆయన విలక్షణమైన పాత్రలను పోషించి ప్రేక్షకుల హృదయాలను గెలుచు కున్నారు.

**దర్శకుడు, రచయితగా ...** ముక్కామల నటనకే పరిమితం కాకుండా రచయితగా%ఓ% దర్శకుడిగా తన ప్రతిభను చాటారు.

**దర్శకత్వం:** ఆయన దర్శకత్వం వహించిన "మరదలు పెళ్లి" , "ఋష్యశృంగ" వంటి చిత్రాలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి.

**రచన:** కథలు రాయడం ఆయనకు ప్రత్యేకమైన అభిరుచి. ఆయన రాసిన కథలు నాటకీయతతో, భావోద్వేగాలతో నిండి ఉండేవి.

**సహజత్వానికి ప్రాముఖ్యత:** ముక్కామల నటనలో సహజత్వానికి ప్రధాన ప్రాధాన్యత వుంది. విలన్ పాత్రలు, రాజకీయ నాయకుల పాత్రలు, కుటుంబ పెద్దల పాత్రల్లో ఆయన స్ఫూర్తి దాయకంగా నిలిచారు. ఆయన నటనలో భావోద్వేగాల ప్రదర్శన ప్రేక్షకులను చలింపచేసేది.

**అన్య భాషల్లో కృషి:** తెలుగు చిత్రాలకే పరిమితం కాకుండా తమిళ, కన్నడ భాషా చిత్రాల్లో కూడా నటించారు. వివిధ భాషల్లో తన ప్రతిభను చాటుతూ దక్షిణాది సినిమా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు.

**వ్యక్తిగత ఆసక్తులు:** ముక్కామల కేవలం సినిమాలకే పరిమితం కాకుండా కళల పట్ల విస్తృతమైన ఆసక్తి కలిగి ఉండేవారు. ఫోటోగ్రఫీ, పెయింటింగ్, మరియు నాటకరంగం ఆయనకు ప్రత్యేకమైన హాబీలు. నూతన నటీ నటులకు సహకారం అందించడంలో ఆయన ముందుండేవారు.

**ముక్కామల వారసత్వం:** ముక్కామల కృష్ణమూర్తి 1987 జనవరి 10న చివరి శ్వాస విడిచారు. ఆయన చేసిన కృషి తెలుగు సినీ రంగానికి చిరస్మరణీయం. ఆయన నటన, రచన, దర్శకత్వం ఇప్పటికీ ప్రేక్షకుల గుండెల్లో జీవిస్తోంది. ముక్కామల కృష్ణమూర్తి తెలుగు సినిమా రంగానికి చేసిన సేవలు అద్భుతమైనవి. ఆయన ప్రతిభ, సినీ రంగానికి తన జీవనాన్ని అంకితం చేసిన తపన, నేటి తెలుగు సినిమా అభివృద్ధికి పునాది వేసిన గొప్ప వ్యక్తిగా గుర్తించ బడతారు. ఈయన అందించిన స్ఫూర్తి, వారసత్వం సినిమాపై మక్కువ ఉన్న ప్రతి కళాకారుడికి ఆదర్శంగా నిలుస్తాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తెలుగు కవులను తెలుగేతరులకు పరిచయం చేసిన జర్నలిస్ట్ ధూళిపూడి - జయంతి 10...ధూళిపూడి జయంతి



ధూళిపూడి ఆంజనేయులు, సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత. పుట్టింది, పెరిగింది తెలుగు రాష్ట్రంలో అయినా, ఆంజనేయులు కేవలం ఇంగ్లీషులోనే రాసి గొప్ప జర్నలిస్టుగా ఖ్యాతి చెందారు. డి.ఎ.అని పాఠకులకు పరిచితులు. 1924 జనవరి 10న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఎలవర్రులో పుట్టి, ముందు నుండే జర్నలిస్టు జీవితాన్ని ఎంపిక చేసుకున్న ఆంజనేయులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా, సమాచార శాఖలో జర్నలిస్టుగా, ఆకాశ వాణిలో వాణి పత్రికా సంపాదకులుగా, హిందూ పత్రిక సంపాదక బృందం బాధ్య లుగా, పేరెన్నిక గన్నారు. కోటం రాజు రామారావు నడిపిన "ఇండి యన్ రిపబ్లిక్" లో తొలుత జర్నలిజానికి ఆయన శ్రీకారం చుట్టారు. మొదట ఇండియన్ ఎక్స్ ప్రెస్ సంపాదక వర్గంలో 1948లో చేరి 1953లో ది హిందూ పత్రికలో చేరి అనుభవం సంపాదించిన తర్వాత 1959 లో ఆకాశవాణి వారి వాణి పత్రిక సంపాదక బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగరీత్యా ఆంజనేయులు ఢిల్లీ, హైదరాబాద్, మద్రాసులో ఉంటూ సమాచార శాఖలో జర్నలిస్టుగా వృత్తిధర్మం నిర్వర్తించారు. ఉద్యోగంలో వున్నా వివిధ పత్రికలకు రాస్తూ ఆంజనేయులు మంచి పేరు తెచ్చు కున్నారు. అంతకుమించి, ఎన్నో రచనలు ప్రచురించారు. ఆయన రాసిన పత్రికలు క్వెస్ట్, ఇండియన్ రివ్యూ,థాట్, ఇండియన్ లిటరేచర్, త్రివేణి, ఫైనాన్షియల్ ఎక్స్ ప్రెస్, ఎకనామిక్ టైమ్స్, ఇండియన్ రైటింగ్ టుడే పేర్కొనదగినవి. తెలుగు పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునే వారు. స్వతంత్ర టైమ్స్, దక్కన్ హెరాల్డ్, న్యూస్ టుడే, ఇండియన్ బుక్ క్రానికల్ పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురించాయి. భవాన్స్ జర్నల్ లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనే యుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీని ఫలితంగా జీవిత చరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృష్ణన్, అంబేద్కర్, నిరాద్ చౌదరి మొద లైన వారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు. ?తెలుగు సాహిత్యాన్ని, రచయితల్ని తెలుగే తరులకు అందించడం ఆయన విశిష్టత. ఇందులో భాగంగా గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్ రాయగా, కలకత్తా రైటర్స్ వర్క్ షాప్ వారు వెలువ రించారు. ఆయన ఏది రాసినా, చెప్పినా స్పష్టంగా, మృదువుగా, మర్యాదగా ఉండేది. సున్నిత హాస్యం, విమర్శ ఆయన రచనల్లో కనిపించేది. వృత్తి రీత్యానూ, వ్యక్తి దృష్ట్యా ఆంజనేయులుకు ఎందరో సన్నిహితులయ్యారు. వారిలో నార్ల వెంకటేశ్వరరావు, సంజీవదేవ్, బి.ఎస్.ఆర్.కృష్ణ, కె.శ్రీనివాస అయ్యంగార్, వామనరావు, పట్టాభిరాం, ఎ.ఆర్.బాజీ, భావరాజు నరసింహారావు ప్రభృతులెందరో వున్నారు. నార్ల వెంకటేశ్వర రావు తన ఇంగ్లీషు రచనల్ని ముందుగా ఆంజనేయులు పరిశీలించిన తరువాత ప్రచురించేవారు. విశ్వనాథ సత్యనారాయణ, గోపీ చంద్, బైరాగి, పాలగుమ్మి పద్మ రాజు, శ్రీశ్రీ, సి. నారాయణ రెడ్డి, దాశరథి, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొద లైన వారిని తెలుగేతరులకు తన రచనల ద్వారా పరిచయం చేసిన గొప్పతనం ఆయనదే. పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునే వారు. స్వతంత్ర టైమ్స్, దక్కన్ హెరాల్డ్, న్యూస్ టుడే, ఇండియన్ బుక్ క్రానికల్ పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురిం చాయి. భవాన్స్ జర్నల్లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనేయుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీని ఫలితంగా జీవిత చరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృష్ణన్, అంబేద్కర్, నిరాద్ చౌదరి మొదలైన వారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు. ద్వివేదుల విశాలాక్షి రచన "గ్రహణం విడిచింది" ఇంగ్లీషులోకి అనువదించారు. ఆంజనేయులు రచనలను... కట్టమంచి రామలింగారెడ్డి, సాహిత్య అకాడమీ, కందుకూరి వీరేశలింగం, కేంద్ర ప్రచురణ సంస్థ ప్రచురించాయి. ఆయన రష్యా, యూరప్ దేశాలు పర్యటన అనుభవాలను 'విండో టు ది వెస్ట్' అని పుస్తకంగా ప్రచురించారు. ఆంజనేయులు రిటైర్ అయిన తరువాత మద్రాసులో స్థిరపడి, హిందూ లో "బిట్వీన్ యు అండ్ మి" అనే శీర్షిక 10 సంవత్సరాలు (1981–91) నిర్వహించారు. మద్రాసు ప్రెస్ క్లబ్ లో 30 సంవత్సరాలు అధ్యక్షులుగా ఉన్నారు. సాహిత్య విమర్శ, సాంఘిక సంస్కరణలపై కూడా రచనలు చేశారు. ఆంజనేయులు సెక్యులర్ జీవితం గడిపారు. కుమార్తె వివాహం రిజిస్టర్ చేయించి, కన్యాదాన పద్ధతి నిరసించారు. సంగీతం, సంస్కృతం, సాహిత్యం అంటే ప్రత్యేకాభి మానం. స్వంత గ్రంథాలయం దేశంలో అతి పెద్దదైన వ్యక్తిగత గ్రంథాలయాలలో ఒకటి. తెలుగువారు గర్వించదగిన ఇంగ్లీషు జర్నలిస్టు తన 75వ ఏట 1998 సంవత్సరం డిసెంబరు 27 తేదీన చెన్నైలో తుది శ్వాస వదిలారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## ఎగబాకిన ఎరువుల ధరలు

నిజామాబాద్ : యాసంగి సీజన్‌లో రైతులకు ఎరువుల భారం గుదిబండగా మారింది. ఎన్నో ఆశలతో సాగుకు సన్నద్ధమైతే ఎరువుల కొరత, పెరిగిన ధరలు అన్నదాత నడ్డి విరుస్తున్నాయి. కొత్త ఏడాది ప్రారంభంలోనే ఇలా కంపెనీలు షాక్ ఇవ్వడంతో జిల్లా రైతులపై రూ.కోట్లలో అదనపు భారం పడనుంది. ముఖ్యంగా డీఏపీ ధర గణనీయంగా పెరిగింది. ఏకంగా బస్తాకు రూ.300 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ ఇవ్వాలని భావిస్తున్నాయి. అయితే సరకు మార్కెట్లోకి రాకుండా కంపెనీలు కట్టడి చేస్తున్నాయి. పైగా ఎక్కువగా వాడే మిశ్రమ ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయి. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని మెలిక పెడుతున్నారు. కంపెనీలు, పంపిణీదారులపై ఉన్నతాధికారుల నియంత్రణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

**రూ.2.60 కోట్లు అదనపు భారం**

జిల్లాలో మిశ్రమ ఎరువుల్లో అత్యధికంగా 20:20:0:15 వాడుతారు. ఈ ఎరువు గత సీజన్‌లో 50 కిలోల బస్తా రూ.1,150 ఉంటే ఈ సీజన్‌లో రూ.1,350 వరకు విక్రయిస్తున్నారు. 14:35:14 ఎరువు బస్తా రూ.1700 ఉంటే ప్రస్తుతం రూ.1800 పలుకుతోంది. ఒక్క



సీజన్‌లో మిశ్రమ ఎరువులు 40 వేల మె.టన్నులు వరకు వినియోగం ఉ ఉంటుంది. ఈ లెక్కన పెరిగిన ధరలతో రైతులకు సుమారు రూ.1.60 కోట్ల అదనపు భారం పడుతోంది. డీఏపీ ఇదివరకు బస్తాకు రూ.1350 ఉండగా ఈ కొత్త ఏడాది రూ.300 పెంచి రూ.1650లకు ఇవ్వాలని కంపెనీలు నిర్ణయించాయి. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో కనీసం 16 వేల మె.టన్నులు అవసరం ఉంటుంది. ధర పెరిగి రైతులపై రూ.కోటి వరకు భారం పడనుంది. ఈ ఒక్క సీజన్‌లోనే రూ.2.60 కోట్ల మేర రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. డీఏపీ ఎరువును ప్రభుత్వం రాయితీపై ఇవ్వాలని యోచిస్తోంది. అదే జరిగితే బస్తా రూ.1150 వరకు వచ్చే వీలుంది. కానీ, సదరు కంపెనీలు ఉత్పత్తిని తగ్గించి మార్కెట్లో సరుకు నియంత్రిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. సరిపడా దొరకడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో డీఏపీతో పాటు మిశ్రమ ఎరువుల్లో ఎక్కువగా వినియోగించే 12:36:16 ఇప్పుడు అందుబాటులో లేవని అన్నదాతలు నిట్టూరుస్తున్నారు.

**నేరుగా ఇవ్వరు..**

మార్కెట్‌లో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు. అదేమంటే పై నుంచి కంపెనీలు లింకులు పెట్టి ఇస్తున్నాయని దుకాణదారులు చెబుతున్నారు. కేవలం యూరియానే కావాలంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. జిల్లాలో ఒక్క యూరియానే సీజన్‌కు 70 వేల మె.టన్నులు మేర వినియోగమవుతుంది. ఈ లెక్కన బస్తాకు రూ.10 అదనంగా వసూలు చేసినా రైతులకు రూ.1.50 కోట్ల మేర భారం పడుతుంది. బయట ప్రైవేటు దుకాణాల్లోనే కాకుండా సహకార సంఘాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని కర్షకులు వాపోతున్నారు. నానో యూరియా, డీఏపీని తీసుకోవాలని కంపెనీలు షరతు విధిస్తున్నాయని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. సీజన్‌కు ముందే యూరియా కృత్రిమ కొరత సృష్టించడం, కాంప్లెక్స్ ఎరువులతో మెలిక పెట్టి అమ్మడం సరికాదని, ఉన్నతాధికారులు స్పందించి పంపిణీదారులు, కంపెనీలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

**డీఏపీ స్థానంలో ప్రత్యామ్నాయం**

రైతులకు డీఏపీ ఎరువు అందుబాటులో లేకున్నా, ఎక్కువ ధరకు కొనొద్దని, ప్రత్యామ్నాయంగా వీటిని వినియోగించొచ్చని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. పంటలకు 'పీ' మూలకం చేరేలా కొన్ని మార్గాలు వెల్లడించింది.

**నానో డీఏపీతో అవసరాలు తీర్చుకోవచ్చు**

ఎస్ఎస్‌పీ లభ్యత సరిపోతుంది. డీఏపీ స్థానంలో యూరియాతో కలిపి ఎస్ఎస్‌పీ కలిపి వాడుకోవచ్చు.

కాంప్లెక్స్ గ్రేడ్ ఎరువులు వాడుకోవాలి

పీఆర్ఓఎం (ఫాస్ఫేట్ అధికంగా ఉండే సేంద్రియ ఎరువు) వాడుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

నేలలో పీఎస్‌బీని వినియోగించుకునేలా ప్రోత్సహించాలి.

## రేషన్ దుకాణాలకు ముక్కిన బియ్యం

మల్యాల : రేషన్ దుకాణాలకు ముక్కిన బియ్యం సరఫరా చేయడంతో వినియోగదారులు వాటిని తీసుకునేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. మల్యాల మండల కేంద్రంలోని పౌరసరఫరాల గోదాం నుంచి ప్రతి నెలా మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాల్లోని 87 రేషన్ దుకాణాలకు 6,700 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని సరఫరా చేస్తారు. ఇప్పటి వరకు 37 రేషన్ దుకాణాలకు అధికారులు బియ్యం సరఫరా చేశారు. హమాలీల సమ్మె కారణంగా మిగిలిన రేషన్ దుకాణాలకు సరఫరా కాలేదని గోదాం ఇన్‌ఛార్జి మహ్మద్ షమీ తెలిపారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం పూర్తిగా ముక్కిపోవడంతోపాటు అధికంగా నూకలు కలిసి ఉన్నాయని వినియోగదారులు



పేర్కొంటున్నారు. వీటిని పలువురు వినియోగదారులు రేషన్ దుకాణాల నుంచి తీసుకెళ్లిన వెంటనే కిలో బియ్యాన్ని రూ.15 కిలో చొప్పున విక్రయిస్తుండటం విశేషం. గతంలో కూడా పలుమార్లు రేషన్ దుకాణాల ద్వారా దీంట్లు ఇలాంటి బియ్యం అందజేయడంతో ఫిర్యాదు చేసినా అధికారులు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయించడంలేదని పలువురు వినియోగదారులు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని మిల్లుల్లో బియ్యంగా మారుపడంతో ముక్కిపోయి ఉంటాయని, వాటినే రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తున్నారని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముక్కిన బియ్యం సరఫరా విషయమై పౌరసరఫరాల గోదాం ఇన్‌ఛార్జి మహ్మద్ షమీ దృష్టికి తీసుకెళ్లగా తాము ఏం చేయలేమని, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

# వాగులో కాసుల వేట



సిరిసిల్ల : జిల్లాలో స్థానిక అవసరాలకు ప్రభుత్వం వేబిల్లుల రూపంలో ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తుంది. తర్వాత దీనిపై పట్టించుకునేవారు ఉండరు. అక్రమార్కులు ఇసుక ట్రాక్టర్లను అతివేగంగా ఇష్టారీతిన నడుపుతూ తరలిస్తుంటారు. ముస్తాబాద్ మండలం నామాపూర్, పోత్గల్‌లో ఇసుక ట్రాక్టర్ల ప్రమాదంలో కానిస్టేబుల్, హోంగార్డులు గాయాలపాలయ్యారు. ఇలా పోలీసులే కాదు. ఇసుక వాహనాల కింద పడి నలిగిన కుటుంబాలు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ ఉన్నాయి. ప్రమాదం జరిగినప్పుడు అధికార యంత్రాంగం రెండు, మూడు రోజులు హడావుడి చేసి తర్వాత షారా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.జిల్లాలో మానేరు, మూలవాగుల్లో పన్నెండు ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వీటిలో మండలానికి వారంలో రెండ్రోజులు రెవెన్యూశాఖ ట్రాక్టర్‌కు రూ.300 చొప్పున వసూలు చేసి వేబిల్లులు జారీ చేస్తుంది. దీనిపై ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు ఇసుకను తీసుకెళ్లవచ్చు. జారీ చేసిన వేబిల్లులో ట్రాక్టర్ నంబరు, డ్రైవరు పేరు, ఇసుక నింపే సమయం కచ్చితంగా నమోదు చేయాలి. ఇసుక తరలించే క్రమంలో రీచ్‌కు సమీపంలో రెవెన్యూశాఖ, మైనింగ్ సిబ్బందితో ఒక చెక్‌పోస్టు నిర్వహించాలి. జిల్లాలో ఇలాంటివి ఎక్కడా కనిపించవు. వేబిల్లుల జారీ మొదలు వాగుల్లో ఇసుక తవ్వకాలు, తరలింపు వరకు అంతా మామూలుగా తీసుకుంటున్నారు.

తీవ్ర నేరాలకు పాల్పడేవారిపై ప్రయోగించే పీడీ యాక్టును సైతం పోలీసులు ఇసుక అక్రమార్కులపై నమోదు చేశారు. 2021 జనవరిలో ఇల్లంతకుంట మండలం కందికట్కూరులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వెంకటేశంను అదే గ్రామానికి చెందిన రాజేశం అనే వ్యక్తి అడ్డుకున్నారు. అతడిని కర్రలతో దాడి చేసి హతమార్చారు. దాడికి పాల్పడిన వెంకటేశంపై రౌడీ షీటు తెరిచారు. తర్వాత పీడీ చట్టం నమోదు చేశారు. అక్రమాన్ని నియంత్రించాల్సిన రెవెన్యూ, గనులు, రవాణా, పోలీసుశాఖలు ఎవరి దారి వారిదే అన్నట్లు వ్యవహరించడం అక్రమార్కులకు మరింతగా కలిసి వస్తుంది.

: ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో గతేడాది జూన్ 25న అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వాటిని డ్రైవర్లతోపాటు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా అందులోని ఒక ట్రాక్టర్‌ను నేరుగా చెరువులోకి వదిలేసి డ్రైవరు పక్కకు తప్పుకున్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ ఆరు నెలలుగా చికిత్స పొందుతున్నాడు. ఇదే మండలంలో డిసెంబరు 31న పోత్గల్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు తరలించే క్రమంలో డ్రైవరు అతివేగంగా నడపడంతో అదుపు తప్పి పక్కనున్న పొలాల్లో బోల్తా కొట్టింది. డ్రైవరు పక్కన కూర్చున్న హోంగార్డుకు తీవ్ర గాయాలయ్యాయి.

**రెవెన్యూశాఖకు రాస్తున్నాం**

వే బిల్లుల జారీలో ట్రాక్టర్ నంబరు, తేదీలను రెవెన్యూశాఖ సరిచూసుకోవాలి. పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న వాటికి జరిమానా కోసం రెవెన్యూశాఖకు రాస్తున్నాం.క్రాంతికుమార్, గనులశాఖ ఏడీ

# ఆదేశాలు బేఖాతరు



సారంగాపూర్ : అనుమతి లేకుండా గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా పట్టించుకునే వారు కరవయ్యారు. బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయి, చిత్రవేణిగూడెం, కమ్మునూర్, మంగెళ, రంగసాగర్ మీదుగా గోదావరి ప్రవాహం కొనసాగుతోంది. బీర్‌పూర్ మండలంలోని గోదావరి తీర ప్రాంతం నుంచే కాకుండా ధర్మపురి మండలంలోని పలు గ్రామాల నుంచి బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల మీదుగా వివిధ గ్రామాలతోపాటు జగిత్యాల పట్టణానికి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. ఎవరైనా అధికారులు పట్టుకున్నా ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఏమీ చేయలేని పరిస్థితి ఉందని మండల స్థాయి అధికారులు వాపోతున్నారు.

**నిరంతర తరలింపు**

జిల్లాలో ఇటీవల రీచ్‌లు గుర్తించి మూడు క్యూబిక్ మీటర్ల ఇసుకకు రూ.800 ధర నిర్ణయించారు. తహసీల్దార్లను సంప్రదించి డీడీ చెల్లించి అనుమతి తీసుకొని ఇసుక తరలించుకోవచ్చని సూచించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి ఉన్న ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ రోజంతా స్థానిక ట్రాక్టర్ యజమానులు నది నుంచి ఇసుకను ఒడ్డుకు చేర్చి సాయంత్రం నుంచి తెల్లవారు జాము వరకు టిప్పర్ల ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు. నది నుంచి ట్రాక్టర్ ద్వారా ఒడ్డుకు చేర్చి టిప్పరు నింపి పంపిస్తే ట్రాక్టర్ యజమానికి రూ.10వేలు చెల్లిస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని గోదావరి తీర ప్రాంతంలోని ఓ గ్రామంలో ఎక్కడ చూసినా ఇసుక కుప్పలు దర్శనమిస్తున్నా చర్యలు తీసుకోవడంలేదని, రహదారి పూర్తిగా గుంతలుగా మారి మట్టి రోడ్డుకన్నా అధ్వానంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నిరంతరం ఇసుక రవాణా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

**ఇతరులకు అనుమతి లేదు!**

బీర్‌పూర్ మండలంలో గోదావరి తీరం వెంట గ్రామాలు మినహా ఇతర గ్రామాల వారు వెళితే అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా అధికారులకు చెప్పి జరిమానా విధించేలా చూస్తారని పలు గ్రామాల ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు. గోదావరి తీరం వెంట ఉన్న గ్రామాల వారి అనుమతి తీసుకుంటేనే ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకునే వీలుంటుంది. గోదావరి తీరం వెంట దంపుల కొద్దీ ఇసుక ఉన్నప్పటికీ ఏనాడు అధికారులు సీజ్ చేయకపోవడంతో దందా నిరంతరం కొనసాగుతోంది. మండలంలోని కమ్మునూర్ గ్రామంలో ఇసుక తరలింపును గ్రామస్థులు ఆడ్డుకోవడం, వంతెన ఉండడం, అధికారులు అడ్డు చెప్పడంతో అక్రమ తరలింపునకు అవకాశం ఉండడం లేదు. మండలంలోని రేకులపల్లె, చిన్నకొల్వాయిలో ఇటీవల ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసేందుకు మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇందులోని ఒక గ్రామంలో విచ్చలవిడిగా ఇసుక తరలింపు కొనసాగుతూనే ఉంది. రీచ్‌లను త్వరితగతిన ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వానికి కొంత మేర ఆదాయం సమకూరనుంది.

# ఆదర్శ బడులు.. సత్ఫలితాలకు వేదికలు




కామారెడ్డి : విద్య బోధనలో నాణ్యతకు వేదికగా ఆదర్శ బడులు పేరొందాయి. సత్ఫలితాల సాధన దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 16 ఆదర్శ బడుల్లో 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలు పొందేందుకు నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించారు.

**నాణ్యమైన చదువులపై దృష్టి**

ఆదర్శ పాఠశాలలకు ఎంపికై ప్రవేశం పొందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతో శతశాతం ఫలితాలు సాధించేలా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. వీటిల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు అత్యధికంగా 10 జీపీఏలు సాధిస్తున్నారు. గతేడాది సదాశివనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు బాసర ఐఐఐటీలో 21 మంది సీట్లు సాధించారు. సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.వృత్తి విద్యా కోర్సుల్లో రాణించేలా తోడ్పాటు అందిస్తున్నారు.

**స్థానికతకు చోటు..**

ఆదర్శ బడుల్లో ప్రవేశాలకు స్థానికతను పరిగణనలోకి తీసుకుంటున్నారు. పాఠశాల ఉన్న మండల పరిధిలో ఆధార్‌కార్డు కలిగిన వారికే ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులుగా పరిగణిస్తున్నారు. కాగా ఆదర్శ పాఠశాలల్లో చేరేందుకు జిల్లా కేంద్రాల నుంచి కూడా ఆసక్తి చూపడంతో డిమాండు ఏర్పడింది. కాగా పట్టణాల్లోని విద్యార్థులకు ప్రవేశం పొందే అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**సాధారణ విద్యార్థులకు రూ.200**

జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు %http:/// telangana.cgg.gov.in% పోర్టల్‌లో అర్జీలు స్వీకరించనున్నారు. సాధారణ విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 ప్రవేశ పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 3 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదే నెలలో 13వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. 'ఆదర్శ బడుల్లో ప్రవేశాలకు విద్యార్థులు నిర్దిష్ట గడువులోగా ముందుకు రావాలి' అని కామారెడ్డి డీఈవో రాజు సూచించారు.

## యాసంగి.. నెమ్మదిగా 'సాగు'తోంది!

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 'యాసంగి' పంటల సాగు ఇప్పటివరకు అంతంతమాత్రమే. ఖమ్మం జిల్లాలో ఈనెలాఖరు వరకు సాగు విస్తీర్ణం పుంజుకుంటుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. సాగర్ జలాలను వారబందీ పద్ధతిలో సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించిన విషయం విదితమే. అయితే ప్రస్తుత సీజన్‌లో వరి సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గుచూపటం లేదు. సాధారణంగా యాసంగిలో దొడ్డు రకాలను అధిక మంది ఎంచుకుంటారు. ఈ రకాలకు ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవటంతో సాగు విస్తీర్ణంపై ప్రభావం పడే అవకాశముంది. వానాకాలంతో పోల్చితే పెట్టుబడులూ ఎక్కువవుతాయని అన్నదాతలు చెబుతున్నారు. గులాబీ రంగు పురుగు వల్ల చాలా ప్రాంతాల్లో పత్తి పంట దెబ్బతింది. దీన్ని తొలగించి అధిక శాతం మంది మొక్కజొన్న సాగుకు పూనుకుంటున్నారు. పెట్టుబడి తక్కువవటం, ధర ఆశాజనకంగా ఉండటంతో మొక్కజొన్న పంట విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. గతంలో పోల్చితే వేరుసెనగ విస్తీర్ణమూ కొంతమేరకు పెరగటం విశేషం. భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు 'వరి' తక్కువగానే సాగైంది. ఈనెలాఖరు వరకు పూర్తిస్థాయిలో



సాగయ్యే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రధానంగా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, బోర్ల కింద ఈపంట సాగవుతుంది. మొక్కజొన్న సాగు విస్తీర్ణం లక్ష్యం దిశగా వెళ్తోంది. పెసర సాగు ఆశాజనకంగా ఉంది. ఇతర పంటల సాగు విస్తీర్ణం నామమాత్రమే. ఉభయ జిల్లాల్లో రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది. రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. యాసంగికి సాగుకు రైతులకు వ్యవసాయశాఖ అన్ని రకాలుగా సహకరిస్తుంది.దనసరి పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

## దళారులదే హవా

సంగారెడ్డి : జిల్లాలో పత్తి కొనుగోళ్లు నిర్దేశిత లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం.. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది కొర్రీలతో విసుగు చెందిన కర్షకులు దళారులకు పంటను అమ్ముకుంటున్నారు. మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో 4.19 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని, ఈ మేరకు కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. గత నవంబరు నుంచి ఇప్పటి వరకు 1.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి మాత్రమే అధికారికంగా కొనుగోలు చేశారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దళారులతో కుమ్మక్కయ్యారనే విమర్శలొస్తున్నాయి.

**3.49 లక్షల ఎకరాల్లో సాగు**

ఈ ఏడాది వానా కాలంలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 3.49 లక్షల ఎకరాల్లో సాగయింది. జిల్లాలో సదాశివపేట, రాయికోడ్, జోగిపేట, నారాయణఖేడ్, వట్‌పల్లి, జహీరాబాద్, పటాన్‌చెరులో మార్కెటింగ్ శాఖకు యార్డులున్నాయి. వీటిలో పటాన్‌చెరు, సంగారెడ్డి మినహా మిగిలిన అన్ని చోట్ల పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాల్లో గత నవంబరు నాలుగో తేదీ నుంచి ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 12 శాతం లోపు తేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర.. పొడవు గింజ రకానికి రూ.7521(క్వింటాలుకు), పొట్టి గింజ రకానికి రూ.7121(క్వింటాలుకు) రైతులకు చెల్లించాలి.

**ఫిర్యాదు చేయండి.. రైతులకు న్యాయం చేస్తాం**

అన్నదాతలు సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలి. దళారులకు విక్రయించి మోసపోవద్దు.



కొందరు రైతులు ఎరువులు, విత్తనాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. వారికే పంటను అమ్ముతున్నారు. సీసీఐ సిబ్బంది దళారులతో కుమ్మక్కయినట్లు సమాచారం ఉంటే ఫిర్యాదు చేయాలి. రైతులకు న్యాయం చేస్తాం. ఫిబ్రవరి వరకు పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయి. – మహ్మద్ రియాజ్, ఏడీ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ.

**దందా తీరిది..**

భారత పత్తి సంస్థ(సీసీఐ) ఆధ్వర్యంలో జిల్లాలో అధికారికంగా పత్తి కొనుగోలు చేయాలి. 30 నుంచి 40 శాతం రైతులు మాత్రమే ఈ కేంద్రాల్లో పంట విక్రయించారు. మిగిలిన పంట దళారుల చెంతకు చేరుతోంది. దళారులు, సీసీఐ కేంద్రాల నిర్వాహకుల మధ్య అవగాహన ఉందనే ఆరోపణలొస్తున్నాయి. పంట నమోదులో ఇబ్బందులు, ఆధార్ అనుసంధానం, తేమ తదితర కొర్రీలతో ఇబ్బందుల వల్లనే కర్షకులు దళారులకు పంట విక్రయించడానికి మొగ్గ చూపుతున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పొడవు గింజ రకానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 ఉండగా దళారులు రూ.ఏడు వేల లోపు మాత్రమే చెల్లిస్తున్నారు.

**జిల్లాలో పత్తి విక్రయాలు ఇలా..**

(గత నవంబరు 4 నుంచి ఈ నెల 5 వరకు)

పత్తి దిగుబడి అంచనా: 4.19 లక్షల మెట్రిక్ టన్నులు

పంట విక్రయించిన రైతులు: 41,407

సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు: 1.15 లక్షల మెట్రిక్ టన్నులు

కొనుగోలు చేసిన పత్తి విలువ: రూ.853.99 కోట్లు

రైతుల ఖాతాల్లో జమ: రూ.723.12 కోట్లు

బకాయిలు: రూ.130.87 కోట్లు

## చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైనా.. కొలిక్కిరాని రహదారి విస్తరణ

హైదరాబాద్ : అనేక వాయిదాల తర్వాత చర్లపల్లి టెర్మినల్ సోమవారం ప్రధాని మోదీ చేతులమీదుగా (వర్చువల్‌గా) ప్రారంభమైంది. విమానాశ్రయాన్ని తలపించేలా సుమారు రూ.430 కోట్లతో టెర్మినల్ నిర్మించారు. 25 జతల రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రణాళికలు రచిస్తోంది. తద్వారా సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గనుంది. ప్రయాణికుల రాకపోకలకు మరికొన్ని రోజులు ప్రయాస తప్పేలా లేదు. చర్లపల్లి స్టేషన్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్ల పనులు ముందుకు కదలడం లేదు. ప్రారంభోత్సవంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల ప్రసంగాలు చర్చకు దారితీసాయి. రోడ్డు విస్తరణకు కేంద్రం గ్రాంట్ విడుదల చేయాలని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు కోరగా..అది మీ బాధ్యతే అంటూ రైల్వే సహాయమంత్రి వి.సోమన్న బదులిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ అంశంపె ప్రసంగించారు. భారాస ప్రభుత్వా



నికి అనేక లేఖలు రాశానని, ప్రస్తుత ప్రభుత్వానికీ లేఖ రాశానని అన్నారు. **8.23 ఎకరాలు అప్పగించిన అటవీశాఖ..** టెర్మినల్ ముఖద్వారం దక్షిణం వైపు ప్రతిపాదించిన 100 అడుగుల రహదారి విస్తరణకు ఐవోసీఎల్, బీపీసీఎల్ మధ్యఉన్న అటవీభూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు 14 పరిశ్రమలను తరలించి రహదారి విస్తరించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈనెల 4న 8.23 ఎకరాలను అటవీశాఖ అప్పగించిందని ఐలా కమిషనర్ ప్రభాకర్ తెలిపారు.

**బస్సులు నడిపేందుకు ఆర్టీసీ కసరత్తు..** ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ఆయా మార్గాలను పరిశీలించి నివేదిక పంపారు. ముఖద్వారం వైపు బస్సుల రాకపోకలకు అనువైన రోడ్లు లేవని నివేదించారు. సోమవారం ఉన్నతాధికారులు రైల్వే అధికారులను కలిశారు. మంగళవారం ఈఅంశంపై స్పష్టత రానుందన్నారు.

## నిబంధనలా.. అవేలా ఉంటాయ్?

హైదరాబాద్ : ప్రభుత్వ భూములకు రెక్కలొస్తున్నాయి. కబ్జాదారుల చెరలోకి వెళ్లిపోతున్నాయి. ఏకంగా సర్కారు స్థలంలో రెడీమిక్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి వ్యాపారమే చేస్తున్నా యంత్రాంగం కన్నెత్తిచూడటం లేదు. హిమాయత్ సాగర్‌కు కూతవేటు దూరంలో హైదరాబాద్–బీజాపూర్ రహదారికి సమీపంలో ఓ రెడీమిక్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 176లో పది ఎకరాలు ఆక్రమించారు. ఇక్కడ ఎకరా రూ.20 కోట్ల వరకు ఉంటుందని, ఈ లెక్కన కబ్జా చేసిన భూమి విలువ రూ.200 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఈ సర్వే నంబర్‌లో 162 ఎకరాలుండగా అసైనీలకు కేటాయించారు. ఈ భూములను కొన్నేళ్లుగా ఎవరూ సాగు చేయకపోవడంతో ప్రస్తుతం



ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. దీంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. కొద్దినెలల క్రితం రెడీమిక్స్ ప్లాంట్‌ను పెట్టారు. తాము ప్లాంటు కోసం దరఖాస్తు చేసుకున్నామని, అనుమతులొచ్చాయని అధికారులను నమ్మించి వెంటనే కార్యకలాపాలూ ప్రారంభించారు.

**పరిశ్రమలు... నిర్మాణాలపై నిషేధమున్నా...**

జంట జలాశయాల పరిరక్షణ కోసం గత ప్రభుత్వాలు 111జీవోను అమలు చేస్తున్నాయి. దీని ప్రకారం జలాశయాల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు, పరిశ్రమలు ఉండకూడదు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులు వాటిని తొలగించి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఇవేమీ తమకు వర్తించవన్నట్లు కొందరు ప్రైవేటు వ్యక్తులు రెడీమిక్స్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

**ప్రజాప్రతినిధుల అండతోనే...**

రెడీమిక్స్ ప్లాంట్‌ను ఎవరు ఏర్పాటు చేశారో... ఎవరు నిర్వహిస్తున్నారో స్థానికుల్లో చాలామందికి తెలియదు. సమీపంలోని అజీజ్‌నగర్ వాసులను వాకబు చేయగా.. ఇద్దరు ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిపై మెయినాబాద్ తహసీల్దార్ కె.గౌతమ్ కుమార్‌ను వివరణ కోరగా.. రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు విషయం తమకు తెలియదని, సర్వే నంబరు 176 పూర్తిగా ప్రభుత్వ భూమేనని స్పష్టం చేశారు. నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పైలట్ ప్రాజెక్టుగా పంటల సర్వే

జగిత్యాల : జిల్లాలో యాసంగి పంటలను రైతులు పెద్దఎత్తున సాగుచేస్తుండగా పైర్ల నమోదు ప్రక్రియను చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా గ్రామంలో సాగుచేసిన పంటల వివరాలు నమోదు చేస్తారు. మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ఏఈవో గ్రామంలోని సర్వే నంబరులోని పొలం వద్దకు వెళ్లి పోర్టల్‌లో సూచించిన వివరాలు నమోదు చేయాలి. ఉపగ్రహ సాయంతో సెల్‌ఫోన్ లేదా ట్యాబ్‌లలో ప్రత్యేక పోర్టల్‌లో రెండుమూడు రోజుల్లోగా వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉంది. రైతు పేరు, సర్వే నంబర్లవారీగా సాగుచేసిన పంటలు, ఎన్ని ఎకరాల్లో సాగుచేశారు, సాగుచేయని విస్తీర్ణం తదితర వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి సీహెచ్.రాంచందర్ తెలిపారు. సర్వేలో ఏవేని అవాంతరాలు ఏర్పడితే రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రస్తుతం ఎంపికచేసిన అన్ని గ్రామాల్లో 13,674 ఎకరాల భూమి ఉండగా 500 ఎకరాలకన్నా తక్కువగా భూమి ఉంటే పూర్తిగా సర్వేచేసి నమోదు చేయాలి. 500 ఎకరాలకన్నా ఎక్కువ భూమి ఉంటే కనీసం 500 ఎకరాల్లో సర్వేచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పంటలను సాగు చేసిన భూములకే రైతుభరోసా పెట్టుబడిసాయం నిధులను విడుదల చేస్తామని పేర్కొన్న నేపథ్యంలో ఈ సర్వే ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇసుక తరలిపోతున్నది!



తాండూరు: తాండూరు నియోజకవర్గం కాగ్నా, కాకర వేణి నదుల్లో అక్రమంగా తవ్వకాలు జరుపుతూ ఇసుకను తరలించేస్తున్నారు. గృహనిర్మాణ దారులకు విక్రయించి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. రెండు నదుల నుంచి నిత్యం వేల క్యూబిక్ మీటర్ల జలసిరి తరలిపోతున్నా, అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు దందాను రెట్టింపు చేశారు. రెండు నదుల మధ్యలో చాలా చోట్ల ఇసుక వాహనాల రాకపోకల కారణంగా దారులుగా మారిపోయాయి. వ్యవసాయ పనులకు వినియోగించే ట్రాక్టర్లు కొన్ని వాణిజ్యపరమైన కార్యకలాపాల పరిధిలోకి వచ్చే ఇసుక తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు.

**అనుమతుల పేరిట అడ్డగోలుగా:** జిల్లాలో తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల కోసమని కాగ్నా, కాకరవేణి నదుల నుంచి ఇసుకను తరలించేందుకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే తరలింపుపై పర్యవేక్షణ ఉండడంలేదు. అనుమతి పొందిన వ్యాపారులు నిర్ణీత ప్రదేశానికి బదులు ప్రైవేటు పనులకే ఎక్కువగా తరలిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకకు దూరాన్ని బట్టి రూ.5,000 నుంచి రూ.6,000 వరకు విక్రయిస్తున్నారు. ఇక వీరికి తోడు అనుమతి లేని వారు కూడా నదుల్లోంచి దర్జాగా కొల్లగొట్టి విక్రయిస్తున్నారు. ఇలా ఒక్క రోజు 300 ట్రిప్పుల ఇసుక తరలిపోతోంది. ఈ లెక్కన ఒక్క రోజులోనే రూ.15లక్షల నుంచి రూ.18లక్షలు సంపాదిస్తున్నారు. తాండూరులో ఓ భవన నిర్మాణం పేరిట నిత్యం తరలిస్తున్నారు. ఇందులో ఎక్కువగా పక్కదారే పడుతోంది.

**ఎక్కడెక్కడ అంటే**

యాలాల మండలం బెన్నూరు, దేవనూరు, విశ్వనాథ్‌పూర్, సంగెం కుర్దు, యాలాల, గోవిందరావు పేట, తాండూరు మండలం బిజ్వార్, ఖాంజాపూరు, అగ్గనూరు, పాత తాండూరు, పెద్దేముల్ మండలం మదనంతపూరు, రేగొండి, రుక్మాపూరు, మన్‌సాన్‌పల్లి, బషీరాబాద్ మండలం జీవన్గి, నవాంద్గి, గంగ్వార్, క్యాద్గిర.

**రాయల్టీ పేరిట దందా** తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గ కేంద్రాలకు భద్రాచలం, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు గనుల శాఖకు రాయల్టీ చెల్లించి లారీల్లో తరలిస్తున్నారు. ఇదే ఇసుకను కొందరు డబ్బులు చెల్లించి గృహాల నిర్మాణాలకు కొనుగోలు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి లారీల్లో వచ్చిన ఇసుక ఖాళీ చేసిన వ్యాపారులు రాయల్టీ పత్రాన్ని మాత్రం తమ వద్దే ఉంచుకుంటున్నారు. అయితే తాండూరు నియోజకవర్గంలోని కాగ్నా, కాకర వేణి నదుల నుంచి తరలించి రహస్య ప్రాంతాల్లో డంపు చేసిన ఇసుకను సదరు లారీల్లో నింపి దర్జాగా అడ్డాపై నిలువరించి యథేచ్ఛగా విక్రయించి సొమ్ము చేసుకుం టున్నారు. ఒక్కో లారీ ఇసుకను రూ.25వేల నుంచి రూ.30వేల వరకు విక్రయిస్తున్నారు. ఇలా ప్రతి రోజు 5 నుంచి 10 లారీలు అక్రమంగా అమ్ముతున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేస్తే పట్టుబడే అవకాశం ఉన్నా, ఇది జరగడం లేదు. అడ్డాల్లోని లారీల్లో ఉన్న ఇసుక నమూనాలను ప్రయోగశాలల్లో పరిశీలించినా బండారం బయటపడే అవకాశం ఉన్నా చేయడం లేదు.

# హనీట్రాప్.. ఆపై రూ.కోట్ల స్కామ్




హైదరాబాద్: మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో జీవిత భాగస్వామి కోసం వెతికే పురుషులే వారి లక్ష్యం. తెలుగులో మాట్లాడుతూ.. విదేశాల్లో ఉంటున్నట్లు నమ్మించి మోసం చేస్తారు. ఇద్దరం కలిసి బాగా సంపాదిద్దామంటూ బిట్‌కాయిన్, స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరిట రూ.కోట్లు కొట్టేస్తారు ఈ సైబర్ మోసగాళ్లు. మ్యాట్రిమోనీ వేదికలు.డేటింగ్ యాప్‌లలో యువతుల్లా నటిస్తూ హనీట్రాప్ చేస్తున్నారు. **అందమైన ఫొటోలతో..** ఇటీవల పెళ్లి సంబంధాల కోసం మ్యాట్రిమోనీ వేదికల్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. దీనికితోడు డేటింగ్ యాప్‌ల వినియోగం అధికమవుతోంది. ఇదే అదునుగా నేరగాళ్లు నకిలీ ఫొటోలు సృష్టిస్తున్నారు. ఆన్‌లైన్‌లో అందమైన యువతుల ఫొటోలు సేకరించి డీపీలుగా పెడతారు. ఈ ఖాతాల ద్వారా పెళ్లి, స్నేహానికి తాము సుముఖంగా ఉన్నామంటూ సందేశాలు పంపిస్తారు. వ్యక్తిగత వివరాలు సేకరిస్తారు. ఈ క్రమంలో తాము ఇటీవల స్టాక్ ట్రేడింగ్, బిట్‌కాయిన్‌లో పెట్టుబడులతో బాగా సంపాదించినట్లు చెబుతారు. ఈసారి ఇద్దరు కలిసి పెట్టుబడులు పెట్టి సంపాదిస్తే భవిష్యత్తులో స్థిరపడొచ్చంటారు. వారే కొన్ని వెబ్‌సైట్లను సూచించి రిజిస్టర్ చేయిస్తారు. వీటిలో పెట్టుబడి పెట్టిన ప్రతిసారీ దానికి లాభాలు వచ్చినట్లు వర్చువల్‌గా చూపిస్తుంది. విత్‌డ్రాకు అవకాశం ఉండదు. బాధితులు నగదు పంపడం ఆపేస్తే పత్తా లేకుండా పోతారు.

**పురుషులే లక్ష్యం ఎందుకంటే..?**

లేటు వయసులో భాగస్వామి కోసం వెతికేవారు, విడాకుల తర్వాత రెండోసారి వివాహం చేసుకునే పురుషులే లక్ష్యంగా ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారిలోనూ ఎక్కువగా సంపన్నులే ఉంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో వారి నేపథ్యం, బాధితులతో మాట్లాడినప్పుడు ఒంటరిగా ఉంటున్నారా అని పరిశీలించాకే నేరగాళ్లు రంగంలోకి దిగుతారు.

**ఇలా మోసపోయారు**

మాదాపూర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి(46) వివాహం కోసం తెలుగు మ్యాట్రిమోనీని ఆశ్రయించాడు. గతేడాది ఆగస్టు రెండో వారంలో బ్రిటన్‌లో నివాసం ఉంటున్నట్లు మీనాక్షి పరిచయమైంది. పెళ్లి చేసుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన మీనాక్షి.. పరిచయం పెంచుకుని కొన్ని రోజులు మాట్లాడింది. ఈ క్రమంలోనే తాను క్రిప్టో ట్రేడింగ్‌లో బాగా డబ్బు సంపాదించినట్లు చెప్పింది. నిజమని నమ్మిన ఉద్యోగి ట్రేడింగ్‌కు సిద్ధమయ్యాడు. ఆమె చెప్పినట్లు నకిలీ వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకుని దశలవారీగా రూ.94.51 లక్షలు పెట్టుబడి పెట్టాడు. దీనికి ఐదురెట్లు లాభం వచ్చినట్లు కనిపిస్తున్నా.. విత్‌డ్రా చేసుకోడానికి వీలులేదు. బాధితుడు మోసపోయాడని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నగరంలో నివాసం ఉంటున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగికి సామాజిక మాధ్యమంలో ఓ మహిళ పరిచయమైంది. ఫారెక్స్ ట్రేడింగ్ చేసి సంపాదించినట్లు చెప్పింది. నకిలీ వెబ్‌సైట్‌లో రూ.1.89 కోట్లు పెట్టుబడులు పెట్టించింది. లాభాలు రాలేదు. అసలు కూడా వెనక్కి తీసుకోడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

2024లో మ్యాట్రిమోనీ మోసాల కేసుల సంఖ్య
హైదరాబాద్: 12
సైబరాబాద్: 53 రాచకొండ: 40

# స్లిప్పు తీసుకొని నేరుగా వైద్యుని వద్దకే



హైదరాబాద్: నిమ్స్‌లో ఓపీ అంటే బీపీ తప్పదు. నిత్యం 2500–3000 మంది వరకు రానుండటంతో ఓపీ కార్డు కోసం నిరీక్షణ తప్పదు. గంటల తరబడి క్యూలో ఉంటే తప్ప ఓపీ కార్డు పొందే అవకాశం లేదు. కొందరైతే ముందురోజు వచ్చి చెట్ల కింద ఉంటూ ఉదయమే ఓపీ కోసం వరుసలో నిలబడి స్లిప్పు తీసుకొని వైద్యులను సంప్రదిస్తున్నారు. ఈక్రమంలో రోగులు ఎన్నో వ్యయ ప్రయాసలు ఎదర్కొంటున్నారు. ముఖ్యంగా దూరప్రాంతం నుంచి వచ్చిన రోగులకు అగచాట్లు తప్పడం లేదు. ఈ ఇబ్బందులకు త్వరలోనే మోక్షం లభించనుంది. ఓపీ సేవలను మరింత చేరువ చేసేందుకు నిమ్స్‌లో కియోస్క్‌లు అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటికే వీటిని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. తొలుత రివ్యూ కోసం వచ్చే రోగులకే పరిమితం చేశారు. సానుకూలత రావడంతో మిగతా రోగులకూ అందుబాటులోకి తెస్తున్నారు. మిలీనియం బ్లాక్ వద్ద 2 యంత్రాలను ఈనెల 26 నుంచి అందుబాటులోకి తేనున్నారు. టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ఇది పూర్తి కానుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ తరహా కొత్త సాంకేతికత ఇదే తొలిసారి అని వైద్యులు తెలిపారు. రోగులకు **తప్పనున్న నిరీక్షణ**

ప్రస్తుతం పాత భవనంతోపాటు సూపర్ స్పెషాలిటీ బ్లాకుల వద్ద ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. కౌంటర్ వద్దకు వెళ్లి నిర్ణీత రుసుం చెల్లించి కార్డు తీసుకొని మళ్లీ వైద్యుని కోసం వేచి చూడాలి. కొన్నిసార్లు వైద్యుని కలిసి పరీక్షల రిపోర్టులు తీసుకొని మళ్లీ డాక్టర్‌ని చూపించే సరికే రోజు గడుస్తోంది. మళ్లీ రెండోరోజు రావాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఎంతో దూరం నుంచి వచ్చినవారు ఆసుపత్రి షెడ్డుల్లోనే గడుపుతున్నారు. మరుసటిరోజు సదరు వైద్యుడు రాకపోతే ఇంటికి వెళ్లి రెండు, మూడు రోజుల తర్వాత మళ్లీ వస్తున్నారు. కియోస్క్‌ల ఏర్పాటుతో ఓపీ స్లిప్పు పొందడం సులువని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. రోగి వివరాలు, సమస్య నమోదు చేసి ఆన్‌లైన్‌లో నిర్ణీత ఓపీ రుసుం చెల్లించిన తర్వాత ఒక స్లిప్పు వస్తుంది. దానిని తీసుకొని నేరుగా సంబంధిత విభాగం వద్దకు వెళ్లి వైద్యుని సంప్రదించవచ్చునన్నారు. గంటల తరబడి క్యూలో నిల్చొనే అవసరం ఉండదన్నారు. కియోస్క్‌ల వినియోగంలో రోగులకు సాయం అందించేందుకు సహాయకులను నియమించనున్నారు. నిమ్స్‌లో 27పైనే విభాగాలున్నాయి. అన్ని విభాగాల ఓపీ స్లిప్పులు ఈ కియోస్క్‌లతో పొందవచ్చు. అవసరాన్నిబట్టి మరిన్ని కియోస్క్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## నిధులున్నా నిర్మాణం సాగట్లే..

కామారెడ్డి: సకల సౌకర్యాలతో బాన్సువాడ పట్టణంలో నూతన గ్రంథాలయం నిర్మించేందుకు గతేడాది పాత భవనాన్ని కూల్చివేశారు. అప్పటి నుంచి గ్రంథాలయాన్ని తాత్కాలికంగా పట్టణంలోని స్టేడియం గదిలో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. దీంతో పోటీపరీక్షలకు సిద్ధమయ్యే ఉద్యోగార్థులు, పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టి సారించాల్సిన ఆవశ్యకతపై కథనం.

**సమస్యలు అధికం..**

జిల్లా కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం ఉంది. దీనిని డిజిటల్‌గా మార్చేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కాని జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గ విద్యార్థులు, ఉద్యోగార్థులకు కేంద్రంగా ఉన్న బాన్సువాడ గ్రంథాలయానికి మాత్రం శాశ్వత భవనం లేక ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా నిర్వహిస్తున్న స్టేడియంలో చదువుకునేందుకు అనువైన వాతావరణం, పాఠకుల సంఖ్యకు సరిపడా స్థలం లేకపోవడంతో సమీపంలోని చెట్ల కింద విద్యార్థులు కూర్చోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉద్యోగార్థుల ప్రయోజనార్థం రూ.లక్షల విలువైన పుస్తకాలను గ్రంథాలయాలకు పంపగా.. వాటిని భద్రపరిచేందుకు కూడా స్థలం లేకపోవడంతో సంచుల్లో నిల్వ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల స్టేడియంలో ఇతర కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే పోచారం




శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి ఉద్యోగార్థులు, విద్యార్థులు తమ సమస్యలను తీసుకెళ్లారు. ఇదే విధంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సైతం గ్రంథాలయ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతపై ఇంజనీరింగ్ అధికారులకు వివరించారు. దీంతో స్టేడియంలోనే పాఠకుల సౌకర్యార్థం తాత్కాలికంగా మరో షెడ్డు నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణం జరిగితేనే తమ సమస్యలు తీరుతాయని ఉద్యోగార్థులు పేర్కొంటున్నారు.

**వెనక్కి వెళ్లే అవకాశం..**

సీఎం ప్రత్యేక నిధి నుంచి గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు, రాష్ట్ర గ్రంథాలయ సమితి నుంచి ఫర్నీచర్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు మరో రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఏడాది పూర్తయినా నిర్మాణ పనులను గుత్తేదారు ప్రారంభించలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పనులు ప్రారంభించకపోతే మంజూరైన నిధులు వెనక్కి పోయే ప్రమాదం ఉంది. జిల్లాలో ఇప్పటికే ఎస్‌డీఎఫ్ కింద మంజూరై పనులు ప్రారంభం కాని వాటిని రద్దుచేసిన విషయం తెలిసిందే. బిల్లుల మంజూరులో జాప్యం చేస్తున్నారనే కారణంతో పనులు చేపట్టేందుకు గుత్తేదారు ముందుకు రాని పరిస్థితి. ఈ నేపథ్యంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి బిల్లుల మంజూరుకు హామీ ఇచ్చి శాశ్వత భనిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రైతు భరోసాపై కసరత్తు

కామారెడ్డి: అన్నదాతలకు రైతుభరోసా పథకంతో పెట్టుబడి సాయం పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలో జనవరి 26వ తేదీ నుంచి సాగు యోగ్యమైన భూములకు మాత్రమే సాయం అందించాలనే నిర్ణయాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో సాగు యోగ్యమైన భూముల గుర్తింపు ఏ విధంగా జరుగుతుందోనని రైతుల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వ వర్గాల మౌఖిక ఆదేశాలతో వ్యవసాయేతర భూములను గుర్తించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించే



పనిలో యంత్రాంగం నిమగ్నమైన తీరుపై కథనం..

**గుర్తింపునకు సిద్ధం..**

గత ప్రభుత్వం 2023–24 వానాకాలం సీజన్‌లో రైతుబంధు పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 2,99,705 మంది రైతులకు చెందిన 5,22,034 ఎకరాలకు రూ.261.66 కోట్లు, యాసంగి సీజన్‌లో రూ.260.48 కోట్ల పెట్టుబడి సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. ఇందులో వ్యవసాయేతర భూములతోపాటు నివాస స్థలాలకు సైతం రైతుబంధు వర్తింపజేశారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేయాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ఒకటి రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశమున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో సాగేతర భూములు గుర్తించేందుకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

**గ్రామ సభల్లో వివరాలు..**

సంయుక్త కార్యాచరణ అనంతరం గ్రామ సభల్లో రైతుభరోసా లబ్ధిదారులు, సాగు భూముల వివరాలు వెల్లడించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదని జిల్లా వ్యసాయాధికారి తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే పెట్టుబడి సాయం అందుతుందన్నారు.

**సమన్వయంతో ముందుకు..**

వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక, ఆర్‌అండ్‌బీ శాఖల సంయుక్త కార్యాచరణతోనే వ్యవసాయేతర భూములను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని అధికార యంత్రాంగం నిర్ణయానికి వచ్చింది. ఈ శాఖల అధీనంలోని భూములకు సంబంధించిన రికార్డులు, వివరాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే భూ–భారతి (ధరణి) పోర్టల్‌లో సర్వే నంబర్ల ఆధారంగా ఆయా భూముల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేయనున్నారు. వాణిజ్య, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించే భూముల వివరాలను స్వచ్ఛందంగా సమర్పించాలని ప్రభుత్వం కోరింది. దీనికి స్పందించిన వారి భూముల వివరాలను నిర్దేశిత పోర్టల్‌లో తొలగించనున్నారు.

చురకలు



# 5 నెలలైనా అల్పాహారం ఊసేది..?

హైదరాబాద్: రాజధానిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ అల్పాహారం అందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన పథకం నిలిచిపోయింది. ఈ ఏడాది జూన్ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదునెలలు పూర్తైనా ఇప్పటి వరకూ విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించారు. ప్రస్తుతం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 2500పైగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేందుకు డిసెంబరు తొలివారం నుంచి ప్రత్యేక తరగతులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రారంభించారు. వీటికి హాజరయ్యే విద్యార్థులకు గతంలో చిరుతిళ్లు అందజేయగా ప్రస్తుతం ఆ ప్రస్తావనే లేదు. విద్యాశాఖ అధికారులను అడగ్గా.. బడ్జెట్ కేటాయింపులు ఇంకా రాలేదని, వస్తే అమలు చేస్తామంటున్నారు. ఉదయం, సాయంత్రం తరగతులకు హాజరవుతున్న పదోతరగతి విద్యార్థులకు కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు చిరుతిళ్లను పంపిణీ చేస్తున్నారు.



**ఉదయమే ఆకలితో వస్తారు..**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉదయం 9గంటల్లోపే ప్రారంభమవుతున్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఇళ్లనుంచి వచ్చేప్పుడు అల్పాహారం తినకుండా వస్తారని, ఆకలితో పాఠాలు వినలేరన్న భావనతో గతంలో ఇడ్లీ, ఉప్మా, పొంగల్ వంటి వాటితో రోజూ అల్పాహారాన్ని అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని మరింత మెరుగుగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. అమలులో చేతులెత్తేశారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటే అమలు చేస్తామని చెబుతున్నారు.

**రెండు గంటలు.. చిక్కీలు.. బిస్కెట్లు**

పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. దీంతో పదోతరగతి విద్యార్థులు ఉదయం 8 గంటలకు వచ్చి సాయంత్రం 5.30కు ఇళ్లకు వెళ్తున్నారు. మధ్యాహ్న భోజనం మినహా మధ్యలో ఎలాంటి ఆహారం తీసుకోకపోవడంతో విద్యార్థులు ఆకలితో ఉంటారన్న భావనతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చిక్కీలు, బిస్కెట్లు తీసుకొస్తున్నారు. పాతబస్తీలోని కొన్ని పాఠశాలలకు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు చిరుతిళ్లు పంపిణీ చేస్తున్నారు. కొందరు సమోసాలు, మరికొందరు అరటిపళ్లు ఇస్తున్నారు.

# సంతాన భాగ్యం!

హైదరాబాద్: పేట్లబుర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) ప్రక్రియ ప్రారంభం కానుంది. తొలిసారి ఓ మహిళకు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. మరికొన్ని జంటలు కూడా ఐవీఎఫ్ సేవలకు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ అధునాతన లేబరేటరీ, పరికరాలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఇంట్రా యుటెరైన్ ఇన్సెమినేషన్ (ఐయూఐ) ద్వారా సంతానం లేని దాదాపు 20 జంటలకు ఈ విధానంలో చికిత్స అందించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రజినీరెడ్డి చెప్పారు. భర్త నుంచి సేకరించిన వీర్యాన్ని ల్యాబ్‌లో శుద్ధి చేసి దానిని హైలీ కాన్సన్‌ట్రేటెడ్ మొటిలిటీ స్పెర్మ్‌గా మార్చి భార్య అండాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ విధానంతో 80 శాతం ఫలితాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. అప్పటికీ సంతానం



కలగకపోతే ఐవీఎఫ్ చేయనున్నారు. ఈ పద్ధతిలో ల్యాబ్‌లో పిండం ఫలదీకరణ చెందించిన తర్వాత దానిని సంబంధిత మహిళ గర్భాశయంలో ప్రవేశపెడతారు. ఈ సేవలు ఇప్పటికే గాంధీలో ప్రవేశపెట్టారు.

**పిల్లల్లేని దంపతులకు వరం..**

సంతానలేమికి జన్యుపరమైన ఇబ్బందులే కాకుండా వాతావరణ కాలుష్యం, ఉద్యోగ వేటలో పడి ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, లేదంటే హార్మోన్ల అసమతుల్యత తదితర కారణాలుగా చెప్పొచ్చు. దీంతో చాలామంది ఐవీఎఫ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రైవేటు క్లినిక్‌ల్లో ఒక్కసారి ఐవీఎఫ్ చేసుకోవాలంటే రూ.3-4 లక్షల వరకు వెచ్చించాల్సిందే. తొలిసారే విజయవంతం అవుతుందనే గ్యారంటీ కూడా లేదు. రెండోసారి చేయించుకోవాలంటే మరో రూ.3-4 లక్షలు సిద్ధం చేసుకోవాల్సిందే. ఆర్థికంగా వెనుకబడి జంటలు ఈ ఆర్థిక భారం భరించలేక వెనక్కు తగ్గుతున్నారు. కొన్ని జంటలు ఒకటి, రెండుసార్లు ప్రయత్నించి విరమించుకుంటున్నారు.

**ప్రయివేటులో దోపిడీ**

పెళ్లైన ఒకటి రెండేళ్లకే చాలామంది అవగాహన లేక సంతాన సాఫల్య కేంద్రాలను సంప్రదిస్తుంటారు. తొలుత ఇలాంటి జంటలకు సూచనలు, సలహాలు అందించాలి. అనారోగ్య సమస్యలు.. వారు కలిసి ఉండే సమయం.. ఇలా అన్నివిధాలుగా పరిశీలించాలి. ఇద్దరిలో లోపం లేదని తేలితే వారికి ఐవీఎఫ్ అవసరమే ఉండదు. వైద్యుల సూచనలు, సలహాలు తీసుకుంటే సంతాన భాగ్యం దక్కుతుంది. కొన్ని ప్రైవేటు క్లినిక్‌లు మాత్రం పిల్లల్లేని జంటల అవసరాలను ఆసరాగా తీసుకుంటున్నాయి. లేనిపోని భయాలు కల్పించి ఐవీఎఫ్ పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నాయి.

# అవిశ్రాంతత ఎదురు చూపులు



వికారాబాద్ : ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగికి రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందజేస్తారు. ఇదే తరహాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున అందజేస్తామని ప్రకటించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఉద్యోగం నుంచి తొలగించారు. 2024 జులై 1 నుంచి జీతభత్యాలను నిలిపివేశారు. వీరంతా ఇప్పుడు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సంపాదన లేక ఆర్థిక ఇబ్బందులతో కాలం గడుపుతున్నామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

**నెలకు రూ.5 వేలు పింఛన్ చెల్లించాలి**

– భారతి, అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు నెలకు రూ.5 వేలు పింఛన్ చెల్లించాలి. 65 సంవత్సరాల తర్వాత ఎలాంటి పనులు చేయడానికి శక్తి ఉండదు. పింఛన్‌ను ఇస్తే ఆర్థిక సహకారాన్ని అందించినట్లు అవుతుంది.

త్వరలో మంజూరు – కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారిణి, వికారాబాద్

జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన టీచర్లు, ఆయాల జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. జిల్లాల వారిగా నిధులు విడుదల చేస్తున్నారు. త్వరలో మన జిల్లాకు నిధులు మంజూరు చేయవచ్చు.

**త్వరలో మంజూరు:**జిల్లాలో 50 మంది టీచర్లు, 111 మంది ఆయాలు జిల్లాలో 65 ఏళ్లు వయసు నిండిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు 161 మంది వివరాలను అధికారులు నమోదు చేశారు. వీరిలో 50 మంది టీచర్లు, మిగిలిన 111 మంది ఆయాలున్నారు. మరో నాలుగు నెలల్లో ఈ సంఖ్య రెండింతలు కానుంది. గతంలో 70 ఏళ్లు దాటినా విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం ఐసీడీఎస్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయస్సును నిర్ణయించింది. ఆర్థిక సాయాన్ని పెంచినా అమలుకాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆందోళన చేస్తేనే అప్పటి ప్రభుత్వం స్పందించి సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లుగా నిర్ణయించింది. ఉద్యోగ విరమణ సమయంలో టీచర్లకు రూ.లక్ష ఆయాలకు రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

**దుద్యాలలో పోలీస్ స్టేషన్**

దుద్యాల మండలం లగచర్లలో అధికారుల బృందంపై గత నెలలో జరిగిన దాడి నేపథ్యంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్త గత నెల 28నే నోటిఫికేషన్ జారీ చేయగా అధికారికంగా జిల్లా ఎస్పీ ఆఫీస్‌కు ఆదేశాలిచ్చారు.

**ఇప్పటివరకు బొంరాస్‌పేట పరిధి**

ఇప్పటి వరకు బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగే దుద్యాల పరిధిలోని గ్రామాలు నూతనంగా ఏర్పాటయ్యే పోలీస్ స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. నారాయణపేట జిల్లా కోస్గి సర్కిల్ పరిధిలో కొనసాగిన హకీంపేట, పోలేపల్లి, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుదురుమల్ల, కొడంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలేడు, హస్నాబాద్‌లను దుద్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చేర్చారు.

**పతంజలి ఆశ్రమంలో నిర్వహణ యోచన**

పోలీస్‌స్టేషన్ నిర్వహణకు పక్కా భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దుద్యాల గేట్ సమీపంలోని పతంజలి ఆశ్రమంలో కొనసాగించాలని యోచిస్తున్నారు. ఈ ఆశ్రమాన్ని ఇది వరకే జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**2022 అక్టోబర్ 3న నూతన మండలంగా ఏర్పాటు**

దుద్యాల నూతన మండలంగా 2022 అక్టోబర్ 3న ఆవిర్భవించింది. రెండేళ్లు దాటినా ప్రభుత్వ కార్యాలయాలకు నిధులు మంజూరు కాలేదు. ఇటీవలే ప్రభుత్వ సమీకృత కార్యాలయాల సముదాయం (ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్)లో భాగంగా తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, మండల విద్యావనరుల కేంద్రం, వ్యవసాయ శాఖ కార్యాలయం తదితర కార్యాలయాల భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.8.5కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవనాల నిర్మాణానికి రైతువేదిక సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి సర్వే నిర్వహించారు. రెవెన్యూ శాఖ భవన నిర్మాణాలకు భూమిని కేటాయిస్తూ ప్రతిపాదనలు రూపొందించే పనిలో ఉంది. తాజాగా నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి కూడా నిధులు మంజూరు కానుండటంతో పూర్తి స్థాయిలో ప్రభుత్వ శాఖల కార్యాలయాలు దశల వారీగా రానున్నాయి.

# నితం.. విద్యార్థుల లేక సతమతం



హైదరాబాద్: పర్యాటక రంగం అభివృద్ధికి, పర్యాటక ఆతిథ్య రంగానికి అత్యంత నైపుణ్యం కలిగిన ఉన్నతస్థాయి మానవ వనరులను అందించేందుకు ఐఐటీ, ఐఐఎంల స్థాయిలో రెండు దశాబ్దాల క్రితం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నితం (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) విద్యార్థులు లేక వెలవెలబోతోంది. ఇందులో బీబీఏ, ఎంబీఏ, బీఎస్సీలో ఒక్కో కోర్సులో 120 మంది చొప్పున మొత్తం 360 మంది విద్యార్థులు అడ్మిషన్లకు అవకాశం ఉంది. 2025లో 27 మంది మాత్రమే చేరడం గమనార్హం. 120 సీట్లు ఉన్న ఎంబీఏలో కేవలం నలుగురే ప్రవేశం పొందారు. రెండు దశాబ్దాల క్రితం జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక, ఆతిథ్య రంగంలో విద్య, శిక్షణ, పరిశోధనతో కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు నితం ఏర్పాటైంది. మానవ వనరులు, ప్రజా సంబంధాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, బీఎస్సీ హాస్పిటాలటీ, హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులను అందిస్తోంది. సుమారు నాలుగు వేలమంది ఇప్పటిదాకా ఇక్కడ కోర్సులను పూర్తి చేసుకుని ఎయిర్‌లైన్స్, ట్రావెల్ ఏజెన్సీలు, టూర్ ఆపరేటర్లు, ఎయిర్‌పోర్ట్‌లు హోటళ్లు, రిసార్ట్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తోపాటు వివిధ సంస్థల్లో ఉద్యోగాల్లో చేరారు. కొన్నేళ్లుగా ప్రవేశాలు తగ్గుతూ వస్తుండగా ఈ ఏడాది మరింత దారుణంగా మారింది. అత్యాధునిక వసతులు, వరల్డ్‌క్లాస్ కలినరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కలిగి ఉండి లైబ్రరీ, హాస్టల్ వసతితోపాటు హాస్పిటాలటీ లేబొరేటరీలు ఉన్నాయి. కొత్తగా వస్తున్న ఉద్యోగ అవకాశాల్లో నాలుగింటిలో ఒక ఉద్యోగం పర్యాటక, ఆతిథ్య రంగాల్లోనే ఉంటున్నా.. అందుకోలేని పరిస్థితి. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్, ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మరో ముగ్గురు ఫ్యాకల్టీ సభ్యులు ఉన్నారు. సరిపడా బోధనా సిబ్బంది ఇక్కడ లేకపోవడంతో విద్యార్థులు ఇక్కడ చదివేందుకు ఆసక్తి చూపడం లేదు.

**పర్యవేక్షణ నాస్తి...**

యువజన, పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న నితంపై పరిపాలనాపరమైన ఉదాసీనత కొనసాగుతోంది. కొన్నేళ్లుగా బోధన, క్యాంపస్ రిక్రూట్‌మెంట్లను నిర్లక్ష్యం చేశారు. దీంతో సరైన శిక్షణ లేక, ఉపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులు కోర్సులు పూర్తి చేయాల్సి వస్తోంది. ఫలితంగా అడ్మిషన్ల తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

# చుక్కేసి.. చిక్కేస్తే డ్రైవింగ్ లైసెన్సు రద్దు

హైదరాబాద్: డ్రైవింగ్ లైసెన్సుల రద్దు చేసిన వాటిలో మందుబాబులవే అధికంగా ఉంటున్నాయి. మద్యం మత్తులో వాహనం నడిపినా, అధిక వేగం, బరువుతో వాణిజ్య వాహనాలు నడిపినట్లు చోదకుడిపై కేసు నమోదైతే లైసెన్సును రవాణా శాఖ అధికారులు సస్పెండ్ చేస్తారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. అందులో 85 శాతం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో నమోదైన కేసులే కావడం విశేషం. గ్రేటర్ పరిధిలో 2022-23లో 16,649 లైసెన్సులు సస్పెండ్ చేయగా.. 2023-24లో ఆ సంఖ్య 7,565కు తగ్గింది. 2024-25లో ఇప్పటి వరకు సుమారు 10 వేల వరకు లైసెన్సులను రవాణా శాఖ సస్పెండ్ చేసినట్లు సమాచారం. చర్యలు తీసుకోవడంలో రవాణా శాఖ జాప్యం చేస్తోందని పోలీసు శాఖ అసహనం వ్యక్తం చేయడంతో ఇటీవల ఆ ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిసింది. కేసులు ఎక్కడ నమోదైనా లైసెన్సు పొందిన రవాణా శాఖ అధికారులకే సస్పెన్షన్ అధికారం ఉంది. ఈ చిక్కుముడి వీడితేనే సస్పెన్షన్లలో జాప్యం జరుగుతోందని పోలీసు శాఖ అభిప్రాయంగా ఉంది. ఒకే వ్యక్తి మూడుసార్లు మద్యం మత్తులో వాహన నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసు అధికారులు రవాణా శాఖకు సిఫార్సు చేస్తారు. **డేటాబేస్‌తో అనుసంధానం** డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు డేటా బేస్‌ను మరింత ఆధునికీకరించాలని రవాణా శాఖ యోచిస్తోంది. మద్యం మత్తులో, అధిక వేగంతో, ఓవర్ లోడ్‌తో వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తి ఫొటో లేదా ఆధార్ నంబరు డేటాబేస్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఆ వాహన చోదకుడి డ్రైవింగ్ లైసెన్సు నంబరు, ఎక్కడి తీసుకున్నది తక్షణం తనిఖీ అధికారులకు తెలిసేలా ఆధునికీకరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా వివరాలు తనిఖీ అధికారుల నుంచి సంబంధిత రవాణా శాఖ కార్యాలయానికి చేరితే సస్పెన్షన్ ప్రక్రియను వేగంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# భాగ్యనగరం సురక్షితమే

వరంగల్ : భారీస్థాయిలో భూకంపాలు.. రిక్టర్ స్కేల్‌లో ఏడుకు పైన పాయింట్లు నమోదైనా భాగ్యనగరం సురక్షితమేనని ఉత్తరాఖండ్‌లోని భవన నిర్మాణాల కేంద్రీయ పరిశోధన సంస్థ సంచాలకులు ప్రొఫెసర్ ప్రదీప్ కే.రామన్‌చెర్ల అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భూకంపాలు ఏర్పడిన నేపథ్యంలో వాటి తీవ్రతపై ఆయన మాట్లాడారు. భూకంపాలు వచ్చిన ప్రాంతాలన్నీ మూడో జోన్‌లో ఉన్నాయని, రిక్టర్‌స్కేల్‌లో 5.3 పాయింట్లు నమోదైనందున భూ ప్రకంపనలు హైదరాబాద్‌కు సమీపంలో వచ్చుంటాయి తప్ప వాటితో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోవన్నారు. నేషనల్ బిల్డింగ్ కోడ్ 1893ద్వారా భవనాలు నిర్మించుకుంటే ఎలాంటి ముప్పు ఉండదని వివరించారు.

**నాలుగు.. ఐదు జోన్లలోనే తీవ్రత..**

దేశవ్యాప్తంగా భూకంప ప్రభావ పరిస్థితుల ఆధారంగా 2,3,4,5 జోన్లుగా వర్గీకరించారు. 2, 3 జోన్లలోని రాష్ట్రాలు ప్రమాదానికి కాస్త దూరంగా ఉంటాయి. 4, 5జోన్లలో ప్రమాదకర పరిస్థితులు ఉంటాయి. ఈ రెండు జోన్లలోని ఎనిమిది రాష్ట్రాల్లో పర్వతశ్రేణులు, హిమపాతం ఎక్కువగా ఉంటుంది. దేశ జనాభాలో 82శాతం(సుమారు 116కోట్లు) 56శాతం భూ భాగంలో ఉంది. ఈ భూభాగం 3, 4 జోన్లలో విస్తరించి ఉంది. దశాబ్దాలుగా ఆయా ప్రాంతాల్లో భూకంపాలు రాకపోయినా.. పెరుగుతున్న కాలుష్యం, భవన నిర్మాణాల్లో సమపాళ్లలో



సిమెంట్, కాంక్రీట్‌ను వినియోగించకపోవడం, ఎత్తయిన భవనాలు, టవర్ల కారణంగా భూమి అంతరపొరల్లో మార్పులు జరుగుతున్నాయి. గతంలో ఇలా..: మేడ్చల్‌లో 1983లో 4.8 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఇప్పటివరకు ఇదే నగరంలో అత్యధికం. : 2020లో బోరబండ సైట్-3 ప్రాంతంలో రాత్రివేళ కొన్ని సెకన్లు భూమి కంపించడంతో జనం ఇళ్లలోంచి బయటికి పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్‌పై 1.5 తీవ్రతతో అప్పుడు భూ ప్రకంపనలు వచ్చాయి. ఆ ఏడాది అక్టోబరు 2 నుంచి 30వ తేదీ వరకు 59సార్లు కంపనాలు వచ్చాయి.

**హైదరాబాద్, వైజాగ్‌లు రెండోజోన్‌లో..**

తెలుగు రాష్ట్రాల్లో 35శాతం భూభాగం మూడోజోన్ పరిధిలో ఉంది. వరంగల్, కరీంనగర్, ప్రకాశం, గుంటూరు జిల్లాలు మూడోజోన్‌లో ఉన్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్ రెండోజోన్ పరిధిలో ఉండగా.. విశాఖపట్నం కూడా అదే జోన్‌లో ఉంది. హైదరాబాద్‌లో ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారు. 30 నుంచి యాభై అంతస్తుల భవనాలు, టవర్లు నిర్మాణమవుతున్నాయి. వాటిలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి. ఇక విజయవాడ మూడో జోన్ పరిధిలో ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లో ఒక్క ప్రాంతం కూడా నాలుగోజోన్ (ప్రమాదకర పరిస్థితులు)లో లేదు. మెట్రో నగరాల్లో ఢిల్లీ నాలుగోజోన్ పరిధిలో ఉండగా.. ముంబయి, చెన్నైలు మూడోజోన్‌లో ఉన్నాయి.

**హైదరాబాద్, వైజాగ్‌లు రెండోజోన్‌లో..**

తెలుగు రాష్ట్రాల్లో 35శాతం భూభాగం మూడోజోన్ పరిధిలో ఉంది. వరంగల్, కరీంనగర్, ప్రకాశం, గుంటూరు జిల్లాలు మూడోజోన్‌లో ఉన్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్ రెండోజోన్ పరిధిలో ఉండగా.. విశాఖపట్నం కూడా అదే జోన్‌లో ఉంది. హైదరాబాద్‌లో ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారు. 30 నుంచి యాభై అంతస్తుల భవనాలు, టవర్లు నిర్మాణమవుతున్నాయి. వాటిలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలి. ఇక విజయవాడ మూడో జోన్ పరిధిలో ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లో ఒక్క ప్రాంతం కూడా నాలుగోజోన్ (ప్రమాదకర పరిస్థితులు)లో లేదు. మెట్రో నగరాల్లో ఢిల్లీ నాలుగోజోన్ పరిధిలో ఉండగా.. ముంబయి, చెన్నైలు మూడోజోన్‌లో ఉన్నాయి.

**కొత్త ప్రమాణాలు.. భవన నిర్మాణాల్లో సాంకేతిక పరిజ్ఞానం..**

నగరాలు, పట్టణాల్లో భవనాలను కొత్త ప్రమాణాలతో నిర్మించడం, వాటిల్లో అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా భూకంపాల పరిధిలోకి వెళ్లకుండా పర్యవేక్షించే అవకాశాలున్నాయి. ఎత్తయిన టవర్లను నిర్మించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి. అధికార యంత్రాంగం పర్యవేక్షించాలి. భారీ టవర్ల నిర్మాణాలు తగ్గించాలంటే నగరాలకు దూరంగా శాటిలైట్ టౌన్‌షిప్పులు నిర్మించడం శ్రేయస్కరం.

**షాద్‌నగర్‌లో కంపించిన భూమి** షాద్‌నగర్‌లో 12.55 సమయంలో 3సెకన్ల పాటు స్వల్పంగా భూమి కంపించింది. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉండే స్థానికులు తన ఇంట్లోని వస్తువులు కదిలాయని పేర్కొన్నారు. కాలేజీరోడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రకంపనలు గుర్తించినట్లు స్థానికులు వివరించారు.

# కంటోన్మెంట్ పరిధిలో యూజర్ ఛార్జీలు

హైదరాబాద్: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఇకపై ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా నివాసితులు యూజర్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. యూజర్ ఛార్జీలతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ఖరారు చేస్తూ రక్షణ శాఖ గెజిట్ విడుదల చేసింది. కంటోన్మెంట్ బోర్డు సీఈఓ డి.మధుకర్ నాయక్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. నివాసితుల నుంచి ఘన వ్యర్థాలను కంటోన్మెంట్ బోర్డు సేకరించనుంది. గెజిట్ ప్రచురితమైన ఆరు నెలల్లో నివాసితుల డేటా బేస్‌ను రూపొందించుకుని యూజర్ ఛార్జీల వసూలును ప్రారంభించాలని తెలిపారు. ఆరు నెలలకు, ఏడాదికి ముందుగానే యూజర్ ఛార్జీలు చెల్లించే అవకాశం కల్పించడంతో పాటు ఇలా చెల్లించేవారికి రాయితీని ఇవ్వాలని సూచించారు. ఒక వేళ ఏడాది మొత్తానికి యూజర్ ఛార్జీలను ఒకే సారి ముందుగా చెల్లించేవారు 12 నెలలకు కాకుండా 10 నెలలకు అయ్యే మొత్తాన్ని, ఆరునెలలకు చెల్లించేవారు ఐదున్నర నెలల యూజర్ ఛార్జీలను చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. నెలకు యూజర్ ఛార్జీల కనీస మొత్తం రూ.50. గరిష్ఠంగా రూ.5000గా నిర్ణయించారు. 50 చదరపు మీటర్ల ఇంటికి రూ.50, 50 నుంచి 200 చదరపు మీటర్ల ఇంటికి రూ.100, 200 చదరపు మీటర్ల పైన ఉంటే రూ.200 చెల్లించాల్సి ఉంటుందని, వీధి వ్యాపారులు రూ.100 ఇలా వేర్వేరుగా యూజర్ ఛార్జీలు నిర్దేశించారు.

# ఆందోళన 'బాట'



నందికొట్కూరు : జాతీయ రహదారి 340సీ నిర్మాణ పనులు రైతులకు కష్టాల సుడిలో నెట్టేశాయి. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లలేని దుస్థితి దాపురించింది. కర్నూలు నుంచి అమరావతికి వెళ్లే ఈ నాలుగు వరుసల రహదారి కోసం నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలో పలువురు రైతులు భూములు ఇచ్చారు. ఆయా గ్రామాల పరిధిలో రైతులు పొలాలకు వెళ్లేందుకు దారి వదలకుండా పనులు చేస్తున్నారు. దీంతో భూములిచ్చిన వారు మిగిలిన కొంత పొలం సాగు చేసుకోలేకపోతున్నారు. ఆయా గ్రామాల్లోని మిగతా రైతులు కూడా పంటచేలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.

**వేడుకుంటున్నా కనికరించరు**

జాతీయ రహదారి 340సీ పనులు పాణ్యం నియోజకవర్గంలోని నన్నూరు టోల్‌ప్లాజా సమీపం నుంచి నందికొట్కూరు మీదుగా ఆత్మకూరు వరకు 78 కి.మీ మేర చేపట్టారు. ఈ రహదారిని పొలాల కంటే మీటరు ఎత్తులో నిర్మించారు. ఇరువైపులా మొక్కల పెంపకానికి కొంత స్థలం వదిలి కాంక్రీటు దిమ్మెలను ఏర్పాటు చేశారు. దీంతో పొలాలకు వెళ్లే దారులన్నీ మూసుకుపోయాయి. చాలాచోట్ల గ్రామం రహదారికి ఇటువైపు ఉంటే పొలాలు అవతలి వైపు ఉన్నాయి. ఆయా గ్రామాల రైతులు రోడ్డు దాటి అవతలి వైపు వెళ్లాలంటే సమస్యలు ఎదురవుతున్నాయి. పొలాలకు వాహనాలు, యంత్రాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో పంటల సాగుకు, కోతలు, దిగుబడులను ఇళ్లకు తరలించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. నందికొట్కూరు మండలంలో బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల, 10 బొల్లవరం, నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలం మండ్లెమ్, తంగడంచ, జూపాడుబంగ్లా, పాములపాడు మండలం కృష్ణరావుపేట, రుద్రవరం, పాములపాడు గ్రామాల పరిధిలోని వేలాది మంది రైతులు పొలాలకు వెళ్లేందుకు సమస్యలు ఎదుర్కొంటున్నారు. దారి చూపాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తునారు.

**రోడ్డెక్కిన బొల్లవరం రైతులు**

తమ గ్రామ పరిధిలోని 800 ఎకరాల పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలంటూ 10 బొల్లవరం గ్రామ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై ఎడ్లబండ్లు, ద్విచక్రవాహనాలు అడ్డుగా నిలిచి రాస్తారోకో చేపట్టారు. ఈ గ్రామంలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. బోర్ల ఆధారంగా ఏడాదికి మూడుకార్ల పంటలు సాగు చేస్తుంటారు. ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణం చేపట్టిన మొదట్లో పొలాలకు దారి వదలాలని గ్రామ రైతులు ధర్నా చేశారు. దీంతో అప్పట్లో జాతీయ రహదారికి ఇరువైపులా మట్టి రోడ్డు వేసి వదిలేశారు. సోమవారం రోడ్డు దాటకుండా అడ్డుగా రెయిలింగ్ వేసేందుకు ఇనుప దిమ్మెలు నాటారు. ఉదయాన్నే పొలాలకు బయల్దేరిన రైతులు ఇనుప దిమ్మెలను చూసి ఆందోళనకు దిగారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు అడ్డంగా నిలిపి ధర్నా చేపట్టారు. సమాచారం అందుకున్న నందికొట్కూరు తహసీల్దారు శ్రీనివాసులు అక్కడికి చేరుకున్నారు. కంపెనీ ప్రతినిధి వచ్చి పొలాలకు వెళ్లేందుకు అడ్డుగా రెయిలింగ్ ఏర్పాటు చేయమని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు. **ఇబ్బందిలేకుండా చూడాలి: వెంకటేశ్వర్లు, 10 బొల్లవరం**మేము కొత్తగా రోడ్డు అడగడం లేదు. గతంలో మా పొలాలకు వెళ్లేందుకున్న దారిలోనే రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నాం. మొదట సరే అన్నారు. ప్రస్తుతం మా చేతుల్లో లేదని, దిల్లీ స్థాయిలో ఉందంటున్నారు. ఇదే మాట మొదటే చెప్పి ఉంటే జాతీయ రహదారి నిర్మాణం మొదలుకాకుండా అడ్డుకునే వాళ్లం. నిర్మాణం పూర్తయ్యాక చేతులెత్తేస్తే 800 ఎకరాల పొలం ఎలా సాగు చేసుకోవాలి. 5 కి.మీ దూరంలోని నందికొట్కూరు వచ్చి అక్కడి నుంచి మరో 5 కి.మీ ప్రయాణించి పొలానికి చేరుకోవాల్సి వస్తోంది.

## అస్మదీయులకు పంచి.. పేదలను వంచించి

శ్రీకాళహస్తి : అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లంటూ వైకాపా ఊకదంపుడు హామీలు గుప్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి అటుంచితే.. అప్పటి సీఎం జగన్ స్వయంగా ప్రారంభించిన ఊరందూరు జగనన్న లేఅవుట్‌లోనూ ఒక్క లబ్ధిదారునితోనూ గృహ ప్రవేశం చేయించలేకపోయారు. లేఅవుట్‌కు భూముల సేకరణతోపాటు భూములు అస్మదీయులకు పంచేందుకు భారీగా రిజర్వు చేయడం తదితర అంశాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టింది. తాజాగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఈ నెల 9న ఇక్కడ పేదలకు జరిగిన అన్యాయాలపై అధికారులతో కలిసి అర్జీల స్వీకరణకు శ్రీకారం చుట్టడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కాలనీలు కాదు..**

ఊళ్లంటూ ప్రచారం చేసుకుంటూ వచ్చిన వైకాపా ఈ కాలనీల ఏర్పాటుకు భారీగా భూసేకరణ చేపట్టింది. ఊరందూరు సమీపంలో దాదాపు 500 ఎకరాలకు పైగా భూములు సేకరించింది. భూసేకరణ సక్రమంగా జరగలేదంటూ అప్పట్లో తెదేపా నేతలు దుమ్మెత్తిపోశారు.



పరిహారం సక్రమంగా చెల్లించలేదనే విమర్శలూ లేకపోలేదు. ప్రధానంగా ఇళ్ల కేటాయింపులో వైకాపాకు చెందిన అస్మదీయులకు ప్రాధాన్యమివ్వడం, కొత్తగా సిద్ధం చేసిన వాటిల్లోనూ వాళ్లకే ఎక్కువ వచ్చేలా అప్పట్లో నేతలు అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలున్నాయి. వీటన్నింటిపైనా సమగ్రంగా విచారణ చేపట్టడం, జరిగిన అక్రమాలు వెలుగులోకి తీసుకురావడం లక్ష్యంగా సంబంధిత శాఖ ఇప్పటికే కసరత్తు చేపడుతోంది. తాజాగా ఎమ్మెల్యే నిర్వహించనున్న అర్జీల స్వీకరణ సందర్భంగా మరిన్ని అక్రమాలు వెలుగుచూడటంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్న భావనతో ప్రజలు ఆశతో నిరీక్షిస్తున్నారు.

లేఅవుట్: ఊరందూరు
భూసేకరణ : 530 ఎకరాలు
మంజూరైన ఇళ్లు : 6,231
కేటాయించినవి: 4,873
వివిధ దశల్లో ఉన్నవి: 4,111
వివాదంలో: 2,120

## అయిదేళ్లుగా మూలుగుతున్నాయ్!

పార్వతీపురం : గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోట్లు అయిదేళ్లుగా మూలుగుతున్నాయి. 2021–2025 సంవత్సరాలకు సంబంధించి మంజూరైన ఆర్థిక సంఘ నిధులు అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదార్ల అలసత్వంతో ఖర్చు కాలేదు. ఈ మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో సాధ్యం కానట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో గుత్తేదార్లు పనులకు వెనకడుగు వేశారు. దీంతో పనుల్లో పురోగతి లేదు. పాత బిల్లులపై అధికారులకు నివేదిక ఇవ్వగా, కూటమి ప్రభుత్వం ఇప్పుడు నిధులు, పనుల స్థితిగతుల్ని సమీక్షించి చర్యలు చేపడుతోంది.

**రూ.లక్షల్లోనే ఖర్చు..!** పార్వతీపురం పురపాలక సంఘంలో అయిదేళ్లలో రూ.7.25 కోట్లు విడుదలయ్యాయి. వీటితో మొత్తం 55 పనులు ప్రతిపాదించగా 44 టెండర్లు పిలిచారు. రూ.48 లక్షలు విలువైన పనులు మాత్రమే చేశారు. రూ.6.78 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గుత్తేదారులకు రూ.16.41 లక్షలు మాత్రమే చెల్లించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభం కావాల్సి ఉంది. సిమెంటు రోడ్లు, కాలువలకు పెద్దపీట వేశారు. వీటిలో 80 శాతం మార్చి నాటికి పూర్తి చేస్తామని చెబుతున్నారు.



**గుత్తేదారుల వెనకడుగు..**

బొబ్బిలి పురపాలక సంఘంలో 15వ ఆర్థిక సంఘం నిధులు టైడ్, అన్‌టైడ్‌లో రెండు విడతలుగా దాదాపు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. మురికివాడల్లో రోడ్లు, కాలువలు, శ్మశాన వాటికలకు ప్రహరీల నిర్మాణం, తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. ఇందులో తారకరామకాలనీలో తప్ప ఎక్కడా పైపులైన్లు వేయలేదు. ఐదు శ్మశానాలకు ప్రహరీలు నిర్మించలేదు. కేవలం రూ.5 కోట్ల పనులు మాత్రమే చేపట్టారు. గుత్తేదారులకు రూ.2 కోట్లు బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్‌తో కలిపి మొత్తం 50 రకాల పనులకు రూ.3.10 కోట్లతో కౌన్సిల్ పచ్చజెండా ఊపింది. ఈ ఏడాది మార్చి నాటికి రూ.3 కోట్ల పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**ప్రారంభం ఎప్పుడో?**

సాలూరు పురపాలక సంఘంలో రూ.8.98 కోట్ల 15వ ఆర్థిక సంఘ నిధులతో పలు పనులు ప్రతిపాదించారు. ఆ మేరకు జరగడం లేదు. పారిశుద్ధ్యానికి సంబంధించి చెత్తను సేకరించే బేసిన్లు, వాహనాల కొనుగోలుకు ప్రతిపాదించినా కొనలేదు. రోడ్లకు ఇటీవల రూ.63 లక్షలు కేటాయించారు. రూ.25 లక్షలతో బీటీ రహదారి ప్రతిపాదించినా ప్రారంభించలేదు. రూ.24 లక్షలు కాలువలకు కేటాయించినా అడుగులు పడలేదు. గుత్తేదార్లకు ఆదేశాలిచ్చామని అధికారులు చెబుతున్నారు.

**వ్యవధిలోగా పూర్తి చేస్తాం..**

15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు వ్యవధిలోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. మార్చి నాటికి 90 శాతం పూర్తే లక్ష్యం. ఇటీవల గుత్తేదారులతో సమీక్ష నిర్వహించి, పనులు చేయాలని కోరాం. సకాలంలో బిల్లులు చెల్లిస్తామని భరోసా ఇచ్చాం. పాతబిల్లులు అప్‌లోడ్ చేసి, ఉన్నతాధికారులకు నివేదించాం.

ఎల్.రామలక్ష్మి, అప్పలరాజు, చక్కా సత్యనారాయణ, శ్రీనివాసరాజులు, బొబ్బిలి, నెల్లిమర్ల, సాలూరు, పార్వతీపురం కమిషనర్లు

## అడ్డగోలు అనుమతులు.. విచ్చలవిడి తవ్వకాలు

నాయుడుపేట : వైకాపా నాయకులు అడ్డగోలుగా తీసుకున్న అనుమతులతో ప్రకృతి సంపదను విచ్చలవిడిగా కొల్లగొట్టారు. ఓజిలి మండలం ఆర్మేనుపాడు సమీపంలోని కొండగుట్టపై సర్వే నంబరు 65లో 269.72 ఎకరాల మెట్ట భూములు ఉన్నాయి. ఇక్కడ గ్రావెల్, కంకర తవ్వకాలకు అనువుగా ఉంటుంది. అయితే ఈ భూములపై ఓ గుత్తేదారు సంస్థ కన్నుపడింది. 54 ఎకరాల్లో గ్రావెల్, కంకర తవ్వకాల అనుమతులకు 2016లో దరఖాస్తు చేసుకోవడంతో 2020లో అనుమతులు పొందారు. ఈ క్రమంలో ఎన్నికల ముందు తవ్వకాలు చేపట్టగా గ్రామస్థులు వ్యతిరేకించారు. తాజాగా కూటమి ప్రభుత్వంలో కూడా గుత్తేదారు తనకున్న పరపతితో మళ్లీ తవ్వకాలు చేపట్టడంతో స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. ఆర్మేనుపాడు స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో గుత్తేదారు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి మళ్లీ తవ్వకాలకు ప్రయత్నాలు చేశారు. తాజాగా క్వారీ ప్రాంతానికి వెళ్లే రోడ్డును బాగుచేసి యంత్రాలను లీజు భూముల్లో ఉంచారు. గుర్తించిన స్థానికులు సోమవారం కొండ ప్రాంతానికి వెళ్లి పనులు అడ్డగించారు. ఇక్కడ తవ్వకాలు చేపడితే కొండపై కురిసిన వర్షపు నీరు చెరువులకు



చేరదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రెండు వందల ఎకరాలు బీడుగా మారుతుందని వాపోయారు.

**ఫోర్జరీ సంతకాలతో అనుమతులు**

ఫోర్జరీ సంతకాలతో అనుమతులు పొంది తవ్వకాలకు యత్నిస్తున్నారు. కొన్నేళ్లుగా గ్రామ పరిధిలో తవ్వకాలు లేకుండా ప్రకృతిని కాపాడుతున్నాం. మళ్లీ తవ్వకాలు జరుపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ముప్పాళ్ల నరేష్, మల్లికార్జునరాజు, ఆర్మేనుపాడు

**రెవెన్యూ సిఫార్సుతోనే భూములు లీజుకు**

రెవెన్యూ సిఫార్సు మేరకు ఆర్మేనుపాడు వద్ద ప్రభుత్వ భూములను గ్రావెల్, కంకర తవ్వకాలకు గనుల శాఖ లీజుకు కేటాయించింది. దీనిపై స్థానికులు ప్రస్తుతం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీనిపై మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తాం. శ్రీనివాసరావు, ఏడీ, గనులశాఖ గూడూరు

## ఇనామ్ 'పట్టా'లకు.. అక్రమ పూటలు



నంద్యాల : మహానంది దేవస్థానం భూములు కర్పూరంలా కరిగిపోతున్నాయి.. ఏళ్ల నుంచి పర్యవేక్షణ లేకపోవడంతో కబ్జాల పర్వం కొనసాగింది.. కౌలు పేరుతో కొందరు.. ఇనామ్ పేరుతో మరికొందరు.. రాజకీయ పెత్తనంతో ఇంకొందరు సొంతం చేసుకొన్నారు.. ఆయా భూములు కాపాడుకోవడానికి ఆలయ అధికారులు న్యాయస్థానం, ఉన్నతాధికారులు గడపలు తొక్కాల్సి వస్తోంది. తమడపల్లెలో సర్వే నంబరు–303, 314లలో ఇనామ్‌గా ఉన్న 9.47 ఎకరాల భూమి పట్టాగా మార్చుకొన్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.

**వంద ఎకరాల వరకు ఆక్రమణ**

దేవస్థానం స్వామిఅమ్మవార్లకు సేవలు అందించడానికి మీరాసిదారులు ఉండేవారు.. వారు దేవుడి సేవలు ఉండటంతో భూములు ఇనామ్‌గా ఇచ్చారు. వారిలో చాలా మంది దేవుడి సేవ మానేశారు.. సాగు చేసుకొంటున్న భూములకు అమ్మేసుకొంటున్నారు. దేవస్థానానికి సంబంధించి 228.76 ఎకరాల పొలం ఉండేది.. ఇందులో 109.59 ఎకరాల వరకు అన్యాక్రాంతమైంది. ఒకరి నుంచి మరొకరికి మారిపోయాయి. ఆ భూముల విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.300 కోట్ల వరకు ఉంది.. మిగిలిన 109.50 ఎకరాలు కౌలుకు ఇచ్చారు.. ఏళ్లుగా కొందరే సాగు చేసుకొంటున్నారు.

**కౌలు ముసుగులో దందా**

తమడపల్లె, బుక్కాపురం, తిమ్మాపురం, శ్రీనగరం, అల్లినగరం, మహానంది, గోపవరం, నందిపల్లె, గాజులపల్లె, తిమ్మాపురానికి చెందిన కొందరు ఏళ్లుగా కౌలుకు తీసుకున్నారు. వేలం నిర్వహించిన ప్రతిసారి ఇతర ప్రాంతాల రైతులు పోటీకి రాకుండా అడ్డుకుంటున్నారు. ఆలయ భూముల్లో ప్రస్తుతం రెండు కార్ల పంటలు సాగవుతున్నాయి. ఎక్కువ విస్తీర్ణంలో అరటి తోటలు ఉన్నాయి. వరి, పసుపు, పూల తోటలూ సాగు చేస్తున్నారు. దేవస్థానం నుంచి భూములు కౌలుకు తీసుకున్న వారు అరటి వ్యాపారులు, ఇతర రైతులకు లీజుకు ఇస్తున్నారు. వీరు ఎకరం రూ.40 వేల కౌలుకు తీసుకుని రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ఆలయ భూములతో వ్యాపారం చేస్తున్నారు.

**ఎక్కడ ఎంత భూమి**

మహానంది ఆలయానికి సంబంధించి నంద్యాల పట్టణంలో 19.36 ఎకరాలు, మూలసాగరంలో 22.33 ఎకరాలు, నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామపంచాయతీ పరిధిలో (మూలమఠం పరిసరాల్లో) 37.44 ఎకరాలు, మహానంది మండలం తమడపల్లె గ్రామపంచాయతీ పరిధిలో 30.46 ఎకరాలు ఉంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఏళ్లుగా అన్యాక్రాంతం అవుతు వస్తోంది. 2022లో అప్పటి పాలకమండలి సభ్యుల్లో ఒకరు.. తమ బంధువుకు కొంత భూమి పట్టా చేయించారు. నంద్యాల పట్టణంలో సెంటు స్థలం రూ.20– రూ.40 లక్షలు పలుకుంది. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ, బాలాజీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో 19.36 ఎకరాలు, మూలసాగరంలో 22.33 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైంది.

**పట్టించుకోని పాలక మండలి**

సర్వే చేసి 109.59 ఎకరాలు ఆక్రమణదారు చెరలో ఉన్నట్లు నిర్ధారించారు... అటు పాలకమండలి.. ఇటు ఉన్నతాధికారులు పట్టించుకోలేదు.. కొత్తపల్లె గ్రామానికి సంబంధించి భూమిలో 25 శాతం ఆలయ ఇనామ్ కింద ఉన్నవే.. చాలా వరకు ఆక్రమణకు గురై ఇళ్లు వెలిశాయి. ఆలస్యంగా గుర్తించిన అధికారులు విచారణ చేసి గ్రామస్థులతో సమావేశమయ్యారు. ధర నిర్ణయిస్తే చెల్లిస్తామని గ్రామస్థులు చెప్పినా పట్టించుకోలేదు.

## మామిడి రైతుకు తెగుళ్ల దెబ్బ

విజయనగరం : జిల్లాలోని రైతులు ఖరీఫ్ వరి పంట తర్వాత ప్రధానంగా మామిడిపైనే ఆధారపడతారు. కొన్నాళ్లుగా మామిడి దిగుబడులు దిగజారుతున్నా.. ఈ ఏడాదైనా ఆశాజనకంగా ఉంటాయనుకున్నారు. ఈ తరుణంలో ఇటీవల వరుసగా కురిసిన అధిక వర్షాలతో భూమిలో తేమ శాతం పెరగడం, రాత్రి ఉష్ణోగ్రతల్లో సమతుల్యత లేకపోవడం, విపరీతంగా మంచు కురుస్తుండడంతో మామిడికి ప్రతికూల పరిస్థితులు దాపురిరాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఏడేళ్లుగా తగ్గుముఖం...**

జిల్లాలో దాదాపు 80 శాతం పండ్లు కలకత్తా, ముంబయి, దిల్లీ, ఒడిశా, బ్రహ్మపుర, భువనేశ్వర్, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. రకాలను బట్టి టన్ను రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతోంది. ఏడేళ్ల నుంచి దిగుబడులు తగ్గుతున్నాయి. హెక్టారుకు పది టన్నుల వరకు రావాల్సిఉండగా 6 టన్నులే వస్తున్నాయి. దిగుబడులు తగ్గడానికి రైతులు అవసరానికి మించి కల్తార్ మందును వాడడమే ప్రధాన కారణమని ఉద్యాన శాస్త్రవేత్తలు



చెబుతున్నారు.

**పూత దశలోనే నష్టం..**

జిల్లాలో 30,834 హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇందులో 28,500 హెక్టార్లు ఫలసాయం అందిస్తున్నాయి. సాధారణంగా నవంబరు చివరి వారం నుంచి జనవరి వరకు మామిడి తోటల్లో పూత వస్తుంది. ప్రస్తుతం రసాలు, పనుకులు, సువర్ణరేఖ రకాల చెట్లు పూత పట్టాయి. మరికొన్ని రకాలు పూత వచ్చే దశలో ఉన్నాయి. వర్షాల కారణంగా పూత రాలిపోతోంది. అవి రాని చెట్లకు మరింత ఆలస్యమయ్యే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తేనె మంచు పురుగుతో పాటు ఆంత్రాక్నోజ్ (మచ్చతెగులు) వ్యాపిస్తుండడంతో దిగబడులు ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**తేనె మంచు పురుగును నివారించుకోవాలి..**

తేనె మంచు పురుగు ప్రభావం కనిపిస్తోంది. తోటల్లో కలుపు ఎక్కువగా ఉన్నా, వాతావరణం మబ్బుగా ఉన్నా, గాలిలో తేమశాతం ఎక్కువగా, ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు పురుగు ఉద్ధృతి అధికంగా ఉంటుంది. దీని నివారణకు మోనోక్రొటోఫాస్ 1.5 మి.లీ, డైమిథోయేట్ 2 మి.లీ, క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ వీటిలో ఏదో ఒక మందును లీటరు నీటిలో కలిపి పూత మొదలయ్యే, పిందెలు తయారయ్యే సమయాల్లో పూత, ఆకులపై కాకుండా మొదళ్లు, కొమ్మలపై పిచికారీ చేయాలి. మొగ్గ దశలో కనిపిస్తే బ్యూప్రోఫెజిన్ 25 ఎస్.సి 1.2 మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.3 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి వేయాలి. కెల్ల లక్ష్మణ్, విజయనగరం ఏరువాక కేంద్రం సమన్వయకర్త

## నిర్వహణకు జల నిధి

నంద్యాల: ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలాశయాల నిర్వహణను 'నీరు'గార్చింది. మరమ్మతులు లేక కాల్వలకు గండ్లు పడ్డాయి.. దట్టంగా ముళ్లపొదలు పెరిగాయి.. నీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.. ఈ నేపథ్యంలో జల వనరులను బాగు చేయాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రాజెక్టుల వారీగా ప్రతిపాదించాలని జల వనరుల శాఖ అధికారులను ఆదేశించింది. ఆయా ప్రాజెక్టుల పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల వివరాలను నివేదించాలని సూచించింది. లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన తెలుగుగంగ, ఎస్సార్బీసీ, కేసీ కాల్వ, గాజులదిన్నె వంటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**ఇప్పటికే కొన్ని చేపడుతున్నారు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నెలల కిందట కొన్ని పనులకు ప్రతిపాదనలు కోరారు. సాగునీటి ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి గత నెలలో టెండర్లు పిలిచారు. గత నెలలో మంజూరు చేసిన నిధుల్లో ఓఅండ్‌ఎం పనులకు కేటాయింపులు చేయలేదు. దీంతో ఆయా పనులకు ప్రస్తుతం ప్రతిపాదనలు కోరారు. ఖరీఫ్ సీజను ప్రారంభంలోగా పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**చేపట్టనున్న పనులు** ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో వచ్చే ఖరీఫ్ సీజనులో సాగునీరు విడుదల చేసేలోపు అత్యవసరంగా చేపట్టాల్సిన ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికీ జిల్లాలోని 60 శాతం ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు తయారీ దశలోనే ఉన్నాయి. గత ఐదేళ్లలో ఓఅండ్‌ఎం పనులకు పైసా నిధులు ఇవ్వలేదు. ప్రస్తుతం నిధులు విడుదలైతే ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్సు, పూడిక తీయడం, కల్వర్టుల మరమ్మతులు, తనిఖీ మార్గాల పనులు చేయనున్నారు.

## హిందీ పండిట్ శిక్షణ కళాశాలలకు మహర్దశ పట్టేనా?

గుంతకల్లు : గత వైకాపా ప్రభుత్వం హిందీ పండితుల శిక్షణ కళాశాలను సమర్థవంతంగా నిర్వహించలేక మూసేసింది. ఫలితంగా పాఠశాలల్లో హిందీ పండితులుగా పని చేయాలని ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు నిరాశకు గురయ్యారు. రాయలసీమలో ప్రభుత్వం ఆధ్వర్యంలో దక్షిణ భారత హిందీ సభ కింద ఒక్క గుంతకల్లులోనే మాత్రమే హిందీ పండితుల శిక్షణ కళాశాల ఉంది. ప్రైవేట్ కళాశాలలు అనతపురంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 10 వరకు ఉన్నాయి. ప్రస్తుతం అన్నీ మూతపడ్డాయి. ప్రతి కళాశాలలో ఏటా 60 మంది విద్యార్థులు చేరి హిందీపండిట్ శిక్షణ పూర్తి చేసేవారు. కొన్ని ప్రైవేట్ కళాశాల్లో పరీక్షల నిర్వహణ సక్రమంగా లేదని ప్రభుత్వం భావించింది. సక్రమంగా లేని కళాశాలలో ఏవో ప్రభుత్వం గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి అన్నింటిని మూసివేయడం



ఎంతవరకు న్యాయమని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.


**అర్హులకు తీరని అన్యాయం**

హిందీ పండిట్ శిక్షణ కళాశాలలో చేరడానికి అర్హులున్న నిరుద్యోగులు ప్రభుత్వం కళాశాలను మూసివేయడంతో నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకం కోసం త్వరలో డీఎస్సీ నిర్వహించనుండటంతో అందరూ ఆందోళనకు గురవుతున్నారు. కళాశాల కొనసాగి ఉంటే అందరం డీఎస్సీ రాసేవారమని నిరుద్యోగులు అంటున్నారు. వైకాపా ప్రభుత్వం చేసిన పనికి ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నామని వాపోతున్నారు. గడచిన ఐదేళ్లలో 3 వేల మంది నిరుద్యోగులు శిక్షణ కోల్పోయారు.

**కూటమి ప్రభుత్వంపైనే..** ప్రస్తుత ప్రభుత్వం రాకతో హిందీ పండిట్ శిక్షణకు హాజరవ్వాలనుకునే వారిలో ఆశలు చిగురించాయి. కళాశాలలను తిరిగి ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

## పారిశ్రామిక 'పాలసముద్రం'

గోరంట్ల : శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలో పాలసముద్రం 500 కుటుంబాలున్న ఓ గ్రామం. ఇక్కడ ఎలాంటి పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, జలవనరులు లేవు. ప్రజలు కేవలం వర్షాధారంతో వ్యవసాయమే జీవనాధారంగా నెట్టుకొచ్చారు. ఇది ఒకప్పటి మాట. నేడు గ్రామానికి ఎటుచూసినా పెద్దపెద్ద పరిశ్రమలు. గ్రామం నుంచి ఎటువైపు ప్రయాణించాలన్నా నాలుగు వరుసల రహదారులు. గ్రామం వరకు ప్రత్యేక రైల్వేలైన్. విల్లాలు, విలాసవంతమైన జీవితాలు. కొండ గుట్టలన్నీ భవంతులుగా మారిపోయాయి. ప్రజల జీవనశైలి పట్టణాలు, నగరాలను తలపిస్తోంది. రాత్రివేళ పరిశ్రమల విద్యుత్తు వెలుగులతో జిగేల్మంటోంది. అంతర్జాతీయ చిత్రపటంలో ప్రత్యేక స్థానం. పాలసముద్రం ప్రత్యేకతపై ప్రత్యేక కథనం. నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్టు ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్) శిక్షణ కేంద్రం: ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్)కు ఎంపికైనవారికి అత్యున్నత స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ ఇచ్చే కేంద్రం. గతేడాది ఫిబ్రవరిలో దేశప్రధాని నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. ఈ కేంద్రం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం 500 ఎకరాలు సేకరించింది.



**బెల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్):** ఈ సంస్థ నిర్మాణం కోసం 913 ఎకరాలు సేకరించారు. ప్రస్తుతానికి ప్రహరీ, అంతర్గత సిమెంటు రహదారులు, సౌర విద్యుదుత్పత్తి యూనిట్ ఏర్పాటు చేశారు. ఇటీవల కేంద్రీయ విద్యాలయం, ఈఎస్ఐ ఆసుపత్రి, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, రెడ్‌క్రాస్ సొసైటీ ఆసుపత్రి, జిల్లాస్థాయి బెవరేజెస్ గోదాము తదితర నిర్మాణాలకు 20 ఎకరాలకు పైగా స్థలాలు కేటాయించారు. పెనుకొండ సమీపంలో వెలసిన అంతర్జాతీయ కియా కార్ల పరిశ్రమకు అనుబంధంగా 12 పరిశ్రమలు పాలసముద్రం చుట్టూ ఏర్పాటు కావడం విశేషం.


**ప్రత్యేక రైల్వేలైన్**

రైల్వేలైన్ ఏర్పాటు కోసం చర్యలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే భూసేకరణ పూర్తయింది. పనులు చేపట్టాల్సి ఉంది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలో అత్యంత పొడవైన 44వ జాతీయ రహదారి పాలసముద్రం మీదుగానే వెళుతోంది. తాజాగా కడప జిల్లా ముద్దనూరు నుంచి హిందూపురం వరకు నూతనంగా నిర్మిస్తున్న 716జీ జాతీయ రహదారి కూడా ఈ గ్రామం మీదుగా వెళుతుంది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

## ముంచుకొస్తుందా.. మందగిస్తుందా..!

తిరుపతి : దేశంలో హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసుల నమోదుతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. చైనాలో వైరస్ తీవ్రత అధికంగా ఉండటం.. బెంగళూరు, గుజరాత్‌లో కేసులు బయటపడిన నేపథ్యంలో తరుణోపాయంపై చర్చ నడుస్తోంది. దేశవిదేశాల నుంచి పుణ్యక్షేత్రం తిరుమలకు వచ్చే భక్తులతో వైరస్ త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు పరీక్షలు, పడకలు సిద్ధం చేసుకునే దిశగా ప్రభుత్వం, వైద్యఆరోగ్య శాఖ చర్యలు చేపట్టాల్సి ఉంది. కొవిడ్ తరహాలో హెచ్ఎంటీ వ్యాప్తిచెందే అవకాశం ఉన్నట్లు సంకేతాలున్నాయి. దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలు, ఒళ్లు నొప్పులు, జ్వరాలు, అలసట వైరస్ లక్షణాలుగా చెబుతున్నారు. దాదాపు కొవిడ్ లక్షణాలే ఇందులో ఉన్నాయి. వైరస్ కొత్త వేరియంట్గా మారితే ప్రమాదం తప్పకపోవచ్చనే భయం వైద్యుల్లోనూ ఉంది. **జాగ్రత్తలు తప్పనిసరి:** తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం.. నోరు, కళ్లను తాకకపోవడం, మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం వంటి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని వైద్యులు చెబుతున్నారు. స్విమ్స్, రుయాలో అప్రమత్తం: వైరస్ విజృంభిస్తే ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలనే విషయమై వైద్యరంగం అప్రమత్తమైంది. స్విమ్స్‌లో మంగళవారం సమావేశం నిర్వహించి ప్రొటోకాల్ మార్గదర్శకాలపై చర్చించనున్నారు. వైరల్ ల్యాబ్‌లో పరీక్షలు, అనుమానితులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడాన్ని పరిశీలించనున్నారు. రుయాలో ఇప్పటికే ఉన్న టీబీ వార్డు వద్ద ప్రత్యేక గదుల్లో చికిత్స అందించేందుకు సన్నద్ధం అవుతున్నట్లు ఎంఎస్ డా.రవిప్రభు తెలిపారు.

# మహిళలదే హవా



గుత్తి : ఏటా మాదిరే ఈదఫా కూడా ఓటరు జాబితాలో మహిళల హవా కొనసాగుతోంది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వారిదే పైచేయిగా నిలవడం విశేషం. జిల్లాస్థాయిలో పురుష ఓటర్ల కంటే.. మహిళా ఓటర్లే 23,268 మంది ఎక్కువగా ఉండటం ప్రస్తావనార్హం. ఓటరు తుది జాబితాను కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారికంగా విడుదల చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 20,22,229 మంది ఉన్నట్లు తేల్చారు. ఇందులో పురుషులు 9,99,357, మహిళలు 10,22,625, థర్డ్ జెండర్ 247 మంది చొప్పున ఉన్నారు. ఇక సర్వీసు ఓటర్ల విషయానికి వస్తే.. మొత్తం 2,056 మంది ఉండగా.. వీరిలో పురుషులు 2021, స్త్రీలు 35 మంది ఉన్నారు. గత అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 20,20,441 మంది ఉండగా.. గడిచిన రెండు మాసాల్లో 1,788 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో పురుషులు 573, మహిళలు 1213, థర్డ్ జెండర్ ఇద్దరు ప్రకారం పెరిగిన వారిలో ఉన్నారు.

**అనంతలో ఎక్కువ.. ఉరవకొండలో తక్కువ**

జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పురుషుల కంటే స్త్రీ ఓటర్లే ఎక్కువ ఉన్నారు. గతంలో రాప్తాడు, గుంతకల్లు, శింగనమల వంటి ప్రాంతాల్లో పురుష ఓటర్లే ఎక్కువ ఉండేవారు. తాజా తుది జాబితా ప్రకారం అన్ని ప్రాంతాల్లోనూ మహిళల ఆధిక్యం కొనసాగుతోంది. అనంత అర్బన్‌లోనే మహిళలు 5,917 మంది అధికంగా ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో గుంతకల్లులో 4,928, ఉరవకొండలో 3,243, రాయదుర్గంలో 2,979, కళ్యాణదుర్గంలో 2,142, తాడిపత్రిలో 2,092, శింగనమలలో 1,458, రాప్తాడులో 509 మంది చొప్పున మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఇక జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో అనంత అర్బన్‌లోనే ఎక్కువ మంది ఓటర్లు ఉండగా.. ఉరవకొండలో అతి తక్కువగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం రెండు లక్షల మంది ఓటర్లకుపైగా ఉండటం విశేషం.

**కొత్త ఓటర్లు.. తొలగింపు వివరాలేవీ?**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్-25) కార్యక్రమం జరిగినా సమగ్ర ఓటర్ల వివరాలను వెల్లడించడంలో జిల్లా అధికార యంత్రాంగం వైఫల్యం చెందినట్లు కనిపిస్తోంది. ఫారం-6, 7, 8 ప్రకారం తగిన సమాచారాన్ని ప్రకటించకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో తొలగించిన ఓటర్లు ఎంత మంది, కొత్తగా నమోదైన వారు ఎందరు, చేర్పులు మార్పుల వివరాలేవీ వెల్లడించలేదు. అంతేకాదు. 18, 19 సంవత్సరాల ఓటర్ల వివరాలు సైతం కానరాలేదు. ఏటా వయసుల వారీగా ఓటరు జాబితాను విడుదల చేసేవారు. ఈసారి ఆ వివరాలేవీ పేర్కొనకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి. తూతూమంత్రంగా తుది ఓటరు జాబితాను వెల్లడించినట్లు స్పష్టమవుతోంది.

## పంటలకు కాదు.. నియంత్రికలకు జాగరణ



కళ్యాణదుర్గం: లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసుకొన్న రైతులు నేడు విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం కాకుండా వ్యవసాయ తోటల వద్ద జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో కొందరు విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేస్తుండటంతో రైతన్నలు సాగు చేసిన పంటలకు నీరందించక లేకపోతున్నామని వాపోతున్నారు. వరుసగా ఇలాంటి సంఘటనలు జరుగుతుండటంతో ఒక పక్క పోలీసులకు, మరో పక్క విద్యుత్తుశాఖకు సవాలుగా మారుతోంది. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారుగా 80 వరకు విద్యుత్తు నియంత్రికలు ధ్వంసమయ్యాయి. ఇందులో కొన్నిటికే ఫిర్యాదులు అందాయి. నియంత్రికల కోసం రైతులు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో విద్యుత్తుశాఖలో గతంలో పనిచేసినవారు, ప్రస్తుతం ప్రైవేట్గా పనులు చేస్తున్నవారి ప్రోద్బలంతో ఇటీవల కూలీలుగా పనిచేసినవారిదే చోరీల్లో ప్రధాన పాత్ర అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియంత్రికను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైరును ఎత్తుకెళ్తున్నారు. వీటిని విక్రయిస్తే కేవలం రూ.10 వేలు మాత్రమే వస్తుంది.

నియంత్రికల సామర్థ్యం బట్టి ధరలు ఉంటాయి. 25 కేవీ సామర్థ్యం రూ.1.80 లక్షలు, 15 కేవీ సామర్థ్యం రూ.1.10 లక్షలు, 10 కేవీ సామర్థ్యం రూ.80 వేలు వంతున ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అది కూడా సంవత్సరాల పాటు నియంత్రికల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఎన్నో ఇబ్బందులతో నియంత్రికలు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసుకొంటారు. చోరులు మాత్రం వీటినే లక్ష్యంగా చేసుకొంటున్నారు.

వారం, పదిరోజుల్లో అందజేస్తున్నాం- శేషాద్రిశేఖర్, డీఈ, కళ్యాణదుర్గం సబ్‌డివిజన్

విద్యుత్తు డివిజన్ వ్యాప్తంగా త్రిపేస్ 25 కేవీ సామర్థ్యం 38, సింగిల్ పేస్ 15 (25, 15 సామర్థ్యం) నియంత్రికలు చోరీ అయ్యాయి. పోలీసులకు ఫిర్యాదులు వచ్చిన వాటికి సంబంధించి రైతుల అవసరాలకు అనుగుణంగా నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నాం. వారం, పదిరోజుల్లో నియంత్రికలను అందజేస్తున్నాం. దొంగలపై ఇప్పటికే విజిలెన్స్ వింగ్, విద్యుత్తు సిబ్బంది రాత్రివేళల్లో నిఘా ఉంచారు.

## పండగ వేళ.. కొందరికే కందిపప్పు..!



పుట్టపర్తి : సంక్రాంతి పండగకూ పేదల ఇళ్లలో కందిపప్పు ఉడికే పరిస్థితి కనిపించడంలేదు. ప్రతి నెలా కార్డుదారులకు ఇచ్చే సరఫరాలో కోత విధిస్తున్నారు. డిసెంబర్ నెలలో అరకొరగా పంపిణీ చేయగా, జనవరిలోనైనా అందరికీ ఇస్తారని ఎదురుచూసినా పూర్తి నిల్వలు రాలేదు. జిల్లాలో 5,57,982 బియ్యం కార్డులున్నాయి. కార్డుదారులకు ప్రతినెలా బియ్యంతో పాటు అరకిలో పంచదార, కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. పంపిణీకి 576 టన్నుల కందిపప్పు అవసరం కాగా, జనవరిలో 228 టన్నులు మాత్రమే చౌకదుకాణాలకు సరఫరా చేశారు. ఇక రానట్లేనని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో 32 మండలాలున్నాయి. 11 మండలాలకు పూర్తిగా సరఫరా నిలినివేసి, 21 మండలాలకు మాత్రమే సర్దుబాటు చేశారు. అందులోనూ 50 నుంచి 60 శాతం మందికి మాత్రమే కంది పప్పు అందిస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నాణ్యతను బట్టి కందిపప్పు రూ.170 వరకు పలుకుతోంది. రేషన్ దుకాణాలు ద్వారా రాయితీపోనూ రూ.67కే వస్తుండటంతో పేదలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి అల్లాడుతున్న తరుణంలో కందిపప్పు ఇవ్వకపోతే ఎలా పేదలు ప్రశ్నిస్తున్నారు.

**చౌక దుకాణాదారుల చేతివాటం**

చౌక దుకాణాల నిర్వాహకులు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు ఇవ్వాల్సి ఉండగా, చాల చోట్ల బియ్యం, చెక్కర మాత్రమే కార్డుదారులకు అందిస్తున్నారు. కొంత మందికి మాత్రమే కందిపప్పు అందించి, అయిపోయిందని చేతులెత్తేస్తున్నారు. దుకాణదారులు బ్లాక్ మార్కెట్‌కు కందిపప్పు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఈ నెల కోటా జిల్లాలోని 21 మండలాలకు 50 నుంచి 60 శాతం అరకొరగా కందిపప్పు సరఫరా కాగా, ఇదే అదునుగా భావించి, కొందరు డీలర్లు కార్డుదారులకు అందించకుండా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

**21 మండలాలకు సరఫరా చేశాం**

- వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా 21 మండలాలకు కందిపప్పు 50 నుంచి 60 శాతం సరఫరా చేసి కార్డుదారులకు అందిస్తున్నాం. 576 టన్నులు సరఫరా కావాల్సి ఉండగా, 228 టన్నులు మాత్రమే వచ్చింది. కొన్ని చోట్ల కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాం, తనిఖీలు చేస్తున్నాం.

## కన్నేశారు.. భూములు కాజేశారు

ధర్మవరం : ధర్మవరం మండలం గరుడంపల్లి వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న విలువైన భూములు గత వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు తొలగించారు. తమ పేర్లు తిరిగి చేర్చాలని కోరుతూ బాధితులు రోజులతరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. 20 ఏళ్ల కిందట ధర్మవరం చెందిన పలువురు చేనేత వర్గం వారికి ఈ ప్రాంతంలో పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి వారి అనుభవంలోనే భూములు ఉన్నాయి. భూముల ధరలు విపరీతంగా పెరగడంతో వాటిపై వైకాపా వర్గీయుల కన్నపడింది.

గత ప్రభుత్వ హయాంలో అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో చేనేత వర్గీయుల పేర్లు ఆన్‌లైన్‌లో తొలగింపజేసిన వైకాపా వర్గీయులు కొత్తగా తమ వారి పేర్లు నమోదు చేయించుకున్నారు. దీనిపై బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు చెందిన భూములను ఆన్‌లైన్‌లో తిరిగి నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను విన్నవించారు. అయినా స్పందనలేకపోవడంతో వారు పడరానిపాట్లు పడుతున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ తహసీల్దారు సురేష్ దృష్టికి తీసుకెళ్లగా బాధిత రైతులు కార్యాలయానికి వచ్చి వివరాలు అందజేస్తే.. విచారణ చేసి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

## కేంద్ర బృందంపైనే అన్నదాతల ఆశలు

ధర్మవరం : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందేలోపు తీవ్ర వర్షాభావంతో ఎండిపోయాయి. వాతావరణ మార్పులతోనే పంటలు దిగుబడిలేక తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లాలో పది మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించింది. ఈ నెల 8వ తేదీన కేంద్ర బృందం కరవు ప్రాంతాల్లో పర్యటించనుంది. పంట నష్టం జరిగిన రైతులతో ముఖాముఖి మాట్లాడనుంది. పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలించి ఎంత నష్టం జరిగిందనే అంచనా వేయనుంది. ఆ వివరాలు కేంద్రానికి నివేదించనుంది. నష్టాల్లో కూరుకుపోయిన అన్నదాతలు పంట నష్టపరిహారంపైనే ఆశలు పెట్టుకున్నారు.

**14 రకాల పంటలు.. 45 హెక్టార్లలో నష్టం**

శ్రీ సత్యసాయి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన 60 శాతం పంటలు చినుకు జాడలేక చేతికందేలోపు చాలా వరకు ఎండిపోయాయి. దీంతో తీవ్ర కరవు మండలాలుగా తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపులు, మధ్యంతర కరవు ప్రాంతాలుగా కనగానపల్లి, ధర్మవరం, ఎన్పీకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాలను



ప్రకటించారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వేరుసెనగ, వరి, కంది పంటలు సాగుచేయగా, ఆముదం, పెసర, ఉలవ, అలసంద, జొన్న, సజ్జ, పప్పుసెనగ ఇలా మొత్తం 14 రకాల పంటలు సాగుచేశారు. కరవు ప్రాంతాల్లో రైతన్నలకు అపార నష్టం జరగడంతో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. సుమారు 45,848 హెక్టార్లలో వివిధ రకాల పంటలు నష్టం జరిగిందని, రైతులకు రూ.62.46 కోట్ల పరిహారం అందించాలని అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

**పెట్టుబడీ దక్కలేదు- బ్రహ్మానందరెడ్డి, జొన్నలకొత్తపల్లి**

ఆరు ఎకరాల్లో రూ.40 వేలు పెట్టుబడి పెట్టి కంది పంట సాగుచేశాను. సాగు చేసినప్పట్నుంచి వర్షం జాడలేక, వాతావరణ మార్పులతో పంట దిగుబడి ఏమాత్రం రాలేదు. కనీసం పెట్టుబడి కూడా దక్కలేదు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

**పంట నష్టాన్ని నివేదిస్తారు- సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి**

కేంద్ర బృందం అధికారులు కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడతారు. జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి రాష్ట్రానికి నివేదిస్తారు. త్వరలోనే పరిహారంపై ప్రకటన వెలువడనుంది.

## 'భూ'చోళ్ల నయావతారం

కర్నూలు : జిల్లాలో 'భూ'చోళ్లు నయావతారం ఎత్తారు.. నకిలీ పత్రాలు సృష్టించి ఇతరుల ఆస్తులు విక్రయిస్తున్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాల్సిన సబ్ రిజిస్ట్రార్లు కాసుల కక్కుర్తితో అక్రమరిజిస్ట్రేషన్లు చేస్తూ వివాదాలకు ఊతమిస్తున్నారు. నకిలీ పత్రాలు, అక్రమ రిజిస్ట్రేషన్ల ఘటనలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్లపై పెద్దగా చర్యలు ఉండటం లేదు. వివాదమైతే రిజిస్ట్రేషన్ రద్దు చేయటమో లేదంటే సదరు ఉద్యోగిని బదిలీ చేస్తున్నారు. రూ.లక్షలు తీసుకుని అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన అధికారులు వేర్వేరు చోట్ల అదే పోస్టుల్లో దర్జాగా కొనసాగుతున్నారు. కఠిన చర్యలు తీసుకోకపోవడంతో పలువురు ఉద్యోగుల ఆగడాలకు అంతే లేకుండా పోయింది.

**ఆదోని ఘటనపై అధికారుల ఆగ్రహం** ఆదోనికి చెందిన ఎగ్గటి ఈశ్వరప్పకు మండిగిరి పంచాయతీ పరిధిలో 6.51 ఎకరాలు ఉంది. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.35 కోట్లకుపైగా ఉంది. నంద్యాలకు చెందిన ఎగ్గటి ఆముదాల భాస్కర్ ఈ పొలంపై కన్నేశాడు. తాను ఎగ్గటి ఈశ్వరప్పకు వారసుడినని.. ఎగ్గటి ఈశ్వరప్ప మరణించినట్లు మరణ ధ్రువీకరణ పత్రం, నకిలీ వారసత్వ పత్రాలు సృష్టించాడు. ప్రస్తుతం సదరు పొలానికి తానే యజమానినంటూ పెద్దమర్రివీడుకు చెందిన సి.ఈరన్నకు రూ.3.90 కోట్లకు విక్రయించినట్లు 2024, డిసెంబరు 31న అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారంలో ఆదోని ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ హాజీమియ్యా, సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌పై సస్పెన్షన్ వేటు పడింది.

**అక్రమార్కులకు వత్తాసు**

ప్రస్తుతం వివాదంలో చిక్కుకున్న ఆదోని సబ్ రిజిస్ట్రార్ హాజీమియ్యా గతంలో కర్నూలు జిల్లా కేంద్రంలో పనిచేశారు. వక్ఫ్ బోర్డు స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేసి వివాదాల్లో చిక్కుకున్నాడు. గతంలో ఓ వ్యక్తి చనిపోగా బతికి ఉన్నట్లు కొందరు తప్పుడు పత్రాలు, నకిలీ యజమానిని సృష్టించి మరొకరికి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. సదరు అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఈయన బాధ్యుడిగా ఆరోపణలు ఎదుర్కొన్నారు. సదరు అక్రమ రిజిస్ట్రేషన్‌ను తెలివిగా రద్దు చేసి వివాదం నుంచి బయటపడ్డాడు. ఆయన పనిచేసిన ప్రతిచోటా అవినీతి ఆరోపణలున్నాయి.

**గుడ్డిగా రిజిస్ట్రేషన్లు**

ఇంటి స్థలమైనా.. వ్యవసాయ, వ్యవసాయేతర భూమి అయినా.. ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయాలంటే చట్టబద్ధమైన హక్కు పత్రాలు, లింకు డాక్యుమెంట్లు సమర్పించాలి. కొందరు సబ్ రిజిస్ట్రార్లు చేతివాటం ప్రదర్శించి అడ్డగోలుగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. ఒక్క పూటలోనే లింకు డాక్యుమెంట్లు పుట్టిస్తారు. అప్పటికప్పుడే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కర్నూలుకు చెందిన హనుమంతమ్మకు ఆదోని పరిధిలో రూ.1.70 కోట్ల విలువ చేసే 6 సెంట్ల స్థలం ఉంది. హనుమంతమ్మ స్థలంపై డా.రవికిరణ్ కన్నేశారు. అతని తల్లి పేరు లక్ష్మి కాగా.. హనుమంతమ్మగా నకిలీ పత్రాలు సృష్టించారు. సదరు స్థలాన్ని 2024, అక్టోబరు 16వ తేదీన సురేష్‌బాబు అనే వ్యక్తి పేరుతో ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. అసలు యజమాని హనుమంతమ్మ ఆదోని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

**పోలీసు అదుపులో సాక్షులు?**

ఆదోని అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో సోమవారం సీఐ సూర్యమోహన్‌రావు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి విచారణ చేపట్టారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలు, ఆధార్, నకిలీ మరణ ధ్రువపత్రం, నకిలీ ఫ్యామిలీ ధ్రువపత్రం స్వాధీనం చేసుకొన్నారు. కర్నూలు నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సాక్షి సంతకాలు చేసినట్లు సమాచారం వారిని అదుపులోకి తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసిన నంద్యాలకు చెందిన ఆముదాల భాస్కర్, చేయించుకున్న గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడుకు చెందిన చాకలి ఈరన్న అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

# చలికి గజగజ



చిత్తూరు : చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారుల నిర్లక్ష్యానికి రోగులు అవస్థలు పడుతున్నారు. అరకొర వసతులతో నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా రోగులు, వారి సహాయకులకు తిప్పలు తప్పలేకపోతున్నాయి. చలి మొదలైనా ఆస్పత్రిలో వాటికి తగ్గ ఏర్పాట్లు లేకపోవడంతో అక్కడి రోగుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. చిత్తూరు ప్రభుత్వ-అపోలో ఆస్పత్రిలో 600 పడకలు ఉన్నా.. ఇద్దరి పెత్తనం కారణంగా వాటికి తగ్గ వసతులు, సౌకర్యాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇన్-పేషెంట్ వార్డుల్లో నేటికీ సమస్యలు కొకొల్లలు. స్థానికంగా చికిత్స పొందుతున్న ఏ ఒక్కరిని పలకరించినా ఇదే సమాధానం. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోగాలతో ఆస్పత్రిలో చేరే వారిలో చాలామంది బలహీనంగా ఉంటూ నీరసించి పడకపై ఉంటుంటారు. వారు చలికి తట్టుకోలేకున్నారు. ఆస్పత్రిలోని వార్డుల్లో కిటికీలకు తలుపులు లేక రోగులు చలికి వణికిపోతున్నారు. చాలా కిటికీలకు ఆస్పత్రిలో వినియోగించే వస్త్రాన్ని అడ్డం పెట్టడం గమనార్హం. వాటి కారణంగా పెద్దలు, వృద్ధులే కాక అప్పుడే పుట్టిన శిశువులు కూడా తిప్పలు పడుతున్నారు.

**కొత్త రోగాలు తెచ్చుకోవాల్సిందే..**

రోగాన్ని నయం చేసుకోవాలని ఆస్పత్రిలో చేరితే కొత్త రోగంతో బయటకు వెళ్లే పరిస్థితి. రోజూ వార్డులను శుభ్రం చేస్తున్నా.. దుర్వాసనతో ముక్కుపుటలు అదురుతున్నాయి. కిటికీలు, మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో పగలు, రాత్రి దోమల బెడదతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుప్పటి కప్పుకొంటే పంకాలు పనిచేయక ఇక్కట్లు పడుతున్నారు. ప్రతి పడక వద్ద మస్కిటో కాయిల్స్ వినియోగిస్తున్నా దోమల బెడద తగ్గలేదు.

**దుప్పట్లూ మార్చరు..** ప్రభుత్వాసుపత్రిలోని పడకలకు ఉన్న దుప్పట్లు రోజూ మార్చాల్సి ఉన్నా చిత్తూరులో ఆ పరిస్థితి లేదు. ప్రతి వార్డుల్లో రోగులు మారుతున్నా పడకపై ఉన్న దుప్పట్లు మారడం లేదు. కొన్ని పడకలపై దుప్పట్లు లేక రోగులే ఇళ్ల నుంచి తెచ్చుకుని వినియోగిస్తున్నారు. మరికొందరు చల్లటి మెత్తపైనే పడుకుని చలికి వణికిపోతున్నారు. రోజూ రౌండ్స్‌కు వచ్చే వైద్యులు, సిబ్బంది పరిస్థితిని చూస్తున్నా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు దృష్టిపెట్టి రాత్రివేళ రోగులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

## ఉమ్మడి నంబరు.. రైతుకు ఉరి

కర్నూలు : గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే అన్నదాతలకు అవస్థలు మిగిల్చింది. అధికారులు ఇష్టానుసారంగా కొలతలు వేశారు. రైతుల సమక్షంలో వేయాల్సి ఉండగా.. కనీసం వారికి సమాచారం ఇవ్వలేదు. ఫలితంగా పెద్దఎత్తున తప్పులు దొర్లాయి. భూ విస్తీర్ణంలో తేడాలు ఒక ఎత్తయితే.. జాయింట్ ఎల్పీఎంలు మరో సమస్యగా మారింది. సబ్ డివిజన్ చేసుకోవడానికి ఒక జాయింట్ ఎల్‌పీఎంకు రూ.550 చెల్లించాల్సి వస్తోంది. ఇది రైతులకు ఇబ్బందికరంగా మారింది.. రీసర్వేలో జరిగిన తప్పిదాలకు దిద్దుబాటు చర్యలు చేపడుతున్న 'కూటమి' ప్రభుత్వం జాయింట్ ఎల్‌పీఎంల సమస్య సరిదిద్దే ప్రక్రియను 'ఉచితం' చేయాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

**1.20 లక్షల మంది రైతుల అవస్థ**

దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)లను తీసుకొచ్చారు. సర్వే నంబర్లు ఒక వ్యక్తికి ఒక్కటే.. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. రీ సర్వే తర్వాత ఐదారుగురికి కలిపి ఒక ఎల్‌పీఎం నంబరు కేటాయించి భూ హక్కు పత్రాలు అందజేశారు. వీరు ఇతరులకు భూములు అమ్మాలన్నా.. కొనుగోలు చేయాలన్నా వీలులేకుండా పోతోంది. రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. 1బీలు రావడం లేదు. ఎల్పీఎంలతో ఉమ్మడి జిల్లాలో ఉమ్మడి లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు జిల్లాలో ఎల్పీఎంల ఖాతాలు 65,028, నంద్యాల జిల్లాలో 76,162 ఖాతాలున్నాయి. దాదాపు 1.20 లక్షల మందికిపైగా రైతులు జాయింట్ ఎల్పీఎం కేటాయింపుతో ఇబ్బందులు పడుతున్నారు.

చలానా చెల్లిస్తేనే సబ్ డివిజన్

జాయింట్ ఎల్పీఎంల సమస్యను పరిష్కరించుకోవాలంటే నలుగురైదుగురిలో ఏ రైతు సర్వే సబ్ డివిజన్‌కు చలానా కట్టాలి అన్నది పెద్ద సమస్యగా మారింది. ఒక జాయింట్ ఎల్పీఎంకు రూ.550 చెల్లించాల్సి ఉంది. నగదు చెల్లించే విషయంలో సమస్యలు ఎదురవుతు న్నాయి. చలానా కట్టిన తర్వాత సర్వే చేసిన అనంతరం సబ్ డివిజన్లుగా మారుస్తారు. ఆ తర్వాతే జాయింట్ ఎల్పీఎంలు కాస్త విడివిడిగా రైతులకు ప్రత్యేక ఎల్పీఎం నంబర్లు కేటాయిస్తారు. కొందరు రైతులకు నాలుగు నుంచి ఐదు జాయింట్ ఎల్‌పీఎంలు వచ్చాయి. వీరు రూ.2,200 నుంచి రూ.2,750 వరకు రుసుము చెల్లించాల్సి ఉంది.

**దండిగా దరఖాస్తులు**

రీసర్వేలో లోపాలు సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా అర్జీలు అందిన జిల్లాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా ఒకటి. రీసర్వే పూర్తయిన 464 గ్రామాల్లో గత అక్టోబరు నుంచి నవంబరు వరకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల ద్వారా 32,659 ఫిర్యాదులొచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించినవి 8,227, సర్వే శాఖకు చెందినవి 24,432 ఉన్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం**

మునికన్నన్, జిల్లా సర్వే అధికారి,

జాయింట్ ఎల్పీఎంలను విడివిడిగా ఒక్కో రైతు పేరున మార్చుకోవాలంటే ప్రస్తుతం ఒక ఎల్పీఎం నంబరుకు రూ.550 చొప్పున ప్రభుత్వానికి చలానా చెల్లించాల్సి ఉంది. రైతులపై భారం పడకుండా ఉండేందుకు ఉచితంగా సేవలందించేలా ప్రభుత్వం త్వరలో చర్యలు చేపట్టనుంది.

**ఏడాదిగా అధికారుల చుట్టూ..**

లక్ష్మీదేవమ్మ, బలపనూరు

బలపనూరులో సర్వే నంబరు 63లో 2.50 ఎకరాలు ఉంది.. భూ సర్వే అనంతరం ఇదే సర్వే నంబరులో నాతోపాటు నలుగురు రైతులకు కలిసి జాయింట్ ఎల్‌పీ నంబరు కేటాయించారు. నా పొలం.. నా పేరుపై నమోదు చేయమని ఏడాది కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం.. ఎవరూ పట్టించుకోవడం లేదు.. బ్యాంకులో పంట రుణం ఇవ్వడం లేదు.. నాకు 2.50 ఎకరాలు ఉంటే 1బీలో కేవలం 1.30 ఎకరాలు నమోదైంది.. సర్వే నంబరు 56లో నాకు 2 ఎకరాలు ఉండగా ఎల్‌పీ నంబర్లలో ఆరుగురు రైతులు ఉన్నట్లు చూపుతున్నారు.

**సర్వేతో తీవ్ర నష్టం** సంగటి శివలింగ, నాగలాపురం, ఆదోని మండలం రీ సర్వేతో తీరని నష్టం జరిగింది. సర్వే నంబరు 126లో 1.35 ఎకరాలు ఉంది.. రీ సర్వే తర్వాత 52 సెంట్లు తగ్గించారు.. జాయింట్ ఎల్‌పీఎం నంబర్లుగా నమోదు చేశారు. బ్యాంకులో రుణం ఇవ్వడం లేదు. అమ్ముకుందామంటే అవకాశం లేకుండా పోయింది. పలుమార్లు అధికారులను కలిసి సమస్యను విన్నవించాం. రీ సర్వే సమస్యలపై గ్రామసభలు పెట్టినప్పుడు అర్జీలు ఇచ్చాం. ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు.

## క్యాన్సర్ ఆసుపత్రిలో అవినీతి కణాలు

కర్నూలు : రూ.120 కోట్లతో నిర్మించిన క్యాన్సర్ ఆసుపత్రిలో అడుగడుగునా లోపాలే దర్శనమిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఏడాది కిందట అప్పటి ఆర్థిక మంత్రి హడావుడిగా ప్రారంభించారు. తొమ్మిది నెలలు గడిచినా నేటికీ పనులు పూర్తి చేయలేదు.. భవనాన్ని అధికారికంగా ఆసుపత్రి అధికారులకు అప్పగించలేదు. చేసిన పనుల్లో నాణ్యత తేలిపోయింది.. భవనం పైఅంతస్తులో సేవలు ప్రారంభం కాకుండానే కొన్నిచోట్ల టైల్స్ పగిలిపోయాయి.. గోడలకు పగుళ్లు వచ్చాయి.. రంగులు తేలిపోయాయి. కింది అంతస్తు ప్రధాన ద్వారం దగ్గరున్న కింది మెట్టు గ్రానైట్ పలక ధ్వంసమైంది. సెమినార్ హాల్లో ట్యూబ్‌లైట్ నట్లు ఊడిపోయి సీలింగ్‌కు వేలాడుతోంది.




ఎండోస్కోపీ గదిని నిర్మించామని చెబుతున్నారు కానీ పనులు పూర్తి కాలేదు.

**కొన్నారు.. పక్కన పెట్టారు**

విద్యుత్తు విభాగానికి రూ.36 కోట్లు వెచ్చించారు.. బిల్లులు పూర్తిగా చెల్లించకపోవడంతో గుత్తేదారుడు మధ్యలోనే పనులు ఆపేశారు.

క్యాన్సర్ వైద్యంలో కీలకమైన రేడియేషన్ ప్రక్రియ కోసం లీనియర్ యాక్సిలరేటర్ ఉపకరణాన్ని రూ.36 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశారు. రోగులకు సేవలందించే ప్రక్రియ ప్రారంభం కాలేదు. హెచ్.డి.ఆర్. బ్రాకీథెరపీ యూనిట్‌ను రూ.6 కోట్లతో కొనుగోలు చేశారు. ఇంకా ఆసుపత్రికే చేరలేదు.

రూ.9.88 కోట్లు వెచ్చించి సి.టి.సిమ్యులేటర్ ఉపకరణాన్ని కొనుగోలు చేశారు. దీనికి అన్ని రకాల పరీక్షలు పూర్తయ్యాయి. ఇతర విభాగాలు ప్రారంభం కాకపోవడంతో దీన్ని పక్కన పెట్టారు.

# కీలక స్థానాలన్నీ ఖాళీ




కర్నూలు : ఉమ్మడి జిల్లా పోలీసు శాఖ, అనుబంధ విభాగాల్లో కీలక స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా ఇప్పటికీ భర్తీ చేయలేదు. ముఖ్యమైన స్థానాలు సైతం ఖాళీగా ఉండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అధికారులు, సిబ్బంది కొరత నేపథ్యంలో క్షేత్రస్థాయిలో దాడులు చేయలేకున్నారు. ఈ నేపథ్యంలో అక్రమాలను నిరోధించలేని పరిస్థితి ఏర్పడింది.

**అనిశా.. దాడులే లేక**

కర్నూలు రేంజి పరిధిలోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో డీఎస్పీ స్థానం దాదాపు ఏడు నెలలుగా ఖాళీగా ఉంది. కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి అనిశా కార్యాలయం కర్నూలులో ఉంది. ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, సిబ్బంది ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పకడ్బందీ వ్యూహం రచించడం.. లంచం తీసుకునే సమయంలో దాడి చేసి పట్టుకోవటం.. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండే అధికారుల వివరాలు ఆరా తీసి దాడులు చేసి జప్తు చేయటం.. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేయటం వంటివి అనిశా డీఎస్పీ ఆధ్వర్యంలో జరుగుతాయి.

**మూడంటే.. మూడే**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2021లో 12, 2022లో 6, 2023లో 12 అనిశా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు పరిశీలిస్తే కేవలం మూడు కేసులు మాత్రమే నమోదవడం గమనార్హం. అసలు అనిశా పనిచేస్తోందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది కొరత నేపథ్యంలో క్షేత్రస్థాయిలో దాడులు కానరావడం లేదు.

**నిఘా.. నిర్వీర్యం**

పోలీసు శాఖలో నిఘా విభాగమైన ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రాంతీయ కార్యాలయం కర్నూలులోనే ఉంది. రెండేళ్ల కిందట డీఎస్పీగా ఉన్న వెంకటరాముడు అదనపు ఎస్పీగా పదోన్నతిపై బదిలీ అయిన తర్వాత ఆ స్థానం భర్తీ కాలేదు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి బదిలీ అయిన తర్వాత ఆ స్థానాన్నీ భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఈ శాఖ కార్యాలయంలో డీఎస్పీతోపాటు మరో రెండు సీఐ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఆకస్మిక దాడులు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఏపీఎస్పీ రెండో పటాలం దళాధిపతిగా ఉన్న రవిశంకర్ ఈ ఏడాది సెప్టెంబరులో ఉద్యోగ విరమణ చేశారు. రెండు నెలల నుంచి ఈ స్థానం ఖాళీగా ఉంది. అనంతపురం జిల్లాకు చెందిన ఏపీఎస్పీ 14వ బెటాలియన్ దళాధిపతి ప్రభుకుమార్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.


**సీఐడీ విభాగంలోనూ..**

ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కీలక కేసులు దర్యాప్తు చేసే సీఐడీ ప్రాంతీయ (రీజినల్) కార్యాలయం కర్నూలులో ఉంది. అదనపు ఎస్పీ స్థాయి అధికారి సీఐడీ రీజినల్ అధికారిగా ఉంటారు. సీఐడీ రీజినల్ అధికారిగా ఉన్న పి.ఎన్.బాబు రెండేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం అప్పటి వైకాపా ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు. అప్పటినుంచి నేటి వరకు డీఎస్పీ స్థాయి అధికారులే ఇన్‌ఛార్జి ప్రాంతీయ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం డీఎస్పీ దైవప్రసాద్ ఇన్‌ఛార్జి ప్రాంతీయ అధికారిగా ఉన్నారు.

**సీఐకే బాధ్యతలు**

సార్వత్రిక ఎన్నికలకు ముందు మే నెలలో కర్నూలు అనిశా డీఎస్పీ వెంకటాద్రి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత ఇప్పటివరకు ఆ పోస్టు భర్తీకి నోచుకోలేదు. కడప డీఎస్పీ గిరిధర్ అనిశా ఇన్‌ఛార్జి డీఎస్పీగా వ్యవహరించేవారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన సైతం మరో విభాగానికి బదిలీ కావటంతో ప్రస్తుతం సీఐ వెంకటకృష్ణారెడ్డి ఇన్‌ఛార్జి డీఎస్పీగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు కొంతకాలం కిందట సీఐలు సైతం మాతృ శాఖకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మరో రెండు సీఐ స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

# సంతానోత్పత్తికి మేలుజాతి మేకలు




ఎమ్మిగనూరు : జిల్లాలో సేద్యం కలిసిరాని చాలా మంది చిన్న, సన్నకారు రైతులకు మేకల పెంపకమే జీవనాధారం. ముఖ్యంగా జిల్లా పశ్చిమ ప్రాంతంలో కొండలు, గుట్టలు ఉండటంతో మేకల మందలను మేపేందుకు అనువుగా ఉంటుంది. మేకల పోషకులకు ఆదాయాన్ని పెంచేందుకు మేలు జాతి సంతానోత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. రూ.కోట్లతో అత్యాధునిక వసతులతో ల్యాబ్, వీర్య ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పలు నిర్మాణాలు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జనవరిలో ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద రూ.6.74 కోట్లతో రీజనల్ గోట్ సెమెన్ ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ, సెమెన్ బ్యాంకు నిర్మాణం చేపట్టారు. ఎన్‌ఎల్‌ఎం ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం రూ.4.05 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.69 కోట్లతో సంయుక్తంగా మేకపోతుల వీర్య కేంద్రం నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే రూ.4.39 కోట్లు విడుదల చేసింది. సుమారు ఎకరానికిపైగా విస్తీర్ణంలో రూ.75 లక్షలతో అత్యాధునిక వసతులతో ప్రయోగశాల, రూ.72 లక్షలతో ఫ్యాన్లతో షెడ్లు, వీర్య సేకరణ యార్డు, కంచె నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రభుత్వం నిర్దేశించిన కమిటీ ద్వారా రూ.1.04 కోట్లతో ప్రయోగశాలలో అత్యాధునిక పరికరాలు కొనుగోలు పనులు కొనసాగుతున్నాయి.

**మొదట తొమ్మిది మేలుజాతి, వంద మేకపోతుల పెంపకం**

ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6 లక్షలకుపైగా మేకలు ఉన్నాయి. మేకల ఘనీకృత వీర్య కేంద్రం ఏర్పాటుతో ప్రస్తుతం పెంచుతున్న మేకల కన్నా అధిక బరువు కలిగి శారీరకంగా దృఢంగా ఉండి ఆరోగ్యవంతమైన మేలు జాతి మేకల ఉత్పత్తి జరుగనుంది. ఇందుకోసం అంతర్జాతీయ, దేశీంగా పేరుగాంచిన జమనాపరి (ఉత్తర్‌ప్రదేశ్), బోయర్ (ఆస్ట్రేలియా), బర్‌బరీ (రాజస్థాన్), బీటల్ (రాజస్థాన్), ఉస్మాన్‌బాదీ (రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్), మల్బరీ (కేరళ), సిరోహి (రాజస్థాన్), జక్రానా (రాజస్థాన్), శ్రుతి (గుజరాత్) తొమ్మిది మేలు జాతి మేకపోతులను ప్రభుత్వం నిర్దేశించిన కమిటీ ద్వారా వంద వరకు తొలి విడతగా కొనుగోలు చేయనున్నారు.

**రెండు నెలల్లో అందుబాటులోకి వీర్యకేంద్రం**

మేకపోతుల వీర్య కేంద్రాన్ని వచ్చే ఏడాది జనవరి రెండో వారంలోపు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే మేకపోతుల షెడ్లు, ల్యాబొరేటరీ, కంచె నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వాటికి అవసరమైన మేలు జాతి గడ్డిని బనవాసిఫారంలో బీడుగా ఉన్న సుమారు 1,500 ఎకరాల్లో పెంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ఉమ్మడి రాష్ట్రంలో ఆబోతుల ఘనీకృత వీర్య కేంద్రం పేరుగాంచింది. మేకపోతుల వీర్య కేంద్రం ఏర్పాటుతో జిల్లా పశ్చిమ ప్రాంతంలోని మేకల పెంపకందారులకు వరంగా మారనుంది. **పెంపకందారులకు మంచి ఆదాయం**

చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి డీడీ, ఘనీకృత వీర్యకేంద్రం బనవాసిబనవాసిలో ఇప్పటికే ఆబోతు వీర్యకేంద్రం ఉంది. మేలు జాతి మేకపోతుల ఉత్పత్తి కోసం ల్యాబొరేటరీ, వీర్య ఉత్పత్తి, సెమెన్ బ్యాంకు ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలో వీర్యకేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. నిర్దేశించిన కమిటీ ద్వారా మేలు జాతి మేకపోతులు కొనుగోలు చేస్తున్నాం. ఈ ప్రాజెక్టుతో మేకల పెంపకందారుల ఆదాయం మరింత పెరుగనుంది.

## బడుగులకు బలం

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీ సామాజిక వర్గం ఎక్కువ.. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా జగన్ ప్రభుత్వం వారి వెన్నువిరిచింది.. బీసీ ఎదుగుదలకు అత్యంత కీలకమైన కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది.. వృత్తిదారులను కోలుకోకుండా చేసింది.. స్వయం ఉపాధికి చిల్లిగవ్వ ఇవ్వలేదు.. రాయితీ రుణాలకు ఎగనామం పెట్టారు.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో 'నిధి'వంచనకు గురైన బీసీలను ఆదుకోవాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్లకు జవసత్వాలు అందించేలా ప్రణాళిక రూపొందించారు. చేతివృత్తులకు పునరుజ్జీవం కల్పించేలా రాయితీ రుణాలు అందించనున్నారు.

**11 వేల మందికి రూ.185 కోట్లు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 3.5 లక్షల బీసీ కుటుంబాలు ఉన్నాయి. ఆయా కుటుంబాల్లో యువత స్వయం ఉపాధిలో రాణించేలా రాయితీ రుణాలను అందించనున్నారు.. 2024-25 ఏడాదికి కేటాయింపులకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో సుమారు 11 వేల మందికిపైగా రూ.185.06 కోట్ల మేర బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలిచ్చేందుకు జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. చిన్నతరహా పరిశ్రమలు, పాడి పరిశ్రమ, చేతివృత్తులకు సంబంధించి మొత్తం ఆరు రంగాలను ప్రాధాన్యంగా తీసుకోనున్నారు.

**ఆదరణ చూపిన తెదేపా**

తెదేపా ప్రభుత్వ హయాంలో బీసీల కోసం 2014-19 మధ్య 'ఆదరణ' పథకం అమలు చేశారు. కులవృత్తిని బట్టి వారికి పరికరాలను అందజేశారు. స్వయం ఉపాధిలో భాగంగా వడ్డెరలకు పలుగు, పార,



చేపలు పట్టే వారికి వలలు, యాదవులకు ప్లాస్టిక్ పాల డ్రమ్ములు, నాయీ బ్రాహ్మణులకు సెలూన్ పరికరాలు.. ఇలా వృత్తుల ఆధారంగా అందజేశారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని రద్దు చేసి కేవలం రెండు కులాలకు మాత్రమే చేదోడు పథకాన్ని ఏడాదికి రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకొంది.

**కోత పెట్టిన వైకాపా** 'జగనన్న చేదోడు' పథకాన్ని 2020లో ప్రారంభించారు. ఏటా రూ.10 వేల సాయం చేస్తామని చెప్పిన జగన్ ఆ తర్వాత సంవత్సరానికి 2021లో ఎలాంటి సాయాన్ని అందించలేదు. ఇదే సమయంలో ప్రతి ఏడాది ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చిన జగన్.. 2019 నుంచి 2024 వరకు కేవలం నాలుగుసార్లు మాత్రమే ఇచ్చారు. ఒక్క ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.41,39,40,000లను ఇవ్వకుండా ప్రభుత్వం వంచించింది. తొలి ఏడాది కర్నూలులో 12,191 మంది, నంద్యాలలో 24,540 మందిని పథకానికి ఎంపిక చేశారు. 2021లో సాయం అందించకపోగా 2022లో లబ్ధిదారుల సంఖ్యను కుదించారు. కర్నూలులో 11,222, నంద్యాలలో 22,701 మందిని తగ్గించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండో ఏడాది 2,800 మందిని తప్పించి రూ.2.80 కోట్లను ప్రభుత్వం మిగుల్చుకుంది. బీసీల్లోని 113 కులాల్లో కేవలం రెండు కులాల వారికే పరిమితం చేయడంతో సుమారు రూ.2 లక్షల కుటుంబాలు పథకాన్ని అందుకోలేకపోయాయి.

## జల్‌జీవన్‌లో... నిర్లక్ష్యపు ధారలు

నంద్యాల : ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి.. కుటుంబ అవసరాలకు సరిపడా మంచినీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్రం జల్‌జీవన్ మిషన్‌ను తీసుకొచ్చింది. పల్లెల్లో ప్రతి ఒక్కరికీ నిత్యం 55 లీటర్ల చొప్పున 3.45 లక్షల కుటుంబాలకు మంచినీరు అందించాల్సి ఉంది. ఇందుకోసం బోరుబావులు తవ్వించి.. మోటార్లు బిగించాలి.. ట్యాంకులు, పైపులైన్లు నిర్మించాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా రాష్ట్ర వాటా ఇవ్వకుండా 'నీరు'గార్చింది.. ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన 'కూటమి' ప్రభుత్వం సర్వే చేయించింది.. చేసిన పనుల్లో అడుగడుగునా లోపాలు దర్శనమిచ్చాయి.. కనెక్షన్లు ఇవ్వకున్నా ఇచ్చినట్లు లెక్కలు రాసుకొన్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది.. ఆయా అంశాలపై నివేదికలిచ్చిన అధికారులు పనులపై డీపీఆర్ రూపొందించకపోవడంతో పనుల ప్రగతిపై ప్రభావం పడింది.. వీటి పూర్తికి ఏడాది మాత్రమే గడువు ఉంది.. అప్పటిలోపు పూర్తవుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**పూర్తయ్యింది సగమే** నంద్యాల జిల్లాలో 215 పనులు జరుగుతుండగా 16 చోట్ల రద్దు చేశారు. చేసిన పనులకుగాను గుత్తేదారులకు రూ.14.25 కోట్లు చెల్లించాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో రూ.12.17 కోట్ల చెల్లించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 532 కి.మీ. పొడవునా పైపులైన్ పూర్తి చేయాల్సి ఉంది. ఆయా పనులకు డీపీఆర్ తయారు చేయాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతులెత్తేయడం పథకం ప్రగతిపై ప్రభావం చూపనుంది.

**ట్యాంకు నిర్మాణాల ఊసేలేదు**

కర్నూలు జిల్లాలో 245 ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 45, నంద్యాలలో 183కుగాను 63 పూర్తయ్యాయి. రూ.5 లక్షల్లోపు పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయించారు. కర్నూలు జిల్లాలో 478, నంద్యాలలో 508 గ్రామ జల సంఘాలు ఏర్పాటు చేసి పనులను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. పేరుకు జల సంఘాలు పనులు చేస్తున్నట్లు పైకి చెప్పినా క్షేత్ర స్థాయిలో వైకాపా నాయకులే చేశారు. **కనిపించని కుళాయిలు**

కర్నూలు జిల్లాలో 34, నంద్యాలలో 26 సీపీడబ్ల్యూ పథకాలున్నాయి. వీటి పరిధిలో కుళాయిల ఏర్పాటుకు రెండు జిల్లాలకు రూ.40 కోట్లు కేటాయించారు. పనులు ప్రారంభించి నాలుగేళ్లయినా ఇంత వరకు సగం కనెక్షన్లు ఇవ్వలేకపోయారు.

పైపులైన్లు, కుళాయి కనెక్షన్ పనులు నాసిరకంగా చేపట్టారు. ఇచ్చిన కనెక్షన్లు క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. నీళ్లు రాక చాలాచోట్ల విరిగిపోయాయి. దస్త్రాల్లో కనెక్షన్లు, కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చూపుతున్నా, క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. ఈ విషయం ఇంటింటి సర్వేలో వెల్లడైంది. ఆలూరు, మంత్రాలయం, ఆదోని, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో 40 శాతం పనులు జరగలేదు. ఉయ్యాలవాడ, చాగలమర్రి, రుద్రవరం దొర్నిపాడు, పాణ్యం, గడివేముల మండలాల్లో పనులు నాసిరకంగా జరిగాయి.

పనుల విలువ: రూ.530.11 కోట్లు(కర్నూలు రూ.239.64 కోట్లు, నంద్యాల రూ.290.47 కోట్లు)

# కడగండ్లు

చిత్తూరు : సరైన వర్షాలు లేక చెరువులన్నీ ఖాళీ అవుతున్న వేళ ఫెయింజల్ తుపాను అన్నదాతలకు ఉపశమనం కలిగించినా కొన్ని ప్రాంతాల్లో కడగండ్లు మిగిల్చింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో 25 చెరువులకు తుపాను ధాటికి గండ్లు పడ్డాయి. కార్వేటినగరం, సదుం, సోమల, పెద్దపంజాణి, విజయపురం, పూతలపట్టు, వెదురుకుప్పం తదితర మండలాల్లో చెరువులకు గండ్లను గుర్తించినట్లు జలవనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వీటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు రూ. 76.75 లక్షలతో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు రాగానే సత్వరమే పనులు చేపట్టి పూర్తిచేస్తామని, చెరువుల వద్ద ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

**అధికారుల నిర్వాకం శాపమై..**

ఎన్టీఆర్ జలాశయంలోకి వరద పోటెత్తుతోంది. జలవనరుల శాఖ అధికారులు ఐదు గేట్లు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో మిగులు నీరు దిగువకు పరుగులు పెడుతోంది. జలవనరుల శాఖ డీఈఈ జయచంద్రబాబు పర్యవేక్షిస్తున్నారు. పెనుమూరు–చిత్తూరు మార్గంలో జలాశయం దిగువన ఉన్న రోడ్డు మరమ్మతుల్లో ర.భ. అధికారులు చర్యలు తీసుకోకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. అక్కడ చాలా పల్లంగా ఉండటంతో ప్రస్తుతం నీరంతా అక్కడే ప్రవహిస్తోంది. ఫలితంగా వాహనదారులు నానా అవస్థలు



పడుతున్నారు. వాహనాలు నిలిచిపోవడంతో తోయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ర.భ.అధికారులు చర్యలు తీసుకుని ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**గండిపడి రాకపోకలు నిలిచి..**

సోమల మండలంలో పలు చెరువులు నిండి మొరవలు పారుతున్నాయి. నంజంపేట–వయా తుగడంవారిపల్లె పొదలకుంటపల్లె మార్గంలోని దళవాయిచెరువుకు గండిపడింది. స్థానికులు గండిపూడ్చేయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ మార్గంలో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

**తటాకాలకు జలకళ**

తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు, చెరువులకు జలకళ సంతరించుకున్నాయి. ఎన్టీఆర్ జలాశయం, కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం ప్రాజెక్టులు నిండిపోవడంతో గేట్లు ఎత్తి కిందికి నీటిని విడుదల చేశారు. మరింత విస్తారంగా వర్షాలు కురిస్తే జిల్లా వ్యాప్తంగా వంద శాతం చెరువులు పూర్తిస్థాయి జలకళ సంతరించుకుంటాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని చెరువులు: 4,120 పూర్తిగా నిండినవి: 144 75శాతం ఉన్నవి: 383 50 శాతం ఉన్నవి: 981
25 శాతం నీరున్నవి: 1,999

# తుడా పీఠం.. వరించేదెవరినో..?

తిరుపతి : జిల్లాలో కీలకమైన నామినేటెడ్ పదవి భర్తీ కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ప్రతి విడతలో జిల్లాకు ప్రాధాన్యం దక్కుతూ వచ్చింది. తితిదే పాలక మండలి ఛైర్మన్ తరువాత అత్యంత ప్రాధాన్యమున్న నామినేటెడ్ పోస్టు తుడా అధ్యక్షుడిది మాత్రమే. అందుకే పదుల సంఖ్యలో ఆశావహులు ఆ పదవిని దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేస్తున్నకొద్దీ వారిలో ఉత్కంఠ పెరుగుతోం ది. తుడాలో గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా అక్రమాలు జరిగిన నేపథ్యంలో వాటిని వెలుగులోకి తేవాల్సిన ఆవశ్యకత ఉందని, అంతటి సత్తా ఉన్నవారికే పదవి కట్టబెట్టాలని పార్టీ శ్రేయోభిలాషులు ఆశిస్తున్నా రు. తిరుపతి ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయించడంతో తెదేపా, జనసేన స్థానిక నేతల్లో పలువురు స్తబ్దుగా ఉండిపోయారు. పార్టీ అధినేతలు స్వయంగా వారితో మాట్లాడినా ప్రయోజనం లేకుండాపో యింది. రెండు పార్టీల నేతల మధ్య అంతర్గత విభేదాలు ఇప్పటికీ కొనసాగుతున్న నేపథ్యంలో ఇక్కడి వారికి తుడా ఛైర్మన్ పదవి ఇచ్చే అవకాశాలు సన్నగిల్లినట్లు చెబుతున్నారు. వాస్తవానికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన నేత కిరణ్‌రాయల్, పసుపులేటి హరిప్రసాద్, భాజపా నుంచి సామంచి శ్రీనివాస్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితోపాటు డాలర్స్ దివాకర్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపించాయి. తుడా పరిధిలోని ఇతర ఎమ్మెల్యేలు సైతం ఆశావహుల్లో ఉన్న నేపథ్యంలో సరైన



వ్యక్తిని బరిలోకి దించేందుకు ముఖ్యమంత్రి చూస్తున్నట్లు సమాచారం.

**గతానికి భిన్నంగా కొండపైనా సేవకు అవకాశం**

తుడా ఛైర్మన్ పదవి దక్కించుకున్న వారికి తితిదేలో ఎక్స్‌అఫిషియో పాలకమండలి సభ్యులుగా అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఇప్పటికే ఉత్తర్వులు వెలువరించింది. గతంలో కాంగ్రెస్, వైకాపా హయాంలో తుడా ఛైర్మన్‌కు ఎక్స్ అఫిషియో పాలకమండలి సభ్యులుగా ఉన్న అవకాశాల్ని తెదేపా అధికారంలోకి రాగానే రద్దుచేస్తూ వచ్చినప్పటికీ ఈ దఫా కొనసాగింపునకు నిర్ణయించిన నేపథ్యంలో జంట అవకాశాలు వరించనున్నాయి. అందుకే తుడా ఛైర్మన్ పదవిని కొత్త వ్యక్తులకు అప్పగించే అంశాన్నీ కొట్టిపారేయలేమని చెబుతున్నారు. జిల్లాకు చెందిన ఓ నిర్మాణ సంస్థ అధినేత ఈ విషయంలో ముందువరుసలో ఉన్నట్లు చెబుతున్నారు. తిరుపతిలో ఓ ప్రధాన సామాజిక వర్గాన్ని ఎదుర్కోవడం.. ఇదే సమయంలో తెదేపా తరఫున గట్టిగా పనిచేసిన వారికి పదవిని కట్టబెట్టడం లక్ష్యంగా అధిష్ఠానం పావులు కదుపుతున్నట్లు సమాచారం.

# భూసారానికి భరోసా



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజురోజుకు భూసారం తగ్గడంతో పాటు సేద్యపు భూములు కుంచించుకుపోతున్నాయి. దీనికి విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకమే కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేడు ప్రపంచ భూసార పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా భౌగోళిక భూసార స్థితిగతులపై కథనం.

జిల్లాలో సాగవుతున్న భూముల్లో పంటల దిగుబడులను రెండింతలు చేయాలంటే భూసార పరిరక్షణతో పాటు సేంద్రియ ఎరువులు వాడకం ఒక్కటే మార్గమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భూసార లోపం వల్ల భూమి తన సహజత్వాన్ని కోల్పోతుంది. ఈ పరిణామాలు క్రమేణా జీవుల మనుగడకు ముప్పు తెస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేర్వేరు యాజమాన్య పద్ధతుల ద్వారా తరిగిపోయిన భూసారాన్ని మళ్లీ పునరుద్ధరించుకోవచ్చని వారు సూచిస్తున్నారు.

**పచ్చదనం పెంపునకు చర్యలు**

ప్రస్తుతం జిల్లాలో అడవుల శాతం 7–8 శాతానికి పడిపోయింది. ఇదీ కనీసం 33.33 శాతానికి తగ్గరాదని భూభౌగోళిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పచ్చదనం శాతం కూడా 24.57కు చేరాలి. దీని కోసం సామాజిక వన, అటవీశాఖలు, వ్యవసాయ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లు చర్యలు చేపడుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో వేస్తున్న మొక్కలకూ పోషకం అందాలంటే.. రసాయన ఎరువుల ప్రభావం లేకుండా జాగ్రత్త పడాలని ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

**రసాయనాల వాడకం ఇలా..**

ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి రైతులు ఎరువుల వాడకం ఉంటుంది. ఒక బస్తా ఎరువు వేయాల్సి ఉండగా రెండు, మూడు బస్తాలు వేస్తున్నారు. వీటికి అదనంగా పురుగు మందుల వాడకం నియంత్రణ కోల్పోవడంతో ఆ ప్రభావం భూసారంపై పడుతుంది. భూమిలో ఉండాల్సిన నత్రజని, పాస్ఫరస్, పోటాషియం, సల్ఫర్ వంటి పోషక నిల్వల్లో ఎప్పుడో సమతుల్యత దెబ్బతింది. పోషక నిల్వల్లో సమతుల్యత లోపంతో పంట దిగుబడి, నాణ్యత తగ్గిపోతుంది.

**రైతులకు భూ ఆరోగ్య కార్డులు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూమిలో ఉన్న సారాన్ని పరీక్షించి ఆ వివరాలను రైతులకు తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. దాని ప్రకారం ఉమ్మడి జిల్లా అంతటా రైతుల భూముల నుంచి మట్టి నమూనాలు సేకరించి, వాటిల్లో పోషకాలను, సారం పరిస్థితులను తెలియజేస్తున్న భూ ఆరోగ్య కార్డులను ఇస్తున్నారు. అనంతపురం జిల్లా భూసార పరీక్ష కేంద్రం ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణ లక్ష్యం 35,800 కాగా అందులో 27,667 పరీక్షలు పూర్తి చేసి, భూసార పరీక్ష కార్డులు పంపిణీకి సిద్ధం చేశారు.

**నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం**

వ్యవసాయ వ్యర్థాలను కంపోస్టు చేయడం, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంపొందించడం.

అపరాలను అంతర పంటగా, మిశ్రమ పంటగా పండించేందుకు ప్రోత్సహించడం.

నత్రజని స్థిరీకరించు పంటలను, చెట్లను పొలం గట్టపై పెంచడం, ఖాళీ ప్రాంతాలలో పచ్చిరొట్టను పెంచడం.

భూసార పరీక్షల ఆధారంగా మాత్రమే రసాయన ఎరువుల వాడకం.

వ్యవసాయంలో పశువుల పెంపకాన్ని ప్రోత్సహించడం.

రాక్ పాస్ఫేట్ అనే భాస్వరాన్ని అందించడం, ఎరువును కంపోస్టులో కలిపి వాడటాన్ని ప్రోత్సహించడం.

సమస్యాత్మక భూముల్లో సున్నం, జిప్సం, ఖనిజం, లవణం నేలను పునరద్ధరించే ఎరువులు నేల ఉదజనిని తటస్థంగా ఉంచటంలో సహాయ పడతాయి.

రసాయన ఎరువుల వాడకం మాదిరిగా జీవన ఎరువుల వాడకాన్ని భారీగా ప్రోత్సహించి నాణ్యమైన జీవన ఎరువులు వాడాలి.

**అన్నదాతల కర్తవ్యం** – రోజాపుష్పలత, ఏడీ, భూసార పరీక్ష కేంద్రం, అనంతపురం పంటలు సాగు చేసే నేల స్వభావం, లవణ సాంద్రత, ఆమ్ల, క్షార గుణాలను రైతులు తెలుసుకోవాలి. మొక్కలకు అందే పోషకాలు ఏ స్థాయిలో ఉండాలో అవగాహన పెంచుకోవాలి. రసాయనాల వాడకాన్ని తగ్గించాలి. సేంద్రియ సేద్యం పెరగాలి. నేల సహజతత్వాన్ని పరిరక్షించడం రైతుల కర్తవ్యం.

# తూకాల్లో నొక్కుడు..




అనంతపురం " రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో గోదాములు, రేషన్ దుకాణాల నుంచి బియ్యం పక్కదారి పడుతోంది. డీలర్లు తూకాల్లో మోసాలు చేస్తూ పెద్ద మొత్తంలో బియ్యాన్ని నొక్కేస్తున్నారు. వాటిని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దాంతోపాటు ఇంటింటా సేకరించిన బియ్యాన్ని ఎక్కడికక్కడ నిల్వ చేసి రాత్రివేళ గుట్టుగా సరిహద్దులు దాటించేస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. కొందరు పోలీసులు వ్యాపారుల నుంచి నెల మామూళ్లు తీసుకుంటూ సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**వందల క్వింటాళ్లు దోపిడీ..**

రేషన్ బియ్యాన్ని గోదాముల నుంచి మండల నిల్వ కేంద్రాలకు.. అక్కడి నుంచి రేషన్ డీలర్లకు సరఫరా చేస్తారు. సంచి బరువు సుమారు కిలో వరకు ఉంటుంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో సంచి బరువుతో కలిపి 50 కిలోలుగా తూకం వేస్తున్నారు. ఒక్కో సంచికి కిలో బియ్యాన్ని ఇక్కడే నొక్కేస్తున్నారు. 50 బస్తాలకు ఒక బస్తాను పక్కన పెట్టేస్తున్నారు. ఇలా రెండు జిల్లాలకు కలిపి ప్రతి నెలా 18 వేల టన్నులు (3.60 లక్షల బస్తాలు) బియ్యం వస్తోంది. ఈ లెక్కన ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే ప్రతి నెలా 3,600 క్వింటాళ్ల బియ్యం పక్కదారి పడుతోంది. సీఎస్‌డీటీలు, డీలర్లు కుమ్మక్కై వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ఇలా ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నొక్కేసిన బియ్యాన్ని నేరుగా వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

**రేషన్ దుకాణాల్లోనూ అంతే..**

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రావాల్సిన దానికంటే తక్కువే రేషన్ దుకాణాలకు చేరుతోంది. అయితే డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. 5 కిలోలు ఇవ్వాల్సిన చోట 4 కిలోలే వచ్చేలా చేస్తున్నారు. ఇలా ఒక్కో కార్డు నుంచి 3 నుంచి 5 కిలోలు నొక్కేస్తున్నారు. దాంతోపాటు అంత్యోదయ, అన్నపూర్ణ కార్డుదారులకు ఒక్కరు ఉన్నా 35 కిలోలు ఇవ్వాలి. చాలామందికి అవగాహన లేకపోవడంతో వారికి కూడా 5 కిలోలే ఇచ్చి పంపుతున్నారు. ఇలా ఒక్కో డీలరు సగటున 300 నుంచి 500 కిలోల వరకు నొక్కేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,012 రేషన్ దుకాణాల్లో తూకాల్లో మోసం కారణంగా ప్రతినెలా 9 వేల నుంచి 10 వేల క్వింటాళ్ల వరకు బియ్యం పక్కదారి పడుతోంది.

**అడ్డుకట్ట ఏదీ?**

అక్రమార్కులు డీలర్ల నుంచే కాకుండా ఇంటింటికి వెళ్లి బియ్యాన్ని సేకరిస్తున్నారు. కిలోకు రూ. 10 నుంచి రూ. 12 వరకు చెల్లిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఎక్కడికక్కడ నిల్వ చేస్తూ వారానికి ఒకసారి లేదా రెండుసార్లు రవాణా చేస్తున్నారు. రాత్రి వేళ బహిరంగంగానే బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. ధర్మవరం, గుంతకల్లు, అనంతపురం, పుట్టపర్తి, ముదిగుబ్బ గ్రామీణం, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో పోలీసులు వ్యాపారుల నుంచి ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారు. ప్రాంతాన్ని బట్టి నెలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు తీసుకుని అక్రమ రవాణాకు పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..** రేషన్ కార్డులు: 12.50 లక్షలు
చౌక దుకాణాలు: 3,012
ఎంఎల్ఎస్ పాయింట్లు: 24
ప్రతినెలా వచ్చే బియ్యం: 18 వేల టన్నులు

# సూక్ష్మ సేద్యానికి మంచి రోజులు

విజయనగరం : గత ప్రభుత్వం అటకెక్కించిన బిందు, తుంపర్ల సేద్యం పథకానికి మళ్లీ మంచి రోజులు వచ్చాయి. అధికారంలోకి రాగానే పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అమలుకు శ్రీకారం చుట్టారు. తగిన కార్యాచరణ ప్రణాళికను ఏపీఎంఐపీ అధికారులు సిద్ధం చేశారు. ఈ ఏడాది జిల్లాలో 3,050 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యాన్ని ఆచరణలోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన నిధులు కేటాయించింది.సూక్ష్మ సేద్యాన్ని 2014- 19 మధ్య నాటి తెదేపా ప్రభుత్వం ప్రోత్సహించింది. ఉమ్మడి జిల్లాలో 7,025 మంది రైతులకు 90 శాతం రాయితీతో పరికరాలు అందించారు. 7,964.82 హెక్టార్లలో ఉద్యాన పంటలను సాగులోకి తెచ్చారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక రెండేళ్ల పాటు పథకం అమలును పూర్తిగా అటకెక్కించేసింది. చివరి మూడేళ్లు అరకొరగా అమలు చేసింది. జిల్లాలో 2,538 మంది రైతులకు 2,623 హెక్టార్లకు సంబంధించి పరికరాలిచ్చినా వాటికి సంబంధించిన రాయితీ మొత్తాలను సంబంధిత కంపెనీలకు చెల్లించలేదు. ఇచ్చిన నాసిరకం పరికరాలను చాలా మంది రైతులు తిరస్కరించారు.బిందు సేద్యానికి అనువైన పంటలు: మామిడి, జీడి మామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్, సపోట, జామ, చెరకు, పత్తి, మల్బరీ, కూరగాయలు, నారు మళ్లు. తుంపర్ల సేద్యానికి అనువైన పంటలు: వేరుశనగ, నువ్వులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలుపరికరాలపై రాయితీ: అన్ని కులాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులకు గరిష్ఠంగా రూ. 2.18 లక్షలు రాయితీ. బిందు సేద్యం పరికరా లు 90 శాతం రాయితీతో 5 ఎకరాలకు మించకుండా అందిస్తారు. ఐదు ఎకరాలు పైబడిన రైతులకు గరిష్ఠంగా రూ. 3.10 లక్షలు రాయితీ. పరికరాలను 50 శాతం రాయితీతో 12.50 ఎకరాలకు మించకుండా అందిస్తారు. చిన్న, సన్నకారు ఇతర రైతులకు 55 శాతం రాయితీపై పరికరాలు అందిస్తారు. ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 45 శాతం రాయితీపై పరికరాలిస్తారు.ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి..కౌలు రైతులు రాయితీ పొందాలంటే భూ యజమాని నుంచి కనీసం ఏడేళ్ల కౌలు ఒప్పంద పత్రం సమర్పించాలి. ఆధార్, భూ విస్తీర్ణానికి సంబంధిం చిన 1బీ పత్రం, గ్రామ రెవెన్యూ పటం, రేషన్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డుఏపీ సూక్ష్మ నీటి సాగు పథకం

# ఆశలు మునక

తిరుపతి : ఫెయింజల్ తుపాను ప్రభావంతో జిల్లాలో పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. వరితోపాటు ఉద్యాన పంటలు నష్టపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బుధవారం కూడా వర్షాలు పడగా 4,945 హెక్టార్లలో వరి నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా ప్రభుత్వానికి నివేదించారు.

**ఇరకం, వేనాడు దీవుల్లో ముంపులోనే వరి**

వరదతో పులికాట్ సరస్సు పోటెత్తింది. పంటల్లోకి ఉప్పునీరు చేరడంతో ఇరకం, వేనాడు దీవులు నాలుగు రోజులుగా మునకలోనే ఉన్నాయి. వేనాడులో వర్షపునీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తూముల్లోకి పులికాట్ సరస్సు ఉప్పునీరు వెనక్కు మళ్లుతోంది. అతికష్టం మీద రైతులు తూములకు ఇసుక బస్తాలు అడ్డుగా వేసి ఉప్పునీటి ప్రవాహాన్ని అడ్డుకున్నారు. దాదాపు 300 ఎకరాల్లో పంట కుళ్లిపోయే



దశకు చేరింది.

**ఎక్కడెక్కడ.. ఎంత మేర?**

కేవీబీపురం మండలం మిద్దికండ్రిగ, రంగయ్యగుంట, పూడిసీకేపురం, అంజూరు తదితర ప్రాంతాల్లో పంట నీటలోనే ఉంది. బుచ్చినాయుడు కండ్రిగ, గాజులపెల్లూరు, కారణమిట్ట, నీరుప్పకోట తదితర ప్రాంతాల్లో మిర్చికి నష్టం వాటిల్లింది. నారాయణవనం మండలంలో వేరుసెనగకు నష్టం కలిగింది.

నాయుడుపేటలో వరినాట్లు మునకలో ఉన్నాయి. పెళ్లకూరు మండలం చావాలి వాగు కనుమరుగవడంతో వరి పంటలపై వరద పారుతోంది. పొలం గట్లు కోతకు గురై ఇసుక మేటలు వేశాయి.

తిమ్మాజీకండ్రిగ చెరువు అలుగు ఉద్ధృతంగా ప్రవహించడంతో 150 ఎకరాలు నీట మునిగాయి. మేనకూరు ప్రాంతాల్లో లేఅవుట్ల కారణంగా పంట కాలువలు పూడిపోవడంతో వరద పోటెత్తి వద్దిగుంట ప్రాంతాల్లో వరినాట్లు మునిగాయి.

దొరవారిసత్రం మండలంలో తీర ప్రాంత గ్రామాలైన కట్టువాపల్లి, చవటకండ్రిగ, సింగనాలత్తూరు తదితర చోట్ల వరి పంట ఇంకా నీటిలోనే ఉంది. పొలాల్లోకి వెళ్లాలన్నా రైతులు అవస్థలు పడుతున్నారు. ఆనేపూడిలో వర్షాలకు ముందు వేసిన వేరుసెనగ మొలక దశలో పూర్తిగా దెబ్బతింది. కల్లూరు, పోలిరెడ్డిపాలెం, సూరపు అగ్రహారం గ్రామాల్లో కూరగాయల పంటలకు కొంత మేర నష్టం వాటిల్లింది.

జిల్లాలో పంట నష్టం అంచనా (హెక్టార్లలో..)
వరి – 4945 వేరుసెనగ– 161 నర్సరీ – 155 మినుము – 94
పెసర – 6

**మిర్చి, పండ్ల తోటలకు దెబ్బ**

వడమాలపేట, పుత్తూరు, బీఎన్‌కండ్రిగ, పెళ్లకూరు, సూళ్లూరుపేట, ఓజిలి మండలాల పరిధిలో మిర్చి అధికంగా సాగు చేస్తుంటారు. వర్షం నీరు పొలాల్లోనే ఉండటంతో భూమిలోని చెమ్మకు మొక్కలు కింద పడిపోయాయి. భూమిలోని వేర్లు కుళ్లిపోయాయి. పలు ప్రాంతాల్లో కూరగాయలు, పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. మినుము, పెసర పంటకు నష్టం ఏర్పడినట్లు అంచనా వేశారు.

**ఐదు ఎకరాలు నీట మునిగింది**

వారం క్రితం వరినాట్లు వేశాను. మూడెకరాలు సాగు చేశా. చెరువు కలుజు ఉద్ధృతంగా ప్రవహించడంతో కాలువలకు గండ్లు పడి వరద నీరంతా పొలాల్లోకి చేరింది. వర్షాలు తగ్గుముఖం పట్టకుంటే పంటపై ఆశలు వదులుకోవాల్సిందే. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది.వెంకటేశ్వర్లు, రైతు, తిమ్మాజీకండ్రిగ

**పొలం నిండా నీళ్లే**

వరి నాట్లు వేసి పక్షం రోజులు గడుస్తోంది. విడవని వర్షం కారణంగా మొక్కలన్నీ నీళ్లలో మునిగిపోయాయి. వాగు పొంగిపొర్లిన ప్రాంతంలో మొక్కలు చాలా వరకు దెబ్బతిన్నాయి. మళ్లీ సాగు చేయాలంటే కుదరని పరిస్థితి. అందుకే అట్టే వదలి పెట్టాలని అనుకుంటున్నా. సాగుకు వేసిన ఎరువులన్నీ కొట్టుకెళ్లాయి. ఈ వర్షం కారణంగా నష్టతీవ్రత రూ. 50 వేలకు పైమాటే. శ్రీనివాస్, శ్రీకాళహస్తి మండలం

## గోదాము ఇట్టా.. పంట నిల్వ ఎట్టా


బనగానపల్లి : రేనాటి గడ్డ.. ఎస్సార్బీసీ కాల్వ, అవుకు జలాశయం నిర్మాణంతో పచ్చని తిలకం దిద్దుకుంది. గనుల ఖిల్లాలో ఆశలు 'వరి'స్తున్నాయి.. ఇంత వరకు బాగానే ఉన్నా పంట నిల్వ చేసుకోవడానికి గోదాముల్లేవు. రైతుల సౌకర్యార్థం 24 ఎకరాల స్థలంలో బనగానపల్లిలో 1978లో మార్కెట్‌యార్డు నిర్మించారు. అవుకు, బనగానపల్లి మండలాల అన్నదాతల కోసం 500 మెట్రిక్ టన్నులతో గోదామును ఏర్పాటు చేశారు. 2019లో తెదేపా అధికారంలో ఉండగా ఒక్కోటి 1,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండేలా రెండు గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు రూ. 3 కోట్లు కేటాయించారు.. 70 శాతం పనులు పూర్తయ్యాయి.. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. ఈ రెండు మండలాల పరిధిలో 70 వేల మంది రైతులు 60 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు.. 50 వేల ఎకరాలు వరి సాగవుతోంది.. పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి సౌకర్యం లేకపోవడంతో రైతులు ప్రైవేటు గోదాములను ఆశ్రయిస్తున్నారు. యార్డు పరిధిలో వ్యాపారుల నుంచి అధికారులు సెస్ వసూలు చేస్తున్నారు.. ఆ నిధులను ఉపయోగించినా గోదాములు పూర్తయ్యేవి.. కానీ పట్టించుకోలేదు. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి సౌకర్యాలు కల్పించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. " ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి విన్నవించాం..

చురకలు



## 'రాజాసాబ్' డేట్ కు అజిత్ సినిమా..!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "ది రాజాసాబ్". సూపర్ నేచురల్ అంశాలతో కూడిన రొమాంటిక్ హారర్ కామెడీ ఎంటర్టైనర్ ఇది. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాని 2025 సమ్మర్ స్పెషల్ గా ఏప్రిల్ 10న గ్రాండ్ గా రిలీజ్ చేస్తామని చాలా రోజుల క్రితమే మేకర్స్ ప్రకటించారు. అయితే ఇప్పుడు దీనికి పోటీగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీని విడుదల చేయనున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా చిత్రం "గుడ్ బ్యాడ్ అగ్లీ". మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో ఈ భారీ సినిమా రూపొందుతోంది. దీనికి 'మార్క్ ఆంటోనీ' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందు నుంచీ ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ చెబుతూ వచ్చారు. అయితే అజిత్ నటిస్తున్న 'విదా ముయార్చి' మూవీ రేసులోకి రావడంతో వెనక్కి తగ్గారు. ఆ సినిమా కూడా పొంగల్



కు రావడం లేదు. ఈ సంగతి అటుంచితే 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాన్ని ఏప్రిల్ 10న థియేటర్లలోకి తీసుకొస్తామని చిత్ర యూనిట్ తాజాగా అఫిషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్టర్ ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటోంది. అయితే ఆల్రెడీ ఏప్రిల్ 10వ తేదీన 'ది రాజా సాబ్' సినిమా వస్తుందని ప్రకటించగా.. ఇప్పుడు అదే డేట్ కు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాని లాక్ చేయడం ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ సినిమా రాదని క్లారిటీ వచ్చిన తర్వాతే మైత్రీ టీమ్ రిలీజ్ డేట్ ను ప్రకటించి ఉంటారనే కామెంట్లు కూడా వస్తున్నాయి. రాజాసాబ్ సినిమాకి సీజీ వర్క్ ఎక్కువగా ఉండటం వల్ల విడుదల ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రీసెంట్ గా సిద్ధూ జొన్నలగడ్డ 'జాక్' చిత్రాన్ని అదే రోజున ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని వెల్లడించారు. ఇప్పుడు అజిత్ మూవీ కూడా రేసులోకి వచ్చింది. ఇప్పటికైతే ఒకే తేదీకి మూడు సినిమాలు షెడ్యూల్ చేయబడ్డాయి. రానున్న రోజుల్లో వీటిల్లో మార్పులు ఉంటాయేమో చూడాలి. మాస్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా "గుడ్ బ్యాడ్ అగ్లీ" సినిమా తెరకెక్కుతోంది. ఇందులో అజిత్ కుమార్ సరసన త్రిష కృష్ణన్ హీరోయిన్ గా నటిస్తోంది. వీరిద్దరూ కలిసి ఇప్పటి వరకూ జీ, పూర్ణా మార్కెట్, ఎంతవాడు గానీ, గ్యాంబ్లర్, విదాముయార్చి వంటి చిత్రాల్లో నటించారు. సునీల్, అర్జున్ దాస్, రాహుల్ దేవ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. ఇది నిర్మాతలకు ఫస్ట్ తమిళ్ ప్రాజెక్ట్. దాదాపు రూ. 270 కోట్ల బడ్జెట్ ఖర్చు చేస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే రిలీజైన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మరి ఈ సినిమా టాలీవుడ్ ప్రొడ్యూసర్స్ కు ఎలాంటి ఫలితాన్ని అందిస్తుందో చూడాలి.

## 2025 లో దీపికా పదుకొణే జర్నీ ఇలా ఉంటుందా!


దీపికా పదుకొణే కెరీర్ లో గత ఏడాది ఎప్పటికీ గుర్తుండిపోయే ఓ మధుర జ్ఞాపకం. అమ్మడు పండంటి బిడ్డకు జన్మనిచ్చింది 2024 లోనే. కెరీర్ పరంగానూ ఓ రెండు భారీ విజయాలు దీపిక ఖాతాలో నమోదయ్యాయి. ఫైటర్, కల్కి 2898 లాంటి విజయాలు అందుకుంది. సింగం ఎగైన్ లోనూ పోలీస్ గానూ ప్రేక్షకుల్ని అలరించింది. ఇలా 2024దీపికాకు ఓ స్పెషల్ గా నిలిచిపోతుంది. మరి కొత్త ఏడాదిలో కెరీర్ ఎలా ఆరంభించబోతుంది అంటే ఎలాగూ కల్కి 2898 రెండవ భాగం షూటింగ్ లో పాల్గొంటుంది. తొలుత ఈ ప్రాజెక్ట్ నే దీపిక పూర్తి చేస్తుంది. మొదటి భాగంలో దీపిక పాత్ర బలం ఏంటన్నది అర్దమైంది. రెండవ భాగంలో ఆ పాత్ర మరింత బలంగా పండుతుందని అంచనాలున్నాయి. మరి



ఈ ప్రాజెక్ట్ గాక కొత్త సినిమాలేవి పట్టాలెక్కించదా? అంటే దీపిక నుంచి ఏ మాత్రం క్లారిటీ రావడం లేదు. దీపిక ప్రసవం అయిన నాటి నుంచి ఇంటికే పరిమితమైంది. ఎలాంటి ఈవెంట్లకు హాజరు కావడం లేదు. కొత్త ప్రాజెక్ట్ లకు కమిట్ అవ్వడం లేదు. బిడ్డ ఆలనా, పాలనా చూసుకుంటుంది. కుమార్తెకు సంబంధించిన ప్రతీ అనుభూతిని తల్లిగా తాను అందించాలని సమయంతా పాపాయికే కేటాయిస్తుంది. అయితే మరో మూడు నెలలు పాటు దీపిక ఇదే పనిలో ఉంటుంది. ఆ తర్వాతే మళ్లీ కొత్త ప్రాజెక్ట్ ల విషయంలో జోరు పెంచే అవకాశం ఉంది. దీపిక గర్భం దాల్చిన దగ్గర నుంచి కొత్త ప్రాజెక్ట్ లేవి అంగీకరించలేదు. అప్పటికే కమిట్ అయిన చిత్రాలనే పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో 2025 ద్వితియార్థం నుంచి దీపిక కొత్త సినిమాలతో జోరు పెంచే అవకాశం ఉంది. ప్రసవం తర్వాత రూపంలో మార్పులు సహజం. ప్రస్తుతం దీపిక మునుపటి బ్యూటీని తీసుకొచ్చే పనిలోనూ పడ్డట్లు సమాచారం. సోషల్ మీడియాకి కూడా అందుకే దూరంగా ఉంటుందని ప్రచారంలో ఉంది.




## రవీనా టాండన్ కూతురు చలిజ్వరం గ్యారెంటీ




90లలో అద్భుతమైన డ్యాన్సర్ గా, వేడెక్కించే డ్యాన్స్ మూవ్స్ తో కుర్రకారు గుండెల్ని టచ్ చేసిన రవీనా టాండన్ ని యూత్ అంత తేలిగ్గా మర్చిపోలేరు. బాలయ్యబాబు బంగారు బుల్లోడు చిత్రంలో రవీనా గ్లామరస్ పాత్రతో మతులు చెడగొట్టింది. చాలా కాలం తర్వాత పూరి జగన్నాథ్ బుడ్డా హొగా తేరా బాప్ చిత్రంలో నటించింది. ఇటీవల కేజీఎఫ్ 2 లోను రవీనా నటనకు మంచి పేరొచ్చింది. బాహుబలి ఫ్రాంచైజీ సహా చాలా దక్షిణాది చిత్రాలను ఉత్తరాది బెల్ట్ లో విడుదల చేసి భారీగా ఆర్జిస్తున్న టాండన్ ఫిలిం ఎంపైర్లో కీలక సూత్రధారిగా రవీనా గురించి చాలా చర్చ సాగుతోంది. ఇటీవల తన కుమార్తె రాషా తడానీని వెండితెరకు పరిచయం చేయడంలో రవీనా బిజీ ప్రణాళికల్లో ఉంది.

ఇప్పటికే రాషా తడానీ అందచందాలకు యూత్ లో భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. రాషాకు సంబంధించిన ప్రతిదీ నేషనల్ మీడియాలో చర్చగా మారుతోంది. ఇప్పుడు స్టార్ కిడ్ డెబ్యూ గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. అభిషేక్ కపూర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం ఆజాద్‌లో అజయ్ దేవగన్ కజిన్ అమన్ దేవగన్ సరసన రాషా నటిస్తోంది. తాజాగా ఈ చిత్రం నుంచి మోస్ట్ అవైటెడ్ డ్యాన్స్ ట్రాక్ %-%ఉయి అమ్మ%-% విడుదలై ఆకట్టుకుంటోంది. ఈ పార్టీ సాంగ్ లో రాషా తడాని కిల్లర్ మూవ్స్ హృదయాలను గెలుచుకుంటున్నాయి. రాషా అందమైన డ్యాన్సింగ్ స్కిల్స్ తన తల్లి రవీనా టాండన్ ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు పొగిడేస్తున్నారు. ఆరంగేట్రమే నటవారసురాలు తనదైన ముద్ర వేసింది. ముఖ్యంగా తన అందమైన నడుమును ఊపుతూ రాషా చాలా మాయాజాలం సృష్టించింది. డ్యాన్స్ నంబర్‌లో రాషా తన అద్భుతమైన డ్యాన్స్ కదలికలతో డ్యాన్స్ ఫ్లోర్‌ను మరిగించింది.

ఉయీ అమ్మకు మధుబంతి బాగ్చి స్వరాలు అందించగా, అమితాబ్ భట్టాచార్య సాహిత్యం అందించారు. బోస్కో లెస్లీ మార్టిస్ నృత్య దర్శకత్వం వహించారు. ఈ ట్రాక్ సాంప్రదాయ, సమకాలీన శైలులను మిళితం చేసిన ప్రత్యేక గీతం అని చెప్పాలి. ఆజాద్ 17 జనవరి 2025న పెద్ద తెరపైకి వస్తుంది.

## సూపర్‌స్టార్ భార్య మతమార్పిడిపై రచ్చ!



ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా కులమతాల గురించి చర్చ సాగుతోంది. సోషల్ మీడియా యుగంలో వేగంగా కులమత విద్వేషాలు చెలరేగే ప్రమాదం పొంచి ఉంది. సెలబ్రిటీలు కొంత ముప్పును ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మతాంతర ప్రేమ వివాహం చేసుకున్న సూపర్‌స్టార్ షారూఖ్‌కి ఇప్పుడు నింద ఎదురైంది. షారూఖ్ మూడు దశాబ్దాల సంసార జీవనం అనంతరం తన భార్య గౌరీతో మతమార్పిడి చేయించాడనేది నెటిజనుల అభియోగం. అంతేకాదు గౌరీఖాన్ హిజాబ్ ధరించిన ఓ ఫోటోని వైరల్ చేస్తున్నారు.

షారూఖ్ తన భార్య గౌరీ ఖాన్, పెద్ద కుమారుడు ఆర్యన్ ఖాన్‌తో కలిసి మక్కాలో ప్రార్థనలు చేస్తున్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో గౌరీ నలుపు కుర్తీ , బూడిద రంగు హిజాబ్ ధరించి కనిపిస్తోంది. మరోవైపు కింగ్ ఖాన్ తెల్లటి కుర్తాలో సింపుల్ గా ఉన్నాడు. ఆర్యన్ కూడా వారి వెనుక నిలబడ్డాడు. ఈ ఫోటో వైరల్ కాగానే ఖాన్ కుటుంబం మక్కాలో కొత్త సంవత్సరాన్ని స్వాగతించిందరని పలువురు నెటిజనులు పేర్కొన్నారు. ఇది మాత్రమే కాదు షారూఖ్ భార్య గౌరీ కూడా ఇస్లాం మతంలోకి మారిందని కొందరు పేర్కొన్నారు. అయితే ఇప్పుడు వైరల్ అవుతున్న ఫోటో వెనుక అసలు నిజం బయటపడింది. నిజానికి మక్కాలో ఖాన్ కుటుంబం వైరల్ ఫోటో పూర్తిగా ఫేక్. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి రూపొందించిన ఫోటో అని ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది. బాలీవుడ్ లో సూపర్‌స్టార్ గా తనను తాను ఆవిష్కరించుకున్న షారుఖ్ ఖాన్ ముస్లిం అయితే, గౌరీ ఇంటీరియర్ డిజైనర్ గా సుప్రసిద్ధురాలు. గౌరీ పంజాబీ హిందూ కుటుంబంలో జన్మించింది. ఈ జంట 1991లో పెళ్లి చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు - ఆర్యన్, సుహానా ఖాన్, అబ్రామ్ ఖాన్ ఉన్నారు. తమ ప్రేమ వివాహంలో ఏవైనా చిక్కులు ఉన్నాయా? అనే ప్రశ్నకు 2005లో కాఫీ విత్ కరణ్‌లో గౌరీ స్పష్టతనిచ్చారు. తామిద్దరం మతానికి అతీతంగా ఒకరికొకరు గౌరవించుకుంటామని గౌరీ తెలిపారు. నేను ముస్లిమ్ గా మారనవసరం లేదు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా వారి మతాన్ని అనుసరిస్తారు. పరస్పర గౌరవం అవసరం. షారూఖ్ నా మతాన్ని ఎప్పటికీ అగౌరవపరచడు.. నేను అతడిని అగౌరవపరచను... అని గౌరీఖాన్ తెలిపారు. కెరీర్ మ్యాటర్‌కి వస్తే.. షారుక్ ఖాన్ తదుపరి కింగ్‌లో నటిస్తున్నారు.. ఈ సినిమాలో ఆయన కూతురు సుహానా ఖాన్ కీలక పాత్రను పోషిస్తుండగా, అభయ్ వర్మ ఒక ప్రధాన పాత్రను పోషిస్తున్నారు.

కింగ్ చిత్రానికి వాస్తవంగా సుజోయ్ ఘోష్ దర్శకత్వం వహించాల్సి ఉండగా, ఇప్పుడు పఠాన్ ఫేం సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా రిలీజ్ తేదీ ఇతర వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## మైనస్ 30 డిగ్రీల చలిలో బికినీ బ్యూటీ సాహసం

మ్యూజిక్ వీడియోలు, మోడలింగ్ అసైన్ మెంట్స్ తో పాపులారిటీ పెంచుకుంది ముంబై బ్యూటీ సాక్షి మాలిక్. ఫిట్‌నెస్ వీడియోలతోను ఇన్‌స్టాలో ఫాలోయింగ్ పెంచుకుంది. ఈ బ్యూటీ కార్తీక్ ఆర్యన్ నటించిన సోను కే టిటు కి స్వీటీలో బోమ్ డిగ్గీ డిగ్గీ... పాటలో మెరుపులు మెరిపించింది. సాక్షి స్టన్నింగ్ అప్పియరెన్స్ ఇప్పటికీ యూట్యూబ్ లో కుర్రకారుకు స్పెషల్ ట్రీట్ అనడంలో సందేహం లేదు. సాక్షి సోషల్ మీడియాల్లోను స్పీడ్ గా ఉంది. ఇన్ స్టాలో లక్షల్లో ఫాలోవర్స్ ని సంపాదించిన ఈ బ్యూటీ నిరంతర ఫోటోషూట్లతో వేడెక్కిస్తోంది. తాజాగా సాక్షి పింక్ బికినీలో స్పెషల్ ఫోటోషూట్‌ని షేర్ చేసింది. ఈ ఫోటోలలో రకరకాల భంగిమల్లో సాక్షి ఇచ్చిన ట్రీట్ యువతరం హృదయాలను దోచుకుంది. పింక్ బికినీలో సాక్షి అందాల జాతార ఫిదా చేస్తోంది. మైనస్ 30 డిగ్రీల చలిలో బికినీ షూట్ లో పాల్గొన్నట్టు సాక్షి తెలిపింది. గత వారం 30 డిగ్రీల వేడి వాతావరణంలో ఉన్నాను. ఇప్పుడు చలికి గడ్డకట్టే వాతావరణంలో ఫోటోషూట్ లో పాల్గొన్నట్టు వెల్లడించింది. ఈ ముంబై బ్యూటీ టాప్



మోడల్ గా టీవీ కమర్షియల్స్ తో ఆడియెన్ కి చేరువైంది. మారుతి ఆటో ఎక్స్ పో-2020 వేదికపై బ్రాండ్ అంబాసిడర్ గా హృదయాలను దోచుకుంది. ఆ తర్వాత సాక్షి సినీరంగంపై దృష్టి సారించింది. సాక్షి మాలిక్ ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జన్మించింది. నోయిడాలోని జేపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీని పూర్తి చేసింది. కళాశాల సమయంలో ఆమె ఫ్యాషన్ షోలలో పాల్గొన్నది. గ్రాడ్యుయేషన్ తర్వాత, సాక్షి మాలిక్ ముంబైకి వెళ్ళింది. నైకా, పిసి జ్యువెలర్‌తో సహా బ్రాండ్‌ల టెలివిజన్ వాణిజ్య ప్రకటనల కోసం మోడలింగ్ చేసింది.. 2018లో సోను కే టిటు కి స్వీటీ లో నటిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. 2020 తెలుగు సినిమా వి (నాని-ఇంద్రగంటి-సుధీర్ బాబు)లో కమర్షియల్ సెక్స్ వర్కర్ గా తన ఫోటోని ఉపయోగించుకున్నారు. దీనికి అభ్యంతరం చెబుతూ సాక్షి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. మార్చి 2021లో హైకోర్టు అమెజాన్ ప్రైమ్‌ను ఆ సినిమాను తొలగించాల్సిందిగా ఆదేశించింది. అనుమతి లేకుండా ఫోటోను ఉపయోగించినందున సాక్షి కేసు ఫైల్ చేసింది. అటుపై వి సినిమాని ఓటీటీ నుండి తొలగించారు. అయితే వివాదాన్ని మేకర్స్ మాట్లాడి పరిష్కరించుకున్నారు. 2020లో వేహం.. 2023లో ములాఖత్ అనే ఆల్బమ్స్‌లో కనిపించింది.

## ఆరోజే మాళవికలో నటిని గుర్తించిన మిస్టర్‌పర్ఫెక్ట్

మాళవిక మోహనన్ పరిచయం అవసరం లేదు. 2024 కోలీవుడ్ బ్లాక్ బస్టర్ తంగళన్‌లో నటించింది. చియాన్ విక్రమ్ సినిమాలో కీలక పాత్రతో అదరగొట్టేసింది. మాళవికలో వెర్సటైలిటీకి వీరాభిమానులేర్పడ్డారు. అంతకుముందు మాస్టర్, పేట లాంటి భారీ చిత్రాల్లో మాళవిక నటనకు మంచి పేరొచ్చింది. కోలీవుడ్ లో నటించే సమయంలోనే టాలీవుడ్ లోను మాళవిక చేయని ప్రయత్నం లేదు. తెలుగులో పలువురు హీరోల సినిమాలకు కమిటైంది. దేవరకొండతో హీరో అనే చిత్రంతో ఈపాటికే తెలుగు చిత్రసీమకు పరిచయం కావాల్సి ఉన్నా, ఆ సినిమా షూటింగ్ మధ్యలోనే ఆగిపోయింది. కానీ ఇప్పుడు ఏకంగా పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ సరసన టాలీవుడ్ కి పరిచయమవుతోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజా సాబ్ లో మాళవిక కథానాయికగా నటించింది. రాజా సాబ్ త్వరలోనే



విడుదల కానుంది. ఇంతలోనే మాళవిక గురించి కొన్ని కొత్త విషయాలు బయటపడుతున్నాయి. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మోహనన్ కుమార్తెగా మాళవికకు అన్ని పరిశ్రమలలోను ప్రముఖులతో అనుబంధం ఉంది. అలా బాలీవుడ్ లోను మాళవిక ఫేమస్. ముఖ్యంగా బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ లాంటి స్టార్ తనను చిన్నప్పుడే గుర్తించారు. కాలేజీ అమ్మాయిగా ఉన్నప్పుడే తను మంచి నటిని కాగలనని అమీర్ ఖాన్ అన్నారట. తలాష్ సెట్స్‌లో కలిసినప్పుడు మాళవికలో ప్రతిభను అమీర్ గుర్తించారు. ఈ విషయాన్ని మాళవిక ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అమీర్ మెచ్చుకోవడంతో నిజంగా మాళవిక నటిగా స్ఫూర్తిని పొందింది. మలయాళం, తమిళం, హిందీ పరిశ్రమలలో మాళవిక పెద్ద స్టార్ గా నిరూపించుకోవాలని తపిస్తోంది. ముఖ్యంగా తెలుగులో ఇతర స్టార్ హీరోయిన్లకు ధీటుగా పోటీపడాలని భావిస్తోందట. ఇక్కడ పెద్ద హీరోల సరసన అవకాశాల కోసం సీరియస్ గా ప్రయత్నిస్తోంది. అయితే అన్నిటికీ రాజా సాబ్ సమాధానం. ఈ సినిమాతో పాన్ ఇండియా హిట్ అందుకుని, తదుపరి పెద్ద ప్లానింగ్ తో ముందుకు సాగాలని ఆలోచిస్తోందట.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536